


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడి
కారు బాంబు పేలుడులో 12 మంది మృతి 02

సంపుటి 28, సంచిక: 142 | బుధవారం | 12-11-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

# ఢిల్లీ పేలుడు కేసు ఎన్ఐఎ చేతికి

ఉగ్రచర్యగా పరిగణిస్తున్న కేంద్ర ప్రభుత్వం

13కు చేరిన మృతుల సంఖ్య

నేరస్థులను వేటాడి పట్టుకోవాలని హోంమంత్రి అమిత్ షా ఆదేశం

ఉన్నతాధికారులతో రెండుదఫాలు సమీక్ష



**న్యూఢిల్లీ :** ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ)కు మంగళవారం నాడు హోం మంత్రిత్వ శాఖ మంగళవారం అప్పగించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకూ 13 మంది ప్రాణాలు కోల్పోయిన ఈ పేలుడు ఘటనను కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాద చర్యగా పరిగణిస్తున్నట్లు తెలుస్తుంది. సాధారణంగా ఉగ్రవాద కేసులను మాత్రమే ఎన్ఐఎ దర్యాప్తు చేస్తుందని 'పిటిఐ' సంస్థ తన కథనంలో పేర్కొంది. ఎన్ఐఎకు ఈ కేసును అప్పగించడం ద్వారా కేంద్రం పేలుడు ఘటన వెనుక ఉగ్రసంబంధాలు ఉన్నట్లు భావిస్తున్నట్లు అర్థమవుతోంది. పేలుడు తర్వాత దేశ రాజధాని ఢిల్లీ, దేశంలోని ఇతర ప్రాంతాలలో భద్రతా పరిస్థితిని కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమీక్షించిన కొద్ది గంటల తర్వాత ఈ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

**వేటాడి పట్టుకుంటాం :** ఢిల్లీ పేలుడు వెనుక ఉన్న ప్రతి ఒక్క నేరస్థుడిని వేటాడి పట్టుకోవాలని అధికారులను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదేశించారు. పేలుడు చర్యలో భాగస్వామి అయిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంస్థల సంపూర్ణ ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన మంగళవారం రెండు సార్లు భద్రతా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. తొలుద ఉదయం, ఆ తరువాత మధ్యాహ్నం ఈ సమావేశాలను జరిపారు. మొదటి సమావేశంలో కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవంద్ మోహన్, ఇంటెలిజెన్స్ బ్యూరో తరువాయి 2లో





# అందెశ్రీకి అంతిమ వీడ్కోలు

● ఘట్‌కేసర్‌లో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు ● భారీగా తరలివచ్చిన అభిమానులు, సాహితీ ప్రియులు ● అంతిమయాత్రలో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు ● పాడేమోసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ● జయ జయహే తెలంగాణ గీతాన్ని పాఠ్యాంశంలో చేరుస్తాం

అందెశ్రీ పేరుతో స్మృతి వనం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్/ మేడ్చల్ మల్కాజ్‌గిరి

ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ అంత్యక్రియలు మంగళవారం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్‌లో ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో జరిగాయి. ఎంతోకాలంగా అత్యంత సన్నిహితంగా మెలిగిన అందెశ్రీ ఆకస్మిక మరణంతో భారమైన హృదయంతో ముఖ్యమంత్రి అంతిమయాత్రలో పాల్గొని అశ్రునివాళి అర్పించారు. అంతిమయాత్రలో పాల్గొన్న ముఖ్యమంత్రి అందెశ్రీ పాడె మోశారు. వేలాదిగా తరలివచ్చిన అభిమానులు, సాహితీప్రియులు అక్షరయోధుడు అందెశ్రీకి కడసారి వీడ్కోలు పలికారు. మొదట లాలాపేట్ జయశంకర్ స్టేడియం నుంచి తార్నాక, ఉప్పల్ మీదుగా ఘట్‌కేసర్ ఎన్‌ఎఫ్‌సి నగర్ వరకు అంతిమ యాత్ర కొనసాగింది. కళాకారుల నాట్యాలు, డప్పు చప్పుళ్ల మధ్య కొనసాగిన అంతిమ యాత్రలో పలు తరువాయి 12లో

# కారు నడిపింది పుల్వామా వైద్యుడు

● అనుమానితుడిగా భావిస్తున్న దర్యాప్తు సంస్థలు ● పేలుడులో మరణించిన డాక్టర్ ఉమర్ నబీ ● నిర్ధారణ కోసం తల్లి డిఎన్ఎ నమూనా సేకరణ ● ఢిల్లీలో హై అలర్ట్, కశ్మీర్‌లోనూ గాలిస్తున్న భద్రతాదళాలు ● ఘటనపై ఉపా కింద కేసు నమోదు



**న్యూఢిల్లీ / శ్రీనగర్ :** ఎర్రకోట సమీపంలో సోమవారం పేలుడు సంభవించిన కారును నడుపుతున్న వ్యక్తిని పుల్వామాకు చెందిన వైద్యుడు డాక్టర్ ఉమర్ నబీ అని మంగళవారం నాడు ఎన్ఐఎ, పోలీసులు అనుమానిస్తున్నారు. పేలుడులో ఆయన మరణించినట్లు భావిస్తున్నారు. ఈ ఘటనలో ఇప్పటి వరకు 13 మంది మరణించారు. జమ్మూ కాశ్మీర్ పోలీసులు డాక్టర్ ఉమర్ నబీ తల్లి నుండి మంగళవారం నాడు డిఎన్ఎ నమూనాను సేకరించారు. ఫరీదాబాద్‌లో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్న ఉగ్రకుట్రతో ఆయనకు సంబంధాలున్నాయని భావిస్తున్నారు. 'పిటిఐ' వార్తా సంస్థ కథనం ప్రకారం 'పేలుడు జరిగిన ప్రదేశంలో లభించిన అవయవాల భాగాలతో సరిపోల్చేందుకు మేము డిఎన్ఎ నమూనాను తీసుకున్నామ'ని శ్రీనగర్‌లో ఒక అధికారి తెలిపారు. పేలిన తరువాయి 2లో

అమిత్ షా రాజీనామా చేయాలి : కాంగ్రెస్ 05

## బెట్టింగ్ యాప్ కేసు

సిట్ విచారణలో విజయ్‌దేవరకొండ



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రముఖ సినీ నటుడు విజయ్ దేవరకొండ మంగళవారం లక్డికాపూల్‌లోని సిఐడి సిట్ అధికారుల ముందు విచారణకు హాజరయ్యారు. బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన కేసులో సిట్ అధికారులు విజయ్‌ను మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు ప్రశ్నించారు. నిషేధిత బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన వ్యవహారంలో విజయ్ దేవరకొండ సహా పలువురు ప్రముఖులకు సిట్ అధికారులు నోటీసులు జారీ చేసిన విషయం విదితమే. ఇదివరకే పలువురిని విచారించిన సిట్ అధికారులు, తాజాగా విజయ్‌ను ప్రశ్నించారు. బెట్టింగ్ యాప్‌ల నుంచి తీసుకున్న పారితోషికం, కమీషన్లపై సిట్ అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. విచారణకు హాజరు కావాలని విజయ్ దేవరకొండతో పాటు నటుడు ప్రకాశ్ రాజ్‌కు కూడా సిఐడి సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. బెట్టింగ్ యాప్‌లకు సంబంధించి తెలుగు రాష్ట్రాల్లోని వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ప్రకాశ్‌రాజ్‌ను త్వరలో విచారించే అవకాశాలు ఉన్నాయి.

## నిందితులను వదిలేది లేదు

ప్రధాని మోదీ



ఢిల్లీలో జరిగిన పేలుడు ఘటనను ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. నిందితులను ఎట్టి పరిస్థితుల్లో కూడా వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. భూటాన్ పర్యటనకు వెళ్లిన ప్రధాని మోదీ, ఆ దేశ రాజధాని థింపులో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'ఈ రోజు నేను చాలా బరువెక్కిన హృదయంతో ఇక్కడికి వచ్చా. సోమవారం తరువాయి 2లో

## పారదర్శకంగా సమగ్ర దర్యాప్తు

సిపిఐ డిమాండ్



ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటన పట్ల సిపిఐ తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు హృదయపూర్వక సంతాపాన్ని తెలియజేసింది. గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేసింది. ఈ మేరకు సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం మంగళవారం ఒక పత్రికా ప్రకటనను విడుదల చేసింది. ఈ సంఘటనపై సమగ్రమైన, పారదర్శకమైన, నిర్ణీత వ్యవధితో కూడిన దర్యాప్తు చేయాలని సిపిఐ డిమాండ్ చేసింది. క్షతగాత్రులకు సాధ్యమైనంత మెరుగైన వైద్య చికిత్సను ప్రభుత్వం అందించాలని, శాంతి , ప్రజల రక్షణను పరిరక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

# బిహార్ రెండో విడతలోనూ భారీ ఓటింగ్

● 68.79 శాతం నమోదు ● పోలింగ్ కేంద్రాలవద్ద బారులు తీరిన ఓటర్లు ● చెదురు మదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతం



**పాట్నా:** బిహార్ అసెంబ్లీకి తుది విడత (రెండో విడత) పోలింగ్ ప్రక్రియలో ఎన్నడూలేనంత అత్యధికంగా 68.79 శాతం పోలింగ్ జరిగింది. ఈ విడత పోలింగ్‌లో నితీశ్ కుమార్ మంత్రివర్గంలోని ఎనిమిది మంది మంత్రులతో సహా మొత్తం 1,302 మంది అభ్యర్థుల భవిష్యత్తు ఓటింగ్ యంత్రాలలో నిక్షిప్తమైంది. ఈనెల 6వ తేదీ తొలి విడత జరిగిన 65.09 శాతం పోలింగ్ కంటే రెండో విడతలో మొత్తం 3.70 కోట్ల మంది అర్హులైన ఓటర్లు 122 తరువాయి 2లో

**ఎగ్జిట్ పోల్స్‌లో ఎన్‌డిఎకు ఆధిక్యం**

| | సర్వే సంస్థ | ఎన్డీయే | ఎంజీబీ | జేఎస్పీ | ఇతరులు |
|---|---|---|---|---|---|
| 1 | పీపుల్స్ పల్స్ | 133-159 | 75-101 | 0-5 | 2-8 |
| 2 | మ్యాట్రిజ్ | 147-167 | 70-90 | 0-2 | 2-8 |
| 3 | పీపుల్స్ ఇన్‌సైట్ | 133-148 | 87-102 | 0-2 | 3-6 |
| 4 | దైనిక్ భాస్కర్ | 145- 160 | 73-91 | 0-3 | 5-7 |
| 5 | జేవీసీ పోల్స్ | 135-150 | 88-103 | 0-1 | 5-7 |
| 6 | పీ-మార్క్ | 142-162 | 80-98 | 1-4 | 0-3 |
| 7 | చాణక్య స్ట్రాటజీస్ | 130-138 | 100-108 | 0 | 3-5 |
| 8 | డీవీ రీసెర్చ్ | 137-152 | 83-98 | 2-4 | 1-8 |
| 9 | టీఐఎఫ్ రీసెర్చ్ | 146- 163 | 76-95 | 0 | 3-6 |

# జూబ్లీహిల్స్@48 శాతం

● ఉప ఎన్నిక ఫలితాలపై రాజకీయపక్షాలు, ప్రజల్లో ఉత్కంఠ ● కొన్నిచోట్ల చెదురుమదురు ఘటనలు ● యూసుఫ్‌గూడలో బిఆర్‌ఎస్ నేతల ఆందోళన ● పాడి కౌశిక్‌రెడ్డి అరెస్ట్ ● స్థానికేతరులపై ఎన్నికల సంఘం సీరియస్



ప్రజాపక్షం/హైదరాబాద్

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉపఎన్నిక పోలింగ్ చెదురుమదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. అటు రాజకీయ పక్షాల్లో ఇటు రాష్ట్ర ప్రజల్లో తీవ్ర ఉత్కంఠతకు తెరతీసిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ముగిసింది. ఇక ఈనెల 14న జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియపై అందరిలో ఆసక్తి పెరిగిపోయింది. అయితే ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. అయితే సాయంత్రం 6 గంటలలోపు క్యూలైన్‌లలో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నట్లు తరువాయి 2లో

**జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు మెజారిటీ**

పలు సంస్థల ఎగ్జిట్ పోల్స్ అంచనాలు

| ఏజెన్సీ | కాంగ్రెస్ (ఓట్లశాతం) | బిఆర్‌ఎస్ (ఓట్లశాతం) | బిజెపి (ఓట్లశాతం) |
|---|---|---|---|
| చాణక్య స్ట్రాటజీస్ | 46 శాతం | 43 శాతం | 6 శాతం |
| హెచ్‌ఎంఆర్ | 48.3 శాతం | 43.18 శాతం | 5.84 శాతం |
| స్మార్ట్ పోల్ సర్వే . | 48.2 శాతం | 42.1 శాతం | 7.6 శాతం |
| పబ్లిక్ పల్స్ | 48.5 శాతం | 41.8 శాతం | 6.5 శాతం |



# బీజాపూర్‌లో భారీ ఎన్‌కౌంటర్

● ఇంద్రావతి నేషనల్ పార్క్ ప్రాంతంలో భీకర ఎదురుకాల్పులు ● ఆరుగురు మావోయిస్టులు మృతి ● లొంగిపోయినవారు రాజకీయ ద్రోహులు : నక్సల్స్ లేఖ

**రాయ్‌పూర్/ఖమ్మం :** ఛత్తీస్‌గఢ్ బీజాపూర్‌లో మంగళవారం మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య భీకర ఎదురుకాల్పులు జరిగాయి. ఇంద్రావతి నేషనల్ పార్క్ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగిందని పోలీసులు ధ్రువీకరించారు. ఇప్పటి వరకు ఆరుగురు మావోయిస్టులు మృతి చెందినట్లుగా పోలీసులు తెలిపారు. ఎన్‌కౌంటర్‌ను బీజాపూర్ ఎస్‌పి జితేంద్ర యాదవ్ ధ్రువీకరించారు. ఇంద్రావతి నేషనల్ పార్క్ ప్రాంతంలో భద్రతా దళాల బృందం నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో పాల్గొందని.. ఈ సమయంలో అక్కడ దాక్కున్న మావోయిస్టులు కాల్పులు జరిపారని.. భద్రతా దళాలు దీటుగా బదులిచ్చాయని ఎస్‌పి పేర్కొన్నారు. ఉదయం పది గంటల నుంచి కాల్పులు జరుగుతున్నట్లుగా ఆయన వివరించారు. డీఆర్‌జీ బీజాపూర్, దంతేవాడ, ఎస్‌టిఎఫ్ సంయుక్త బృందాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారన్నారు. సెర్చ్ ఆపరేషన్ సమయంలో సంఘటనా స్థలంలో ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఇన్సాస్, స్టెన్‌గన్, 303 రైఫిల్స్‌తో పాటు ఇతర ఆయుధాలు, పేలుడు పదార్థాలను, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ పీ మాట్లాడుతూ డిఆర్‌జి, ఎస్‌టిఎఫ్, బస్తర్ ఫైటర్స్, సిఆర్‌పిఎఫ్, సిఎఎఫ్ దళాలను చుట్టుపక్కల ప్రాంతాలకు పంపినట్లు ఐజి పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్‌లో తరువాయి 12లో

## మొంథా తక్షణ సాయం రూ.12.99 కోట్లు

● పలు జిల్లాల్లో దెబ్బతిన్న ఇళ్లకు రూ.15వేల చొప్పున సాయం ● నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

ప్రజాపక్షం/హైదరాబాద్

మొంథా తుఫాను ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలు, వరదలలో నష్టపోయిన కుటుంబాలకు రూ.12.99 కోట్ల తక్షణ సాయం అందిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలతో దెబ్బతిన్న ఇళ్ళకు రూ.15,000 చొప్పున సాయం అందిస్తూ తరువాయి 12లో



ప్రజాపక్షం/హైదరాబాద్

## హైదరాబాద్ మహానగరంలో చిక్కులు లేని ప్రయాణం


● సమగ్ర ప్రణాళికల రూపకల్పనకు సర్కార్ ఆదేశం ● 2050 సంవత్సరాలకు అవసరమయ్యే ప్రణాళికలపై ప్రభుత్వం దృష్టి ● హెచ్‌ఎండిఎకు బాధ్యతల అప్పగింత

భవిష్యత్‌లో హైదరాబాద్‌లో చిక్కులులేని ప్రయాణ సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. భవిష్యత్ 2050 వరకు అవసరయ్యే సదుపాయాలు ఇప్పటి నుంచి ప్రారంభించాలని సర్కార్ నిర్ణయించింది. రాబోయే 2050 సంవత్సరాలకు అవసరమయ్యే ప్రణాళికలపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఈ బాధ్యతలను ప్రభుత్వం హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండిఎ)కు అప్పగించింది. హైదరాబాద్ మహానగరం పరిధిలో సుస్థిర రవాణా కోసం వ్యూహాత్మక ప్రణాళికలు రూపొందించే పనిలో పడ్డారు. హెచ్‌ఎండిఎ ఇతర ప్రభుత్వ సంస్థలతో సమన్వయంతో ఈ సమగ్ర రవాణా ప్రణాళికను రూపొందించేందుకు కసరత్తు ప్రారంభించింది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హెచ్‌ఎండిఎ ద్వారా హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతం (హెచ్‌ఎంఎ) కోసం సమగ్ర మొబిలిటీ ప్రణాళిక (కాంప్రేసివ్ మొబిలిటీ ప్లాన్ సిఎంపి) తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## కెనడా రచయిత డేవిడ్ సలేకు బుకర్ ప్రైజు



**లండన్:** కెనడాలో జన్మించిన హంగేరీ–బ్రిటన్ రచయిత డేవిడ్ సలే (51) కు 2025 బుకర్ బహుమతి లభించింది. ఆయన రాసిన 'ఫ్లెష్'కు ఈ బహుమతి లభించింది. లండన్‌లోని ఓల్డ్ బిల్లింగ్స్‌గేట్‌లో కన్నుల పండువగా జరిగిన కార్యక్రమంలో బుకర్ ప్రైజు విజేతను ప్రకటించారు. ఆయనకు 50,000 పౌండ్ల నగదు బహుమతితోపాటు గత ఏడాది బుకర్ విజేత సమంతా హార్వే నుండి ట్రోఫీ కూడా లభించింది. రచయిత సలే 1974లో కెనడాలోని మోంట్రియల్‌లో జన్మించారు. బ్రిటన్‌లో పెరిగారు. ఆయన తండ్రి హంగేరియన్. వారి కుటుంబం అతడి బాల్యంలోనే బీరూట్‌కు చేరింది. లెబనాన్‌లో అంతర్యుద్ధం కారణంగా అనివార్యంగా ఆ దేశాన్ని బ్రిటన్ చేరుకుంది. బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో సలే పట్టా పొందారు. బిబిసి కోసం ఆయన అసంఖ్యామైన నాటకాలు రాశారు. 2018లో ఆయన చిన్న కథలు 'టర్బులెన్స్' ప్రచురితమైంది. భావోద్వేగం, నిర్లిప్తత, కోరికలు, పతనం వంటివన్నీ కలగలిసిన ఫ్లెష్‌ను బుకర్ న్యాయమూర్తులు ఎంతగానో ప్రశంసించారు.

## ఇరాక్‌లో పార్లమెంటు ఎన్నికలు
### షియాల సద్రిస్ట్ మూమెంట్ బహిష్కరణ

**బాగ్దాద్:** బహిష్కరణ పిలుపు మధ్య ఇరాక్ పార్లమెంటుకు మంగళవారం ఎన్నికలు జరిగాయి. ఐతే షియా తెగకు చెందిన మత గురువు ముక్తాదా అల్ సాదర్ నాయకత్వానగల ప్రజాదరణ పొందిన సద్రిస్ట్ మూమెంట్ ఈ ఎన్నికల ప్రక్రియను బహిష్కరించింది. ఇరాక్ సుప్రీం జుడీషియల్ కౌన్సిల్ అధిపతి వెబ్‌సైటులో ఒక ప్రకటన చేస్తూ, వాస్తవానికి దేశంలో నవంబరు 24న ఎన్నికలు జరగాల్సి ఉందని, కానీ మంగళవారం జరుగుతున్నాయని వివరించింది. ఈ పరిస్థితుల్లో ఎన్నికల ఫలితాలు కూడా న్యాయస్థానంలో పరీక్షకు గురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2021 పార్లమెంటు ఎన్నికల్లో అల్ సాదర్ ఎక్కువ సీట్లు గెలుచుకున్నారు. కానీ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ప్రత్యర్థి షియా గ్రూపులతో జరిపిన సంప్రదింపుల్లో ప్రతిష్టంభన వల్ల ఆయన విఫలమయ్యారు. సద్దాం హుస్సేన్ పాలనలో అమెరికా దాడిని ఎదుర్కొనడమేకాకుండా ఇరాన్‌తో పదేళ్ళు యుద్ధాన్ని చవిచూసి అతలాకుతలమైన ఇరాక్‌దేశం ఇప్పుడిప్పుడే కుదుటపడి సాధారణస్థితికి చేరుకుంటున్న దశలో పార్లమెంటుకు కీలక ఓటింగ్ ప్రక్రియ జరిగింది. గడచిన రెండు సంవత్సరాలుగా పశ్చిమ ఆసియాలో అనేక పరిణామాలు సంభవించాయి. గాజా యుద్ధం, లెబనాన్‌లో యుద్ధ దాడులు, దక్షిణ ఇజ్రాయెల్‌పై హమాస్ దాడులతోపాటు గడచిన జూన్ నెలలో ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం, సిరియా అధ్యక్షుడు బషర్ అల్‌అసద్ గత ఏడాది డిసెంబరులో పదవీచ్యుతుడై దేశం నుండి పారిపోవడం వంటి కీలకమైన పరిణామాలు సంభవించిన తరుణంలో ఇరాక్ పార్లమెంటు ఎన్నికలు జరుగుతున్నాయి. పైగా అటు ఇరాన్, ఇటు అమెరికా దేశాలు ఈ ఎన్నికలను చాలా నిశితంగా గమనిస్తున్నాయి. మొత్తం 3.20 కోట్ల మంది అర్హులైన ఓటర్లలో కేవలం 2.14 కోట్లమంది మాత్రమే తమ సమాచారాన్ని ఎన్నికల సంఘం వద్ద పునరుద్ధరించుకుని పోలింగ్‌లో పాల్గొనేందుకు సన్నద్ధమయ్యారు. 2021లో పార్లమెంటుకు జరిగిన ఎన్నికల కంటే ఈసారి తక్కువమంది ఓటర్లు పేర్లు పునరుద్ధరించుకున్నారు. ఐదేళ్ళక్రితం ఎన్నికల్లో 2.40 కోట్లమంది పోలింగ్‌లో పాల్గొన్నారు.

## నైజీరియాలో 200 మంది మృతి



**అబుజా:** పశ్చిమ ఆఫ్రికాదేశం నైజీరియా ఈశాన్యప్రాంతంలో ప్రత్యర్థి జీహాదీ గ్రూపులమధ్య జరిగిన ఘర్షణల్లో 200 మంది మరణించారు. నవంబరు తొమ్మిదో తేదీన ఈ ఘర్షణలు ప్రారంభమయ్యాయి. ఛాడ్ తీరంలో ఉన్న దోగన్ చికూలో బోకో హరామ్, దాని ప్రత్యర్థి ఉగ్రవాద గ్రూపు ఇస్వాప్ ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులకు మధ్య ఈ ఘర్షణలు చెలరేగాయి. ఈ పోరాటంలో 200 మంది ఇస్వాప్ ఉగ్రవాదులు హతులైనట్లు నైజీరియా సైన్యానికి సహాయం చేసే జీహదీ వ్యతిరేక సంస్థ సభ్యుడు బాబాకురా కోలో చెప్పారు. ఈ పరస్పర హింసాకాండలో నలుగురు బోకోహారం ఉగ్రవాదులు మరణించారు. ఇస్లామిక్ స్టేట్‌గ్రూపునకు ఎంతో విధేయంగా ఉండే ఇస్వాప్ 2016లో బోకోహారమ్ గ్రూపు విడిపోయింది. ఆ తర్వాత నుండీ ఇస్వాప్,బోకోహారమ్ జీహదీ గ్రూపులమధ్యా తీవ్ర హింసాత్మక ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ తాజా ఘర్షణ వాటిల్లో అత్యంత తీవ్రమైనది. నైజీరియా,నిగర్,ఛాడ్, కామెరూన్‌లలో విస్తరించి ఉన్న ఒక పెద్ద మంచినీటి సరస్సును ఆశ్రయించుకుని ఈ ఉగ్రవాద గ్రూపులు పనిచేస్తున్నాయి.

# ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడి

**కారు బాంబు పేలుడులో 12 మంది మృతి**

**ఇస్లామాబాద్:** పాకిస్థాన్ రాజధాని నగరం ఇస్లామాబాద్‌లో మంగళవారం మధ్యాహ్నం 12.39 గంటలకు ఆత్మాహుతి కారు బాంబు పేలుడు సంభవించింది. ఈ పేలుడు ఘటనలో 12 మంది మరణించారు. మరో 36 మంది గాయపడ్డారు. వీరిలో 18 మందికి చికిత్సలు చేసి ఇళ్ళకు పంపేశారు. 12 మృతదేహాలను సహాయ బృందాలు శిథిలాల నుండి వెలికితీసి పాకిస్థాన్ వైద్య విజ్ఞాన శాస్త్రాల సంస్థ ఆసుపత్రికి తరలించినట్లు హోం మంత్రి మోహసిన్ నక్వి మీడియాకు చెప్పారు. ఢిల్లీలో భారీ కారు బాంబు విస్ఫోటనం జరిగిన 24 గంటల వ్యవధిలో ఈ సంఘటన జరిగింది. ఈ దాడికి తామే కారణమని ఏ ఉగ్రవాద సంస్థా ప్రకటించకపోయినప్పటికీ సాధారణంగా టిటిపి (తెహ్రిక్–ఎ–తాలిబన్ పాకిస్థాన్) సంస్థ ఇలాంటి చర్యలకు పాల్పడుతుంది. ఇస్లామాబాద్ డిస్ట్రిక్ట్–సెషన్స్ కోర్టు బిల్డింగ్ జి–11 ఏరియాలో ఈ పేలుడు ఘటన జరిగిందని పోలీసులు అధికారులు పేర్కొన్నారు. రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్, దేశాధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీలు దీనిని ఆత్మాహుతి దాడిగా పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. గాయపడినవారికి సమీప ఆసుపత్రిలో చికిత్సలు అందిస్తున్నారు. ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ఆసుపత్రివర్గాలతో ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి మెరుగైన చికిత్సలు అందించాలని కోరారు. ఆరు కిలోమీటర్ల దూరానికి ఆ బాంబు పేలుడు శబ్దం వినిపించిందని పాకిస్థాన్ అధికార పత్రిక పేర్కొంది. భారత్ రాజధాని ఢిల్లీ ఎర్రకోట మెట్రో స్టేషన్ వద్ద సోమవారం సాయంత్రం అత్యంత శక్తిమంతమైన కారుబాంబు పేలుడు సంభవించి తొమ్మిదిమంది మరణించారు. ఈ పేలుడు ఘటనలో కూడా పేలుడు శబ్దం కొన్ని కి.మీ దూరం వరకూ వినిపించిందని మీడియా, ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. ఇప్పుడు ఇస్లామాబాద్ కోర్టు వెలుపల జరిగిన పేలుడు ఘటనలో కూడా పాకిస్థాన్ పత్రిక అదేరకమైన కథనం వినిపించింది. దీనికి సంబంధించి కృత్రిమ మేథకు సంబంధించిన చిత్రాలు విడుదలయ్యాయి. అదేవిధంగా అధికార పత్రిక ఆన్‌లైన్‌లో ప్రచురించిన కథనాల్లోని వీడియోలో ఎక్కడా మృతదేహాలు కనిపించలేదు. ఈ పేలుడు ఘటనను ఒక హెచ్చరికగా ఆసిఫ్ అలీ జర్దారీ పేర్కొన్నారు. ఐతే ఘటన జరిగిన వెంటనే పోలీసులు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి దర్యాప్తు ప్రారంభించినట్లు పత్రిక పేర్కొంది. వీడియోలలో చూసినప్పుడు దగ్ధమవుతున్న కార్ల నుండి మంటలు భారీ ఎత్తున పైకి ఎగసి పడటం కనిపించిందని పత్రిక పేర్కొంది. "నా కారు పార్కుచేసి భవనం లోపలికి ప్రవేశించగానే భారీ పేలుడు శబ్దం వినిపించింది, వెనక్కు చూసే సరికి ప్రజలు నలువైపులా పరుగులు తీస్తున్నారు, ఆ ప్రాంతంలో వాహనాలన్నీ ధ్వంసమయ్యాయి" అని ప్రత్యక్షసాక్షి న్యాయవాది రుస్తుమ్ మాలిక్ చెప్పినట్లు డాన్ టీవీ మీడియా పేర్కొంది. "మా దేశం యుద్ధంలో ఉంది, ఉగ్రవాదంతో పోరాడుతోంది, ఆఫ్ఘనిస్థాన్–పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉగ్రవాదంతో మా సైన్యం పోరాటం చేస్తోంది, ఆలోచిస్తే ఎవరికైనా ఇది తెలుస్తుంది, బలూచిస్థాన్ వంటి సుదూర ప్రాంతాలలో కూడా ఈ పోరాటం జరుగుతోంది, ఈ పేలుడు ఘటన ఒక మేలుకొలుపు హెచ్చరిక" అని రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్ అన్నారు. అదేవిధంగా సింధ్ రాష్ట్ర హోమ్‌మంత్రి జియావుల్ హస్సన్ కూడా ఈ ఆత్మాహుతి బాంబుదాడిని తీవ్రంగా ఖండించారు. "ఆత్మాహుతి బాంబుదాడులకు, ఉగ్రవాదులకు మతం లేదు, వారు మానవత్వానికి శత్రువులు" అని జియావుల్ హస్సన్ అన్నారు. సింధ్ రాష్ట్రంలో హై ఎలర్ట్ ప్రకటించినట్లు చెప్పారు.



### ఉగ్రవాదాన్ని ఆపకపోతే అఫ్ఘానిస్థాన్‌పై చర్యలు తప్పవు

కారు బాంబు దాడికి పాల్పడినవారిని పట్టుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని పాకిస్థాన్ హోమ్ మంత్రి నక్వి చెప్పారు. మృతులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. సాక్ష్యాధారాలను సేకరిస్తున్నామన్నారు. ఈ సమయంలో ఏదీ చెప్పడానికి తాను సిద్ధంగా లేనని అన్నారు. టిటిపి ఉగ్రవాదులను భారతదేశమే పెంచి పోషిస్తోందని తరచు పాకిస్థాన్ ప్రభుత్వం ఇటీవల ఆరోపణలు చేస్తోంది. ఐతే 'ఈరోజు జరిగిన ఈ ఘటనను మేం అనేక విషయాలతో ముడిపెట్టి చూస్తున్నాం, రాబోయే కొద్ది గంటల్లో చాలా స్పష్టత వస్తుంది, ఈ బాంబు పేలుడులో ఎన్నో సందేశాలు ఉన్నాయి, భారత్ తరచు మా దేశంపై ఆరోపణలు చేసినట్టుగా ఈ క్షణంలో ఏదీ చెప్పడానికి నేను సిద్ధంగా లేను, మేం పూర్తి సాక్ష్యాధారాలతో, వివరాలతో మీడియా ముందుకు వస్తాం" అని మంత్రి నక్వి చెప్పారు. ఆఫ్ఘనిస్థాన్ ప్రభుత్వం పాకిస్థాన్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు అంతం పలకాలి, వారు తమ భూభాగం నుండి ఉగ్రవాదాన్ని ఎగుమతి చేయడం ఆపేయాలి, లేకపోతే వారిపై చర్యలు తీసుకుంటాం, వారిపై ప్రతిచర్యలు తీసుకోవడానికి మాకు పూర్తి శక్తిసామర్థ్యాలు ఉన్నాయి" అని నక్వి అన్నారు. పాకిస్థాన్ ప్రభుత్వం యుద్ధస్థితిలో ఉందని అన్నారు. పాకిస్థాన్ సైన్యం ప్రతిరోజూ దేశ ప్రజలకు రక్షణ కల్పించేందుకు ఉగ్రవాదులతో పోరాటం చేస్తూ ప్రాణ త్యాగాలు చేస్తోందని అన్నారు. దేశంలో మూడు అంతర్జాతీయ కార్యక్రమాలు జరుగుతున్న తరుణంలో ఈ పేలుగు సంభవించిందన్నారు. ఒకవైపు అంతర్‌పార్లమెంటరీ స్పీకర్ల సదస్సు, మరోవైపు క్రికెట్ మ్యాచ్, ఇంకోవైపు సిక్త్స్ మార్గల్లా సంభాషణలు జరుగుతున్న సమయంలో ఈ పేలుడు జరిగిందన్నారు.

## ఐఎస్ గ్రూపుపై పోరాటానికి అమెరికా కూటమిలో చేరనున్న సిరియా



**వాషింగ్టన్:** ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో అమెరికా నాయకత్వాన ఏర్పడిన అంతర్జాతీయ కూటమిలో సిరియా చేరనున్నది. దీనికి బదులుగా సిరియాపై అమెరికా విధించిన ఆంక్షలను 180 రోజులపాటు ఎత్తివేస్తుంది. పెట్టుబడులకు అవకాశాలు కల్పిస్తుంది. మిత్రదేశంగా అక్కున చేర్చుకుని అన్ని విధాల సహాయ సహకారాలు అందజేస్తుంది. పశ్చిమ ఆసియాలో అమెరికా విదేశాంగ విధానంలో ఒక కొత్త మార్పుకు ఇదొక సంకేతం. సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్ షరాతో సమావేశానంతరం ట్రంప్ పాలనా యంత్రంగంలో ఉన్నతాధికారి ఒకరు మంగళవారం ఈ విషయం ధృవీకరించారు. విదేశీ ఉగ్రవాదులకు కేంద్రంగా మారిన పశ్చిమ ఆసియా నుండి ఉగ్రవాదాన్ని తుడిచిపెట్టేందుకు అమెరికా నాయకత్వాన ఒక అంతర్జాతీయ పోరాట కూటమి ఏర్పడింది. ఈ కూటమిలో 89 దేశాలు సభ్యులుగా ఉన్నాయి. ఇప్పుడు సిరియా 90వ దేశంగా సభ్యత్వం తీసుకోవడానికి సిద్ధమైంది. అహ్మద్ అల్ షరా చరిత్రాత్మకమైన అమెరికా పర్యటనకు ప్రపంచవ్యాప్తంగా బ్రహ్మాండమైన ప్రచారం లభించింది. సిరియా చరిత్రలో దాదాపు 80 సంవత్సరాల తర్వాత ఒక దేశాధ్యక్షుడు నేరుగా అమెరికాలో అధికారిక పర్యటన చేసి అధ్యక్షుడు ట్రంప్‌తో సమావేశం జరపడంతో సిరియాలో ప్రజలు పండుగ చేసుకున్నారు. తమ మధ్య సమావేశం చాలా బాగా జరిగిందని ట్రంప్ అన్నారు. సిరియాపై ఉన్న ఆంక్షలను ఆయన ఎత్తివేశారు. ఈ సందర్భంగా అల్ షరా చాలా నిరాడంబరంగా పత్రికల కళ్ళకు కనబడకుండా వేరే మార్గంలో వైట్‌హౌస్‌లోకి ప్రవేశించి ట్రంప్‌తో కొద్ది గంటలు సమావేశం జరిపారు. అనంతరం ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ, సిరియా ఒక విజయవంతమైన దేశంగా వృద్ధి చెందాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఈ నాయకుడు అల్ షరా దీనిని సాధించగలరన్న విశ్వాసం తనకు ఉందన్నారు. అల్ షరా, ట్రంప్ ఇద్దరూ మొదటిసారి ఆరునెలల క్రితం సౌదీఅరేబియాలో కలుసుకున్నారు. ఆ తర్వాత ఇన్నాళ్ళకు అల్‌షరా అమెరికాలో పర్యటించారు. ట్రంప్‌తో సమావేశం తర్వాత అల్ షరా ఫాక్స్‌న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఒక నవశకం ప్రారంభించడంలో భాగంగా తాను అమెరికా పర్యటన చేస్తున్నట్లు చెప్పారు. అమెరికాకు పూర్తి సహకారం అందజేస్తామన్నారు. అన్ని రకాలుగా తమకు కావాల్సిన మద్దతు ఇస్తామని ట్రంప్ చెప్పారన్నారు. ఇటీవలికాలం వరకూ సిరియాకు వ్యతిరేకంగా అమెరికా ఆంక్షలు అమలు చేసింది. ఒకప్పుడు ఉగ్రవాదిగా ముద్ర వేసుకున్న అల్ షరా ఇటీవలికాలంలో ఆ ముద్రను చెరిపేసుకుని ట్రంప్‌కు చేరువయ్యారు. దీంతో పశ్చిమ ఆసియాలో అమెరికా కొత్త మిత్రదేశాన్ని సంపాదించుకున్నట్లయింది.

## భారీ ఓటింగ్
(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గాలలో భారీ ఎత్తున పోలింగ్‌లో పాల్గొన్నారు. నియోజకవర్గాలలో అనేకచోట్ల పోలింగ్ కేంద్రాలవద్ద ఓటర్లు బారులు తీరారు. ముస్లింలు అత్యధికంగా ఉండే ఏకైక కిషన్‌గంజ్ జిల్లాలో ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం ఐదు గంటలకు ముగిసే వరకూ భారీగా 76.26 శాతం మేరకు నమోదైంది. ఇక నవడా నియోజకవర్గంలో అతి తక్కువగా 57.31 శాతం పోలింగ్ జరిగింది. కిషన్‌గంజ్ పొరుగున కతిహార్‌లో 75.23 శాతం, పూర్ణియాలో 73.79 శాతం, సుపాల్‌లో 70.69 శాతం, అరారియాలో 67.79 శాతం పోలింగ్ నమోదైంది. తుది విడత ఎన్నికల్లో చాలా జిల్లాలు నేపాల్ సరిహద్దుల్లో ఉన్నాయి. వీటిల్లో ఎక్కువ కోసి–సీమాంచల్ ఈశాన్య ప్రాంతంలో ఉన్నాయి. మైనారిటీ వర్గాలు అత్యధికంగా ఈ ప్రాంతాలలో ఉన్నారు. అదేవిధంగా దక్షిణ బిహార్ జిల్లాలలో అంటే జముయి లో అత్యధికంగా 67.81శాతం, గయలో 67.50 శాతం, కైమూర్‌లో 67.22 పోలింగ్ జరిగింది. రాష్ట్రంలో అధికారం మాదంటే మాదే అని ఎన్‌డిఎ–ఇండియా కూటమి శిబిరాలు ప్రకటించుకుంటున్న తరుణంలో, ముఖ్యమంత్రిగా సుదీర్ఘకాలం అధికారంలో కొనసాగిన నితీశ్ కుమార్‌పాలపై ఓటర్లు ఈ పోలింగ్ ద్వారా నిజమైన తీర్పు ఇచ్చినట్లు కనిపిస్తోందని పిటిఐ వార్తా సంస్థ వ్యాఖ్యానించింది. రాష్ట్ర శాసనమండలి సభ్యుడుగా ఉన్న నితీశ్ కుమార్ ఈసారి కూడా ఎన్నికల్లో పోటీ చేయలేదు. నితీశ్ కుమార్ ప్రభుత్వం ప్రజావ్యతిరేకత ఎదుర్కోకుండా కాపాడేందుకు సుపరిపాలన పేరుతో బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ కూటమి అధికార జెడి(యు)కు మద్దతుగా నిలబడింది. ఐతే 15 ఏళ్ళు బిహార్‌ను పాలించిన నితీశ్ కుమార్‌పై తీవ్రమైన ప్రజా వ్యతిరేకత ఉందని, ఎన్‌డిఎ కూటమి ఈసారి ఆయనను ముఖ్యమంత్రి పదవిలో ఉండనివ్వదని, అధికార కూటమి గెలిచే అవకాశం లేదని 'ఇండియా' కూటమి ధృఢ నిశ్చయంతో ఉంది. బిహార్‌లో ఏకపక్షంగా ఓటర్ల జాబితా ప్రక్షాళన చేపట్టి ఎన్‌డిఎ కూటమి అప్రదిష్టపాలైంది. 'ఇండియా' కూటమి ప్రధానంగా ముస్లింలు అత్యధికంగా ఉండే జిల్లాలపై నియోజకవర్గాలపై దృష్టి కేంద్రీకరించి ప్రజా సమీకరణ కార్యక్రమాలు నిర్వహించింది. ఓటర్లను ఆకట్టుకుంది. ఈ తుది విడత పోలింగ్ జరిగిన నియోజకవర్గాలే కాంగ్రెస్‌పార్టీకి ఇండియా కూటమికి అత్యంత కీలకమైనవి, ప్రతిష్ఠాత్మకమైనవి. కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రస్తుత ఎంఎల్‌ఎ రాజేశ్ కుమార్ రామ్ కుటుంబ నియోజకవర్గం నుండి మళ్ళీ పోటీ చేశారు. మరో సిట్టింగ్ ఎంఎల్‌ఎ షకీ అహ్మద్ ఖాన్ కద్వా నుండి పోటీ చేశారు.

మొదటి విడత నవంబరు ఆరో తేదీన 121 నియోజకవర్గాలలో 3.75 కోట్ల మంది అర్హులైన ఓటర్లు ఉండగా, 65.09 శాతం పోలింగ్ నమోదైంది. ఇక జనసురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ ఈ ఎన్నికల్లో కీలకపాత్ర వహించనున్నారు. ఆయన పాత్రవల్లే రాష్ట్రంలో పోలింగ్ శాతం పెరిగిందనే అభిప్రాయం నెలకుని ఉంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఉదయమే ఒక ప్రకటన చేస్తూ ఓటర్లు తప్పనిసరిగా ఓటు హక్కు ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. "ఈరోజు తుది విడత ఎన్నికలుజరుగుతున్నాయి, ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్ ప్రక్రియలో పాల్గొనాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నా, సరికొత్త ఓటింగ్ రికార్డును రాష్ట్రంలో నెలకొల్పాలి, ప్రత్యేకించి యువ ఓటర్లు ఓటు హక్కు ఉపయోగించుకోవాలి, మొదటిసారి ఓటు వేసేవారు తప్పనిసరిగా ఓటు హక్కు ఉపయోగించుకోవాలి,ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలి" అని ప్రధానమంత్రి ఎక్స్ వేదికగా పిలుపు ఇచ్చారు. "ఓటింగ్ కేవలం ఒక హక్కు మాత్రమే కాదు, అదొక బాధ్యత" అని నితీశ్ కుమార్ పేర్కొన్నారు. ఆయన బిహార్‌కు తొమ్మిదిసార్లు సిఎంగా ప్రమాణస్వీకారం చేశారు.

**ఓటేసిన ప్రముఖులు**

జెడి(యు) తాత్కాలిక అధ్యక్షుడు సంజయ్ ఝా, కేంద్రమంత్రి జితిన్ రామ్ మాంఝి దగ్గర నుండి జన సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ వరకూ అనేకమంది ప్రముఖులు, నాయకులు తమ తమ నియోజకవర్గాలలో మంగళవారం ఓటు హక్కు ఉపయోగించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్ రామ్, రాష్ట్ర పరిశ్రమల మంత్రి నితీశ్ మిశ్రా, పూర్ణియా ఎంపి పప్పూ యాదవ్, బిజెపి జముయి అభ్యర్థి శ్రేయాషి సింగ్, స్వతంత్ర అభ్యర్థి, ప్రముఖ భోజ్‌పురి గాయకుడు పవన్ సింగ్ సతీమణి జ్యోతి సింగ్ తదితరులు ఓట్లు వేశారు. బిజెపి నాయకుడు షానవాజ్ హుస్సేన్, కాంగ్రెస్ ఎంఎల్‌ఎ అజీత్ శర్మ ఈ రెండో విడత పోలింగ్‌లోనే ఓటుహక్కు ఉపయోగించుకున్నారు. ఇండియా కూటమికి అనుకూలంగా ప్రజలు పెద్ద సంఖ్యలో ఓట్లు వేశారని రాజేశ్ రామ్ అన్నారు. మరోవైపు జెడి(యు) నాయకుడు ఝా మాట్లాడుతూ, ఎన్‌డిఎ కూటమి ఈసారి రికార్డుస్థాయి మెజారిటీ సాధిస్తుందని అన్నారు.

## పుల్వామా వైద్యుడు
(మొదటి పేజీ తరువాయి)

కారులోని సిసిటివి ఫుటేజ్‌లో 'ముసుగు ధరించిన వ్యక్తి' కారు నడుపుతున్నట్లు కనిపిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. 'ముసుగు ధరించిన వ్యక్తి గురించి మరింత తెలుసుకోవడానికి ఎర్రకోట, పరిసర మార్గాల నుండి సిపిటివి ఫుటేజ్‌లను పరిశీలించడానికి పలు బృందాలను మోహరించినట్లు' ఒక పోలీసు అధికారి తెలిపారు.'పేలుడు జరగడానికి ముందు వాహనం మూడు గంటల పాటు సమీపంలోని పార్కింగ్ స్థలంలో నిలిపి ఉంచినట్లు మాకు తెలిసింది. వివిధ పార్కింగ్ స్థలాల ఫుటేజ్‌లను కూడా పర్యవేక్షిస్తున్నారు' అని ఆ వర్గాలు తెలిపాయి.ఉమర్ ఒక్కడే కారులో ఉన్నట్లు వారు తెలిపారు. పేలుడు , ఉగ్రవాద కుట్రపై దర్యాప్తు కొనసాగుతోందని, దక్షిణ కాశ్మీర్‌లోని పుల్వామా జిల్లాకు చెందిన తారిక్ అనే వ్యక్తి ఉమర్‌కు ఐ–20 కారును ఇచ్చాడని, ఆయనను అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు

**ఇద్దరు మృతుల గుర్తింపు :** మృతులను ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహాకు చెందిన అశోక్ కుమార్ (34), ఢిల్లీకి చెందిన అమర్ కటారియా (35) గా గుర్తించారు. మిగిలిన మృతదేహాలను ఇంకా గుర్తించలేదు. వారి వయస్సు 28 నుండి 58 సంవత్సరాల మధ్య ఉంటుంది. కారు ముక్కలైన అవశేషాల నుండి ఒక మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. గాయపడిన 20 మందిలో 12 మంది ఢిల్లీ వాసులు, ఎనిమిది మంది ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ సహా ఇతర రాష్ట్రాలకు చెందినవారు.

**ఉపా కింద కేసు నమోదు :** ఢిల్లీ పోలీసులు, ఎన్ఐఎ, నిఘా సంస్థల బృందాలు ఢిల్లీ, కాశ్మీర్ అంతటా జల్లెడ పడుతున్నాయి. కాశ్మీర్‌లో జరిగిన దాడుల్లో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ నలుగురిలో, ఢిల్లీ పేలుడులో, అంతర్రాష్ట్ర ఉగ్రవాద కుట్రలో వారి పాత్రకు సంబంధించి ఇద్దరిని ఉమ్మడి విచారణ కోసం తరలించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం (ఉపా), పేలుడు పదార్థాల చట్టం కింద, ఉగ్రవాద దాడిలో శిక్ష, కుట్రకు సంబంధించిన సెక్షన్ల కింద ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఢిల్లీలోని అనేక ప్రదేశాలలో కూడా దాడులు నిర్వహిస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీ హై అలర్ట్‌లో ఉంది. విమానాశ్రయం, రైల్వే స్టేషన్‌లు, బస్ టెర్మినళ్ల వద్ద గట్టి పోలీసులు నిఘా పెట్టారు.

పేలుడు తర్వాత, దేశ రాజధాని అంతటా భద్రతను ముమ్మరం చేశారు. అన్ని సరిహద్దు పాయింట్ల వద్ద వాహన తనిఖీలను కూడా ముమ్మరం చేశారు. ఢిల్లీలోకి ప్రవేశించే ప్రైవేట్ లేదా వాణిజ్య వాహనాలు సహా అన్ని వాహనాలను భద్రతా చర్యలలో భాగంగా క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.అనుమానితులను గుర్తించడానికి దర్యాగంజ్ , పహాడ్‌గంజ్ ప్రాంతాలలోని హోటళ్ళు, అతిథి గృహాలలో రాత్రి పూట సోదాలు నిర్వహించామని ఆయన తెలిపారు. ఎర్రకోట మెట్రో స్టేషన్ మూసివేసి, ఆ ప్రాంతంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.ఢిల్లీ ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు, మళ్లింపుల గురించి ఒక సూచనను జారీ చేశారు. ప్రయాణికులు ఉదయం 6 గంటల నుండి తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఈ మార్గాల వైపు వెళ్ళొద్దని, ఇబ్బంది లేని ప్రయాణం కోసం ప్రత్యామ్నాయ రహదారులను ఉపయోగించాలని సూచించారు.

కాగా, పేలుడుకు ఫరీదాబాద్‌లో ఉగ్ర కుట్రలో భాగంగా ముగ్గురు వైద్యులు సహా అరెస్టయిన 8 మందితో ఉమర్‌కు సంబంధం ఉన్నట్లు చెబుతున్నారు. ఉమర్ చిన్నప్పటి నుంచీ అంతర్ముఖుడని, చదువులు, పనిపై దృష్టి పెట్టాడని ఆయన వదిన ముజామిల్ చెప్పారు. 'ఆయన ఫరీదాబాద్‌లోని ఒక కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఫోన్ చేసి తాను పరీక్షలతో బిజీగా ఉన్నానని, మూడు రోజుల తర్వాత ఇంటికి తిరిగి వస్తానని చెప్పాడు. చిన్నప్పటి నుంచీ చాలా ప్రశాంతమైన వ్యక్తి' అని ఆమె చెప్పారు. రెండు నెలల క్రితం చివరిసారిగా కాశ్మీర్‌కు వచ్చాడని, ఉమర్ ఒంటరివాడని, ఎక్కువ మంది స్నేహితులు లేరని ఆమె తెలిపినట్లు 'పిటిఐ' కథనం పేర్కొంది. ఎర్రకోట వద్ద సోమవారం ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర నెమ్మదిగా కదులుతున్న కారును తునాతునకలు చేసిన పేలుడులో అమ్మోనియం నైట్రేట్, ఇంధన నూనె డిటోనేటర్లను ఉపయోగించి ఉండవచ్చని ప్రాథమిక పరిశోధనలు సూచిస్తున్నాయి.

## జూబ్లీహిల్స్@48 శాతం
(మొదటి పేజీ తరువాయి)

అధికారులు తెలిపారు. మొత్తం 407 కేంద్రాల్లో పోలింగ్ జరిగింది. మొత్తం 4,01,365 మంది ఓటర్లలో 48.47 శాతం ఓటు హక్కు వినియోగించారు. గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్‌లో 48.82 శాతం పోలింగ్ నమోదైంది. ఇక్కడ మొత్తం 58 మంది అభ్యర్థులు బరిలో నిలించారు. ప్రధానంగా కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్, బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డిల మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. వీరి భవితవ్యం ఈనెల 14 ఓట్ల లెక్కింపుతో తేలనుంది. చివరి గంటల్లో పోలింగ్ శాతం పెరగవచ్చని అధికారులు అంచనా వేశారు. ఉదయం నెమ్మదిగా ప్రారంభమైన ఓటింగ్ మధ్యాహ్నాని కల్లా కాస్త వేగం పుంజుకుంది. మధ్యాహ్నం 1 గంటకు 31.94 శాతం పోలింగ్ నమోదవగా, 3 గంటలకు 40.2 శాతానికి పెరిగింది. అనంతరం సాయంత్రం నాటికి 47.17 శాతానికి చేరుకుంది. బోరబండ 328 పోలింగ్ స్టేషన్‌లో ఈవిఎం మొరాయించడంతో కొత్త మెషిన్ ఏర్పాటు చేశారు. షేక్‌పేట్‌తో సహా మొత్తం 6 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించినా, తమ టెక్నికల్ టీమ్ వాటిని యుద్ధప్రాతిపదికన సరి చేసి, పోలింగ్‌ను తిరిగి ప్రారంభించిందని తెలిపారు. అలాగే రహమాత్ నగర్ పోలింగ్ బూత్ 165, 166ల్లో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు జరిపారు. అయితే ఈ ఎన్నికల్లో మొదటిసారిగా ఈవిఎంలలో అభ్యర్థుల కలర్ ఫోటోలు, డ్రోన్‌లతో సెక్యూరిటీ మానిటరింగ్, ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద మొబైల్ డిపాజిట్ సెంటర్లు, ఓటర్ అసిస్టెన్స్ బూత్‌లు ఏర్పాటు చేశారు. అలాగే పోలింగ్ సమయాన్ని సాయంత్రం 6 గంటల వరకు పొడిగించడం విశేషం. హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి, తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

**ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. బోరబండలో బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఓటు హక్కు వినియోగించారు. షేక్‌పేట్ డివిజన్‌లో ప్రముఖ సినీ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి కుటుంబ సమేతంగా ఓటేశారు. బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి శ్రీనగర్ కాలనీలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ కుటుంబ సమేతంగా మధుర్ నగర్‌లో ఓటు వేశారు. ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణి కుటుంబంతో కలిసి యూసుఫ్‌గూడలో ఓటు వేశారు.

**నూతనోత్సాహంతో యువత ఆసక్తి**

నూతనంగా ఓటు హక్కు వచ్చిన యువతి, యువకులు పెద్ద సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉత్సహకంగా నియోజకవర్గంలోని వివిధ పోలింగ్ స్టేషన్‌లకు వచ్చి, ఓపికగా క్యూలైన్‌లలో నిలబడి ఓటు వేసేందుకు ఆసక్తి చూపించారు. యువత ఓటు హక్కు వినియోగించుకునేందుకు ముందుకు రావడంతో ఎన్నికల అధికారులు హర్షం వ్యక్తం చేశారు. తాము ముందస్తుగా కళాశాలు, కాలనీల్లో నిర్వహించిన ప్రచారం ఫలితమిచ్చిందని తెలిపారు. ప్రధానంగా యువత అభివృద్ధికే జై కొట్టినట్లు వాతావరణం గోచరించింది.

**యూసుఫ్‌గూడలో హైటెన్షన్ : బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత అరెస్ట్**

జూబ్లీహిల్స్ లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలింగ్ ప్రశాంతంగా ముగిసినప్పటికీ చివరిలో బిఆర్ఎస్ నేతలు ఆందోళనకు దిగటం ఉద్రిక్తతకు దారితీసింది. యూసుఫ్‌గూడలో దొంగ ఓట్లు వేస్తున్నారంటూ బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత యూసుఫ్‌గూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. ఆమెకు తోడు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కూడా ధర్నాకు దిగటంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముందు ఎందుకు ధర్నా చేస్తున్నారని కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రెండు పార్టీలకు మధ్య తోపులాటలు జరిగాయి. పరిస్థితి చేజారుతుండటంతో పోలీసులు కార్యర్తలను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో కౌశిక్ రెడ్డి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఎలాంటి గొడవలకు తావు లేకుండా సహకరించాలని చెప్పినా వినకపోవడంతో మాగంటి సునీతతో పాటు పాడి కౌశిక్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేసి, స్టేషన్‌కు తరలించారు. షేక్‌పేట్ డివిజన్‌లోని అపెక్స్ హైస్కూల్ బూత్ నెంబర్లు 4 నుండి 8 వరకు కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు లాఠీచార్జ్ చేసి రెండు వర్గాలను చెదరగొట్టారు. అలాగే యూసుఫ్‌గూడ సవేర ఫంక్షన్ హాల్ వద్ద కూడా బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది.

**ఎన్నికల సంఘం చర్యలు**

స్థానికేతర నేతలు నియోజకవర్గంలో తిరుగుతున్నారంటూ ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతలు పరస్పరం ఒకరిఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో ఎన్నికల సంఘం ఇరు పక్షాలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే రామచంద్ర నాయక్, ఎమ్మెల్సీ శంకర్‌లపై పోలీసులు కేసులు నమోదు చేశారు. అలాగే బిఆర్ఎస్ కార్పొరేటర్లపై సైతం పోలీసులు కేసులు నమోదు చేశారు. యూసుఫ్‌గూడలో బిఆర్ఎస్ సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొంత ఉద్రిక్తత చోటు చేసుకుంది. స్థానికేతరులైన సామల హేమపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు.

## నిందితులను వదిలేది లేదు
(మొదటి పేజీ తరువాయి)


సాయంత్రం ఢిల్లీలో జరిగిన భయానక ఘటన ప్రతి భారతీయుడిని విషాదంలో ముంచేసింది. బాధిత కుటుంబాల దుఃఖాన్ని నేను పూర్తిగా అర్థం చేసుకుంటున్నాను. దేశం మొత్తం ఈ కష్ట సమయంలో వారి పక్కనే ఉంది. సోమవారం రాత్రంతా దర్యాప్తు సంస్థలతో సంప్రదింపులో ఉన్నా. పలు దర్యాప్తు సంస్థలు దర్యాప్తు ముమ్మరం చేశాయి. దాడికి గల కారణాలను దర్యాప్తు సంస్థల అధికారులు త్వరలో వెల్లడిస్తారు. కుట్రదారులను వదిలిపెట్టం. అమాయకుల ప్రాణాలు తీసిన వారందరికీ తగిన శిక్ష తప్పదు' అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

సమగ్ర విచారణ జరగుతోంది : రాజ్‌నాథ్ సింగ్

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా ఈ పేలుడు ఘటనపై స్పందించారు. దేశంలోని ప్రముఖ విచారణ సంస్థలు త్వరితంగా, సమగ్రంగా దర్యాప్తు జరుపుతున్నాయని తెలిపారు. 'ఢిల్లీలో జరిగిన దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు నా హృదయపూర్వక సానుభూతి తెలియజేస్తున్నా. ఈ తీవ్రమైన విషాద సమయంలో దేవుడు వారికి ధైర్యం ఇవ్వాలని ప్రార్థిస్తున్నాను. దేశంలోని ప్రముఖ విచారణ సంస్థలు ఈ ఘటనపై త్వరితంగా, సమగ్రంగా విచారణ చేపట్టాయి. దాని ఫలితాలను త్వరలో వెల్లడిస్తాం. ఈ ఘోర ఘటనకు బాధ్యులైన వారిని శిక్షించడంలో ఎలాంటి సడలింపు ఉండదు. దేశ ప్రజలకు నేను భరోసా ఇస్తున్నా' అని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు.

## ఎన్ఐఎ చేతికి
(మొదటి పేజీ తరువాయి)

డైరెక్టర్ తపన్ డేకా, ఢిల్లీ పోలీస్ కమిషనర్ సతీశ్ గోల్చా, ఎన్ఐఎ డిజి సదానంద్ వసంత్ దాటే హాజరయ్యారు. జమ్మూ కశ్మీర్ డిజిపి నళిన్ ప్రభాత్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో పేలుడు అనంతరం పరిస్థితులపై అధికారులు సమగ్ర వివరాలను అందించారు. దిఅత్యున్నత దర్యాప్తు సంస్థలు పేలుడు ఘటనను దర్యాప్తు చేస్తున్నాయని,అవి సంఘటనను లోతుగా పరిశీలిస్తాయని హోం మంత్రి చెప్పారు. సోమవారం సాయంత్రం ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలోని ట్రాఫిక్ సిగ్నల్ వద్ద నెమ్మదిగా కదులుతున్న కారులో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు 13 మంది మరణించారు. అనేక వాహనాలు దగ్ధమయ్యాయని అధికారులు తెలిపారు.





# జనరల్
STATE & REGIONAL NEWS

## తాగునీటి సమస్య రాకుండా చర్యలు

**అధికారులను ఆదేశించిన సిఎస్ రామకృష్ణారావు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్‌లో రానున్న రోజులలో త్రాగు నీటి సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ సచివాలయంలో మంగళవారం హైదరాబాద్ వాటర్ వరక్స్ విభాగం (హెచ్‌ఎండబ్ల్యూస్‌ఎస్‌బి) పని తీరుపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మంజీర, సింగూరు, గోదావరి ఫేస్2, ఫేస్3 పనులపై సమీక్ష చేశారు. భూసేకరణ, పైప్ లైన్ల నిర్మాణంపై అధికారులతో చర్చించారు. ఇరిగేషన్, రెవెన్యూ, అటవీ, రోడ్లు, భవనాల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ నిర్దేశించిన ప్రాజెక్టులను పూర్తి చేయడానికి సహకరించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, హైదరాబాద్ వాటర్ వర్క్స్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, హెచ్‌ఎండిఎ కమీషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పిసిసిఎఫ్ డాక్టర్ సి.సువర్ణ, రంగారెడ్డి, సిద్దిపేట జిల్లా కలెక్టర్లు, మిషన్ భగీరథ ఇఎన్‌సి కృపాకర్ రెడ్డి తదితరలు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య ఉద్యమంలో సిపిఐది కీలక పాత్ర

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి**



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ :** భారత కమ్యూనిస్టు పార్టీ వచ్చే డిసెంబర్ 26 నాటికి వందేళ్లు పూర్తి చేసుకుంటున్న తరుణంలో దేశవ్యాప్తంగా ఉత్సవాలు నిర్వహించుకుంటుందని, ఈ నేపధ్యంలో రాష్ట్రంలో శతజయంతి ఉత్సవాలను ఈ నెల 15 నుంచి 21 వరకు ఆదిలాబాద్ జిల్లా జోడేఘాట్ నుంచి భద్రాచలం వరకు జరిగే రాష్ట్ర ప్రచార జాతాను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం కార్యవర్గ సభ్యురాలు గూడెం లక్ష్మి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ భారతదేశాన్ని బ్రిటీష్ పాలకుల నుంచి విముక్తి చేయడానికి దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందని, సమసమాజ నిర్మాణం కోసం, వర్గ దోపిడీకి వ్యతిరేకంగా పెట్టుబడిదారీ విధానాన్ని వ్యతిరేకిస్తూ కార్మిక, కర్షక, ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తున్న పార్టీ సిపిఐ అన్నారు. ప్రజల కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం ఎంతో మంది కమ్యూనిస్టు యోధులు తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన చరిత్ర సిపిఐకి ఉందన్నారు. స్వాతంత్రం సిద్దించిన తర్వాత దేశ ప్రజల సంక్షేమం కోసం, భూ సంస్కరణల కోసం, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన పార్టీ సిపిఐ అన్నారు. వందేళ్ల ఉత్సవాలలో భాగంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయడం కోసం సిపిఐ నిర్వహించిన పోరాటాలను, విజయాలను, త్యాగాలను ప్రజలకు వివరించేందుకు ఈ నెల 15 నుంచి 21 వరకు జోడే ఘాట్ నుంచి భద్రాచలం వరకు రాష్ట్ర ప్రచార జాతా నిర్వహిస్తున్నామని, ఆ జాతాను విజయవంతం చేయడం కోసం ఆయా జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, అందె స్వామి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, బత్తుల బాబు, నాగెల్లి లక్ష్మారెడ్డి, కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, గూడెం లక్ష్మి , పిట్టల సమ్మయ్య పాల్గొన్నారు.

# సోషలిజం వ్యవస్థ స్థాపన దిశగా యువత ముందుకు..

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమానత్వం, సౌభ్రాతృత్వం, ఆర్థిక న్యాయం ఆధారిత సోషలిస్టు వ్యవస్థలోనే ప్రజల భవిష్యత్తు ఉన్నదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. సమాజంలో అసమానతలు, కుల వివక్ష, పేద, ధనిక మధ్య ఉన్న అంతరాలను తొలగించేందుకు ఏకైక మార్గం సోషలిజమేనని స్పష్టం చేశారు. యూరప్‌లో కమ్యూనిస్టుల గాలి వీస్తుందని, నేపాల్‌లో అన్ని వామపక్ష పార్టీలు ఐక్యతగా ముందుకు రావడం 'రానున్నది సోషలిస్ట్ వ్యవస్థ' అనేందుకు ఇదే నిదర్శనమన్నారు. జనసేవా దళ్ కన్వీనర్ పంజాల రమేష్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో మంగళవారం 'జనసేవా దళ్' రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కూనంనేని సాంబశివరావు ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడుతూ సోషలిజం వ్యవస్థను స్థాపించే దిశగా యువత ముందుకు రావాలని, శ్రీశ్రీ చెప్పినట్టు కొంతమంది యువత నవయుగ దూతలు అనే మాటలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. 'సిపిఐ వందేళ్ల' ఉత్సవాల ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు 'నునుగు మీసాల యవ్వనంలో దేశ స్వతంత్ర్యం కోసం ఉరికంభం ఎక్కిన భగత్ సింగ్ స్ఫూర్తితో' ఏర్పడిన యువజన, విద్యార్థి సమాఖ్యల ఆధ్వర్యంలో పదిహేను వేల మంది యువ కమ్యూనిస్టులతో భారీ జనసేవా దళ్ ర్యాలీ నిర్వహించనున్నట్టు వివరించారు. భారతదేశం గత కొన్నేళ్లుగా కార్పొరేట్ శక్తుల ఆధీనంలోకి వెళ్తోందన్నారు. పేదలకు న్యాయం జరగాలంటే, ఉత్పత్తి సాధనాలు ప్రజల చేతుల్లోకి రావాలన్నదే నిజమైన సోషలిజం అని అన్నారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి రాజ్యాంగం ఇచ్చిన హక్కులను అమలు చేయడంతో పాటు ఆర్థిక సదుపాయాలను సమానంగా ఉండడం అవసరమని కూనంనేని సాంబశివరావు అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు, ఎం.బాల నరసింహ, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లాఖాద్రీ, కార్యదర్శి ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# దళిత వర్గాల అభివృద్ధికే సబ్ ప్లాన్ నిధులు

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సబ్‌ప్లాన్ నిధులను దళిత వర్గాల అభివృద్ధికే వినియోగించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. విద్య, వైద్యం ఆరోగ్యం, ఉపాధి కోసం నిధులను ఉపయోగించాలన్నారు. దళిత వర్గాలకు విద్య, ఉపాధి అవకాశాలతో పాటు ఆరోగ్యం పట్ల కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికల రూపొందించి, అందుకు తగిన నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం కె.యేసురత్నం అధ్యక్షతన హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలనరసింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ 2013 సంవత్సరంలో సబ్‌ప్లాన్ చట్టం వచ్చిందన్నారు. సబ్‌ప్లాన్ నిధులను దళితుల అభివృద్ధి కోసం కేటాయించకుండా, ఇతర పథకాలకు దారి మళ్లించవద్దని ప్రభుత్వానికి సూచించారు. ప్రతి దళిత కుటుంబానికి ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ప్రభుత్వాలు ప్రత్యేక నిధులను కేటాయించాలని కోరారు. గత పదేళ్లుగా ప్రభుత్వాల నుంచి ఎస్‌సి నిరుద్యోగ యువతకు రావాల్సిన స్వయం ఉపాధి సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలన్నారు. నిరంతరం చైతన్యవంతంతో కూడిన ప్రజా చైతన్య ఉద్యమాల ద్వారానే అన్ని వర్గాల్లోని ప్రజలకు సమాన అవకాశాలు సాధ్యమని కూనంనేని పిలుపునిచ్చారు. సిపిఐకి అనుబంధంగా ఉన్న దళిత హక్కుల పోరాట సమితి దిన దినం రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తుందని ఆయన కొనియాడారు. లాల్ నీల్ ప్రజా చైతన్యం ద్వారానే సామాజిక విప్లవాలు వస్తాయన్నారు. ఈ సమావేశంలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, నాయకులు వై.ఉషశ్రీ, జేరుపోతుల కుమార్, ఆరుట్ల రాజ్ కుమార్, బి.లక్ష్మీపతి, మంద సుదర్శన్, డి.రాములు, బాబు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్ల లబ్ధిదారులకు రూ.202.93 కోట్లు విడుదల

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఈ వారానికి సంబంధించిన రూ.202. 93 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఇండ్ల నిర్మాణ పనుల దశల ఆధారంగా బిల్లులను ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే మంగళవారం (నవంబర్ 11వ తేదీ నాటికి) పురోగతి సాధించిన మేరకు 18,247 మంది లబ్ధిదారులకు బిల్లులను విడుదల చేసినట్టు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వి.పి. గౌతం మంగళవారం వెల్లడించారు. ఈ వారం లబ్ధిదారులకు చేసిన చెల్లింపుల్లో బేస్‌మెంట్ లెవల్ నిర్మాణాలు 4,615, రూఫ్ లెవల్‌లో (గోడలు పూర్తయిన) 8, 517, స్లాబ్ వేసిన 5,115 ఇండ్లు ఉన్నాయని ఆయన వివరించారు.

### 'ఇందిరమ్మ ఇండ్లకు' రూ.2900 కోట్ల చెల్లింపు..

ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇప్పటివరకు మొత్తం రూ. 2900.35 కోట్లను చెల్లించారు. ఇందులో బేస్‌మెంట్ లెవల్ (బిఎల్) దాటిన ఇండ్లకు రూ.1610.79 కోట్లు, రూఫ్ లెవల్ (ఆర్‌ఎల్) రూ.716.91 కోట్లు, రూఫ్ క్యాస్టెడ్ (స్లాబ్ పూర్తయిన ఆర్‌సి) ఇండ్లకు రూ.572.65 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 2,33,069 ఇండ్ల పనులు ప్రారంభించగా, ఇందులో బేస్‌మెంట్ (బిఎల్) స్థాయిలో 90,613, గోడల నిర్మాణం పూర్తయినవి (ఆర్ ఎల్) 41,212 ఇండ్లు, స్లాబ్ పూర్తి (ఆర్‌సి) 37,400 ఇండ్లు ఉన్నాయని ఎం.డి వి.పి.గౌతం తెలిపారు.


తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూసేకరణ) శాఖ
ఫారం-6

(చట్టం -30/2013 లోని సెక్షన్ 11 (1) లోని సబ్ రూల్ (1) రూల్ (19) ప్రకారం)
మరియు
(ఆక్ట్ నెం. 21 ఆఫ్ 2017 తెలంగాణ ప్రభుత్వం గెజిట్ పబ్లికేషన్ నెం. 22 తేది 17-05-2017 ప్రకారం)

ప్రాథమిక నోటిఫికేషన్

G1/3910/2025 తేది: 30.10.2025
ఫైల్ నెం. F/4495/2025, తేది: 21.10.2025

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, నల్గొండ గారి ఆదేశానుసారం నల్లగొండ జిల్లా, చింతపల్లి మండలం, పోలేపల్లి రాంనగర్ గ్రామములోని విస్తీర్ణం **ఎ. 54.23 గుంటల** సీలింగ్ భూమి ప్రజా ప్రయోజనార్ధం నిమిత్తం అనగా డిండి ఎత్తిపోతల ప్రాజెక్ట్‌లోని శివన్నగూడెం బాలెన్సింగ్ రిజర్వాయర్ క్రింద ముంపునకు గురైన మర్రిగూడ మండలములోని వెంకేపల్లి మరియు వెంకేపల్లి తండా గ్రామాల పునరావాస మరియు పునరుద్ధరణ కొరకు భూసేకరణ నిమిత్తం ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నదని భావించినందున భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం, 2013 లోని సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారీచేయనైనది.

తెలంగాణ ప్రభుత్వం వారు జి.ఓ.యం.యస్. నం.39 ఇరిగేషన్ & కాడ్ (ఎల్.ఎ, ఆర్&ఆర్/ఎ2) డిపార్ట్‌మెంట్ తేది: 30.06.2017 జారి చేసినారు. అట్టి జి.ఓ. నందు డిండి ఎత్తిపోతల ప్రాజెక్ట్ సెక్షన్ 10ఎ చట్టం నెంబర్ 21/2017, భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 లోని చాప్టర్-II మరియు చాప్టర్-III నుండి మినహాయించబడినది.

కావున పునరావాస మరియు పునర్నిర్మాణం కొరకు పోలేపల్లి రాంనగర్ గ్రామము, చింతపల్లి మండలం, నల్లగొండ జిల్లాలో విస్తీర్ణం **ఎ. 54.23 గుం.ల** భూమి ఈ క్రింది చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారిచేయనైనది.

మండలం : చింతపల్లి గ్రామము : పోలేపల్లి రాంనగర్

| క్ర. సం. | సర్వే నెం. భూమి స్వభావము హక్కు స్వభావము | విస్తీర్ణం (ఎ.గుం.) | భూమిని కోల్పోయే రైతు పేరు, తండ్రి / భర్త పేరు | భూమి పై చెట్లు / పైపు లైను / బావి/ బోరు/ ఇతరములు |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| 1 | 256 మెట్ట/ సీలింగ్ భూమి ఎ.54.23 గుం.లు | 2.00 | గనమోని మల్లయ్య తండ్రి కీ.శే రామచంద్రయ్య | |
| 2 | | | గనమోని పెద్దసోమయ్య తండ్రి కీ.శే రామచంద్రయ్య | |
| 3 | | | గనమోని చిన్నసోమయ్య తండ్రి కీ.శే రామచంద్రయ్య | |
| 4 | | 3.15 | కానమోని చిన్న ముత్యాలు తండ్రి పెద్ద నర్సింహ్మా | 4 - వేప చెట్లు |
| 5 | | 2.22 | కానమోని పద్మ భర్త మదార్ | 6- తాటి చెట్లు |
| 6 | | | కానమోని శేఖర్ తండ్రి బుడ్డ వెంకయ్య | 1- తుమ్మ చెట్టు |
| 7 | | 2.37 | కానమోని రాములు తండ్రి నర్సింహ్మా | 8- తాటి చెట్లు, 3- వేప చెట్లు |
| 8 | | 5.30 | నక్కనగోని రాములు తండ్రి కీ. శే బుచ్చయ్య | 16- వేప చెట్లు, 2- తాటి చెట్లు |
| 9 | | | నక్కనగోని మల్లయ్య తండ్రి జంగయ్య | |
| 10 | | 3.25 | గంగాల పద్మమ్మ భర్త చెన్నయ్య | 15- వేప చెట్లు, 1- తాటి చెట్టు |
| 11 | | 3.22 | కానమోని మల్లమ్మ భర్త బుచ్చయ్య | |
| 12 | | 9.03 | కానమోని యాదమ్మ భర్త కృష్ణయ్య | 3- తాటి చెట్లు, 3- వేప చెట్లు |
| 13 | | | కానమోని సత్తయ్య తండ్రి మల్లయ్య | |
| 14 | | | కానమోని పాండయ్య తండ్రి మల్లయ్య | |
| 15 | | 2.09 | కానమోని యాదయ్య తండ్రి లక్ష్మ య్య | 4-టేకు, 19-మామిడి, 2-నిమ్మ, 8- తాటి, 2-జామ చెట్లు, 1-బోర్, 1-మోటార్ & పైప్‌లైన్. |
| 16 | | 7.00 | కానమోని నర్సింహ్మా తండ్రి లక్ష్మ య్య | 2-చింత, 4- తాటి, 4- వేప చెట్లు |
| 17 | | | కానమోని భారతమ్మ భర్త నర్సింహ్మా | |
| 18 | | 4.18 | కానమోని పద్మ భర్త గోపాల్ | 4- వేప చెట్లు |
| 19 | | | కానమోని గోపాల్ తండ్రి లక్ష్మ య్య | 2- తాటి చెట్లు |
| 20 | | 4.04 | పడకంటి యాదయ్య తండ్రి జంగయ్య | |
| 21 | | 3.06 | కానమోని యాదమ్మ భర్త యాదయ్య | 3- తాటి చెట్లు, 5- వేప చెట్లు |
| 22 | | 0.32 | గంగాపురం వెంకటయ్య తండ్రి సత్తయ్య | |
| | మొత్తము | 54.23 | | |

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణ భూ నిర్వాసితుల పునరావాసం మరియు పునరుద్ధరణ చట్టం, 2013 (నెం.30/2013) లోని నియమంలోని సెక్షన్ (11) 1 ప్రకారం సంబంధిత భూయజమానులకు సరియైన భూనష్టపరిహారం చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారీచేయనైనది.

భూమి యొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, నల్లగొండ మరియు భూసేకరణ అధికారి మరియు రాజస్వమండలాధికారి, దేవరకొండ గారి కార్యాలయంలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైన పని దినములలో కార్యాలయ వేళలలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, నల్లగొండ గారు రాజస్వమండలాధికారి, దేవరకొండ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్ (12) ప్రకారం పైన చూపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11 (4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయంలో జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారీచేసిన తేది నుండి ఆ ప్రకటనలో ఉదహరింపబడిన భూములకు సంబందించి ఎటువంటి కొనుగోలు, అమ్మకం, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూసేకరణ విషయములో సంబంధించిన భూ యాజమానులు ఏదైనా అభ్యంతరములున్న యెడల, పరిష్కారం కొరకు చట్టంలోని సెక్షన్-15 ప్రకారం జిల్లా కలెక్టర్, నల్లగొండ గారికి లేదా రాజస్వమండలాధికారి/ భూసేకరణ అధికారి, దేవరకొండ గారికి లిఖిత పూర్వకముగా ప్రకటన జారీ చేసిన 60 (అరవై) దినముల లోపల తెలియజేయవలసి ఉన్నది.

సం/- రాజస్వమండలాధికారి/, భూసేకరణ అధికారి, దేవరకొండ.
సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ), నల్లగొండ.
సం/- జిల్లా కలెక్టర్, నల్లగొండ.

DIPR RO NO. 816/LA/PP/Advt/Pub/2025-26


# పోడు భూముల కుంభకోణం.. 22 మంది అరెస్టు

**వరంగల్ డిసిపి అంకిత్ కుమార్ వెల్లడి**



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలో 278 ఎకరాల ప్రభుత్వ పోడు భూమిని 12 మంది నకిలీ రైతుల పేర్లతో కాజేస్తున్న 22 మంది ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.1.07 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిలో ఇద్దరు వ్యవసాయ శాఖ అధికారులు కూడా ఉన్నారని ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ తెలిపారు. ప్రస్తుత కేసులో ప్రధాన నిందితుడు బెజ్జంకి శ్రీనివాస్ రబీ సీజన్ సమయంలో బండ లలితతో పరిచయం ఏర్పరచుకొని, ఆమెతో పాటు ట్యాబ్ ఆపరేటర్ చరణ్ సింగ్ సహకారంతో నకిలీ పంట వివరాలు నమోదు చేసి, ప్రభుత్వ నిధులను అక్రమంగా పొందినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇద్దరు (బండ లలిత, చరణ్ సింగ్) ఒక్కో క్వింటాకు రూ.120 చొప్పున కమీషన్, బెజ్జంకి శ్రీనివాస్ ఒక్కో క్వింటాకు రూ.500 బోనస్, రూ.50 మిల్లింగ్ చార్జీ రూపంలో లాభం పొందేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. మొత్తం 8,049 క్వింటాళ్లపై రూ.2.10 కోట్లు విలువైన నిధులు అక్రమంగా పొందినట్లు తేలింది. ఇందులో భాగంగా బెజ్జంకి శ్రీనివాస్ తన కుటుంబ సభ్యులు, బంధువులు 12 మందిని నకిలీ రైతులుగా చూపించి, శాయంపేట మండల పరిధిలోని 278 ఎకరాల ప్రభుత్వ పోడు భూమిలో వరి పంట పండించినట్లు తప్పుడు వివరాలు సమర్పించాడు. టోకెన్ బుక్స్ నకిలీగా వ్రాసి, మండల ఏఈఓ, ఏఓ లాగిన్ ఐడీల ద్వారా నకిలీ ఎంట్రీలు చేశాడు. దాంతో ప్రభుత్వ కార్పొరేషన్ నిధి నుండి ఈ నకిలీ రైతుల 12 మంది అకౌంట్లలో రూ.1.86 కోట్లు, అదనంగా బండ లలిత, చరణ్ సింగ్, బండ రజినీకర్ రెడ్డి అకౌంట్లలో రూ.24 లక్షలు జమ అయ్యాయి. మొత్తం 15 మంది పేర్లపై 314 ఎకరాలకు, 9,100 క్వింటాళ్లకుగాను రూ.2.10 కోట్లు మోసపూరితంగా పొందినట్లు నిర్ధారణ అయింది.

**నిందితుల లాభం...**

బండ లలిత, చరణ్ సింగ్ ఒక్కో క్వింటాకు రూ.120 చొప్పున మొత్తం రూ.10.92 లక్షలు బెజ్జంకి శ్రీనివాస్ బోనస్ రూ.500 చొప్పున రూ.45 లక్షలు, మిల్లింగ్ చార్జ్ రూ.50 చొప్పున రూ.4.5 లక్షలు, తర్వాత బెజ్జంకి శ్రీనివాస్ రూ.1.32 కోట్లు డ్రా చేసి, అందులో భాగంగా రూ.32 లక్షలు (రిజిస్ట్రేషన్ ఖర్చులతో కలిపి) వెచ్చించి కమలాపూర్ మండలం, పంగిడిపల్లి గ్రామం, సర్వే నం.25/ఎఫ్‌లో ఒక ఎకరం భూమి తన కుమారులు బెజ్జంకి పున్నం చారి, బెజ్జంకి శివకుమార్ పేర్లపై కొనుగోలు చేశాడు. రూ.8 లక్షలు వెచ్చించి టాటా నెక్సాన్ (టీఎస్ 08 జేఆర్ 2471) కారు కొనుగోలు చేశాడు. రూ.1.06 కోట్లు ఖర్చు చేసి గత సీజన్, ప్రస్తుత సీజన్ షార్టేజ్ ధాన్యం కొనుగోలు చేశాడు. లారీ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ సుదాటి రాజేశ్వర్ రావు రూ.4 లక్షలు సివిల్ సప్లై డిపార్ట్‌మెంట్‌కు తిరిగి చెల్లించాడు. దర్యాప్తు సమయంలో రూ.54 లక్షలు నిందితుల బ్యాంక్ అకౌంట్లలో ఫ్రీజ్ చేశారు. అదనంగా రూ.9.50 లక్షల నగదు, రూ.8 లక్షల విలువైన టాటా నెక్సాన్ కారు, ఆర్సీ, రూ.32 లక్షల విలువైన భూమి పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో మొత్తం రూ.1,07,84,134 విలువైన ఆస్తులు, నగదు స్వాధీనం చేసుకున్నామని డీసీపీ తెలిపారు.

# రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు.. మత్స్యశాఖ క్రియాశీలకంగా మారేలా ప్రణాళికలు

**మంత్రి వాకిటి శ్రీహరి**




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మత్స్యకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో హెచ్‌ఐసిసి నోవాటెల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన వరల్డ్ ఆక్వా కల్చర్ ఇండియా 2025 కాన్ఫరెన్స్‌కు వాకిటి శ్రీహరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కాన్ఫరెన్స్ సందర్భంగా మత్స్యశాఖపై రూపొందించిన పాటను మంత్రి సమక్షంలో విడుదల చేశారు. ప్రధానంగా ఈ కాన్ఫరెన్స్‌లో మత్స్య సంపద, మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధిపై ప్రధాన చర్చ అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఈ సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ మత్స్యకారుల కుటుంబానికి చెందిన వ్యక్తిగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం గర్వంగా ఉందన్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ నుండి ఇప్పటి వరకు మత్స్య శాఖను ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన వ్యక్తికి ఇవ్వలేదని, మొదటి సారిగా కాంగ్రెస్ ప్రభుత్వం నాకు మంత్రిగా అవకాశం ఇవ్వడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మొదటి క్యాబినెట్‌లోనే మత్స్య శాఖకు దాదాపుగా 123 కోట్ల బడ్జెట్ కేటాయించిందని తెలిపారు. మత్స్యకారులందరి తరుపున సిఎం రేవంత్ రెడ్డికి మరో సారి కృతజ్ఞతలు తెలియజేశారు. తెలంగాణలో ఉన్న దాదాపుగా 26వేల నీటి వనరుల్లో చేప పిల్లల పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వీటిల్లో 84 కోట్ల చేప పిల్లలు, 10 కోట్ల రొయ్య పిల్లలను విడుదల చేస్తున్నామని స్పష్టం చేశారు. పారదర్శకతకు కేర్ ఆఫ్ అడ్రెస్‌గా రిజర్వాయర్లలో అడిషనల్ కలెక్టర్ ఆధ్వర్యంలో చిన్న చెరువుల్లో ఎంఆర్‌ఒ ఆధ్వర్యంలో చేపపిల్లల పంపిణీ చేస్తున్నామని తెలియజేశారు. అంతేకాకుండా చేపపిల్లల పంపిణీ సంబధించిన వివరాలు తెలియజేస్తూ చెరువు వద్ద సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, తెలంగాణ ఫిషరీస్ డైరెక్టర్ నిఖిల, ఎన్‌ఎఫ్‌డిబి సిఇఒ బెహరా, జాయింట్ సెక్రటరీ నీతు కుమారి, జాయ్ కృష్ణ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఐకార్, పివిఎన్ఆర్ వెటర్నరీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జ్ఞానప్రకాష్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రేపు రాష్ట్రవ్యాప్తంగా 'బిసి ధర్మ పోరాట దీక్ష'లు

**బిసిల ధర్మ పోరాట దీక్ష పోస్టర్ ఆవిష్కరణలో జాజుల శ్రీనివాస్ గౌడ్**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసిలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా ఈ నెల 13న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా నియోజకవర్గ మండల కేంద్రాలలో వేలాదిమందితో 'బిసిల ధర్మ పోరాట దీక్ష'లు చేపట్టాలని బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వ నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేసి, బిసి రిజర్వేషన్ల అంశంపై కేంద్ర ప్రభుత్వంపైన రాజకీయ యుద్ధం చేసేందుకు ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. హైదరాబాద్, కాచిగూడలోని 'అభినంద్ గ్రాండ్ హోటల్' బిసి జెఎసి చీఫ్ కో ఆర్డినేటర్ గుజ్జ కృష్ణ, బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్ చారితో కలిసి జాజుల శ్రీనివాస్ గౌడ్ మంగళవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ తరహా బిసి రిజర్వేషన్ల ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు ఈనెల 13న ధర్మ పోరాట దీక్షలు, 16న రన్ ఫర్ సోషల్ జస్టిస్, 18న ఎంపిలతో బిసిల ములాకత్, 23న అఖిలపక్ష సమావేశాలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. డిసెంబర్ మొదటి వారంలో పార్లమెంటు దిగ్బంధం, డిసెంబర్ మూడో వారంలో రాష్ట్రవ్యాప్తంగా బిసిల బస్సు యాత్ర, జనవరి చివరి వారంలో 'వేల వృత్తులు కోట్ల గొంతులు' అనే నినాదంతో లక్షలాది మందితో హైదరాబాదులో బహిరంగ సభ నిర్వహించి, బీసీ ఉద్యమ సునామీని సృష్టిస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు, బిసి రిజర్వేషన్ల సాధన కోసం సిఎం రేవంత్ రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నారు. డిసెంబర్ 1వ తేదీ నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బిసి రిజర్వేషన్ల అంశంపై రాహుల్ గాంధీ, ఇండియా కూటమి నేతలతో సమన్వయం చేసుకుని పార్లమెంటును స్తంభింపచేయాలని, కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చే వరకు రాష్ట్ర ప్రభుత్వం బిసిల తరపున రాజకీయ పోరాటాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. వచ్చే నెలలో జరిగే పార్లమెంట్ సమావేశంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన బిల్లును యధావిధిగా అమలు చేయాలని, లేదంటే తెలంగాణ రాష్ట్రంలో జీవితాంతం బిజెపి రాజకీయ అధికారానికి దూరంగా ఉండాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంచార జాతుల సంఘం అధ్యక్షులు ఎం.వీరస్వామి, బిసి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి.మనిమంజరిసాగర్, బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.చంద్రశేఖర్ గౌడ్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నాయకులు నందగోపాల్, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కౌలె జగన్నాథం, గంగిరెద్దుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జిల్లాల నరసింహ, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివకుమార్, ముదిరాజ్ ఐక్య వేదిక కన్వీనర్ గొడుగు మల్లికార్జున్, మన బీసీ మహాసభ అధ్యక్షులు కొమ్ము శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
టెండర్ నోటీస్ నెం.04/2025-26
యాదాద్రి భువనగిరి సర్కిల్‌లోని వివిధ సివిల్ పనులకు అర్హులైన విక్రేతల నుండి టెండర్లు ఆహ్వానించడమైనది. **గమనిక:** టెండర్ యొక్క వివరణాత్మక సమాచారాన్ని టిజిఎస్‌పిడిసిఎల్ వెబ్‌సైట్ అనగా **https://tgsouthernpower.org/Tenders/General Tenders** లో పొందవచ్చు. **ఆఖరి తేదీ:** 19.11.2025న మధ్యాహ్నం 3.00గం.ల వరకు. ఫోన్: 8712471769.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్, టిజిఎస్‌పిడిసిఎల్, యాదాద్రి భువనగిరి.
DIPR R.O. No. : 10463-PP/CL/ADVT/1/2025-26, Date: 11-11-2025



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
కుత్బుల్లాపూర్ సర్కిల్-25
NIT No. 23/DB/EE/Quthbullapur Circle/GHMC/2025-26 తేది: 11.11.2025
**పని పేరు:** బిటి రోడ్లు, సిసి రోడ్లు మరియు తుఫాను నీటి కాలువల నిర్వహణ & సిసి రోడ్డు వేయడం. **అంచనా విలువ:** రూ.29.50లక్షలు, **ప్రారంభ తేది & సమయం:** 12.11.2025న ఉ.11:00గం.ల నుండి, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం:** 19.11.2025న ఉ.11.00గం.ల వరకు. **టెండరు ఆహ్వానించు అధికార వివరాలు మరియు మొబైల్ నెం.:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 9701365503, హెడ్ డ్రాఫ్ట్స్‌మెన్ సెల్ నెం. 7337557259. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.eprocurement.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కుత్బుల్లాపూర్ సర్కిల్-25, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 10470-PP/CL/ADVT/1/2025-26, Date: 11-11-2025



hmda Growing Global
హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
స్వర్ణజయంతి కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్-500038.
బహిరంగ ప్రకటన
దీని ద్వారా, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం, 2008 (2008 యొక్క చట్టం నెం.8) లోని సెక్షన్ 15లోని సెక్షన్ సబ్ సెక్షన్ (3) ద్వారా ఇవ్వబడిన అధికారాన్ని వినియోగించుకుంటూ ప్రతిపాదిత రోడ్డు విస్తరణ, మిస్సింగ్ లింక్ రోడ్డుపై సాధారణ ప్రజల నుండి అభ్యంతరాలు మరియు సూచనలను కోరుతోంది.

| క్ర.సం. | ప్రతిపాదిత రోడ్డు వివరాలు |
|---|---|
| 1 | ప్రతిపాదిత ఆర్‌డిపి ప్రభుత్వం ఆమోదించిన మాస్టర్ ప్లాన్ హిమాయత్‌నగర్ & బుద్వేల్ జోన్ సెగ్మెంట్స్ పరిధిలోకి వస్తుంది. G.O.Ms. No.288 తేదీ 03-04-2008 మరియు MDP-2031 యొక్క మొయినాబాద్-రాజేంద్రనగర్ మాస్టర్ ప్లాన్ G.O.Ms.No. 33 MA&UD (I1) డిపార్ట్‌మెంట్ తేదీ 24-01-2013 మరియు రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం, మంచిరేవుల గ్రామం పరిధి 294, 293, 232, 231, 230, 229, 228 సర్వే నెంబర్ల గుండా మరియు రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం బైరాగిగూడ పరిధి 51 మరియు 76 సర్వే నెంబర్ల గుండా వెళ్తోంది. |

తెలుపబడిన ఈ ప్రతిపాదనపై ఏ వ్యక్తి లేదా సంస్థ నుండి అయినా వారి నుంచి అభ్యంతరాలు / సూచనలను పరిగణనలోనికి తీసుకుంటారు. వారు ఈ నోటీస్ ప్రచురించబడిన తేదీ నుండి 15 రోజులలోపు M.C, HMDAకి అభ్యంతరాలు లేదా సూచనలను లిఖితపూర్వకంగా సమర్పించవచ్చు.
మీ విశ్వాసపాత్రుడు
సం/- మెట్రోపాలిటన్ కమిషనర్
DIPR R.O. No. : 10501-PP/CL/ADVT/1/2025-26, Date: 11-11-2025




# జనరల్
STATE & REGIONAL NEWS

## కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే బాంబు పేలుళ్లకు కారణం : జాన్‌వెస్లీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వ వైఫల్య కారణంగానే ఢిల్లీలో బాంబు పేలుడు ఘటన చోటుచేసుకుందని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పేర్కొన్నారు. దేశాన్ని దిగ్భ్రాంత్రికి గురిచేసిన ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన బాంబు పేలుడు ఘటనను ఆయన ఖండించారు. మృతులకు సంతాపం తెలియజేస్తూ, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. కేంద్రంలోనూ, ఢిల్లీలోనూ బిజేపి ప్రభుత్వమే అధికారంలో వుందని, కేంద్ర నిఘా సంస్థలు వారి ఆధీనంలోనే పనిచేస్తున్నాయన్నారు. ఈ ఘటన జరగడానికి కేంద్ర ప్రభుత్వం, నిఘా సంస్థల వైఫల్యమే కారణం అని అన్నారు. ఈ పేలుళ్లకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఘటనపై వెంటనే అత్యున్నత స్థాయి దర్యాప్తు చేసి, నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## రాయదుర్గంలో చదరపు గజం రూ.3,40,000



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టిజిఐఐసి) హైదరాబాద్ నాలెడ్జ్ సిటీకి నడిబొడ్డున ఉన్న రాయదుర్గంలో, వ్యూహాత్మకంగా కేటాయించిన సుమారు ఒక ఎకరం భూమి వేలం సోమవారం విజయవంతంగా ముగిసింది. ఈ వేలంలో చదరపు గజానికి రూ.3,40,000 ల చొప్పున గణనీయమైన ధర పలికింది. ఇది చారిత్రాత్మక ధర రికార్డు సృష్టించింది. 2017లో (చదరపు గజానికి రూ.88,000) నమోదైన మునుపటి రికార్డును బద్దలు కొట్టింది. విజయవంతమైన ఈ వేలం, హైదరాబాద్‌ను అగ్రశ్రేణి పెట్టుబడి గమ్యస్థానంగా మరింత పటిష్టం చేస్తుంది. ఇక్కడ పరిమితంగా ఉన్న, అధికనాణ్యత గల స్థలాలకు అపారమైన విలువ లభిస్తుందని, ఇది తెలంగాణ ప్రభుత్వానికి విలువ చేకూరుస్తుందని రుజువు చేస్తోంది. టిజిఐఐసి విసి మేనేజింగ్ డైరెక్టర్ కె. శశాంక మాట్లాడుతూ..'ఈ వేలంలో స్థిరంగా నమోదవుతున్న అధిక పనితీరు, ముఖ్యంగా 'బొటిక్ మల్టీ యూజ్' అభివృద్ధికి అనువైన ప్లాట్ల విషయంలో, హైదరాబాద్ ఆర్థిక వృద్ధి యొక్క అసాధారణమైన లోతు, పరిపక్వతను ప్రదర్శిస్తుంది. నగరంలోని అత్యంత వేగంగా విస్తరిస్తున్న అధిక రాబడినిచ్చే వ్యాపార కారిడార్‌లో ప్రధానమైన స్థలాలను దక్కించుకోవడానికి డెవలపర్లు వ్యూహాత్మకంగా ప్రీమియం చెల్లించి మరీ పెట్టుబడి పెడుతున్నారు,' అని వ్యాఖ్యానించారు. పారదర్శకమైన, పెట్టుబడిదారులకు అనుకూలమైన తెలంగాణను నిర్మించడంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి , పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు పరివర్తనాత్మక దృష్టికి ఈ వేలం యొక్క చారిత్రాత్మక విజయం ఒక నిదర్శనం అని అన్నారు. రాయదుర్గంలో జరిగిన ఈ కీలక ఒప్పందం, భారతదేశపు అగ్రగామి పెట్టుబడి కేంద్రంగా హైదరాబాద్ ఆధిపత్యాన్ని మరింత సుస్థిరం చేస్తూ, అపూర్వమైన విశ్వాసాన్ని మూలధనాన్ని ఆకర్షిస్తోంది.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో వెబ్ క్యాస్టింగ్ పర్యవేక్షణ

- సాధారణ పరిశీలకులు రంజిత్ కుమార్ సింగ్
- జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ పరిశీలన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికలో పోలింగ్ ప్రక్రియను ఉన్నతాధికారులు వెబ్ క్యాస్టింగ్ ద్వారా పరిశీలించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో ఏడో అంతస్తులో ఏర్పాటు చేసిన వెబ్ క్యాస్టింగ్ మానిటరింగ్, పిఆర్‌ఓ యాప్, ఇన్‌ఈసిఐ నెట్ కంట్రోల్ రూమ్‌లను సాధారణ పరిశీలకులు రంజిత్ కుమార్ సింగ్, జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ పరిశీలించారు. కంట్రోల్ రూమ్ కార్యకలాపాలపై జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ సాధారణ పరిశీలకులకు వివరాలు అందించారు. ఆయన ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, జాయింట్ కమిషనర్ రాధాలు పోలింగ్ సరళిని నిరంతరం పర్యవేక్షించారు. వెబ్ క్యాస్టింగ్ ద్వారా ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద జరుగుతున్న ప్రక్రియను పరిశీలిస్తూ, అవసరమైతే పోలింగ్ సిబ్బందికి సూచనలు అందించారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పిఆర్‌ఓ యాప్, ఇన్‌ఈసిఐ నెట్ ద్వారా ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలైన ఓట్ల వివరాలు ప్రిసైడింగ్ అధికారులు నమోదు చేయడం జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు.




### స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించిన ఇవిఎంలు

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నిక పోలింగ్ ప్రక్రియ పూర్తయింది. సాయంత్రం ఆరు గంటలకు ఓటింగ్ ముగియగా, అప్పటి వరకు క్యూలైన్‌లో ఉన్నవారికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు. పోలింగ్ విధులు ముగించుకున్న సిబ్బంది ఈవిఎంలు, పోలింగ్ సామాగ్రితో కలిసి భద్రత నడుమ కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలోని రిసెప్షన్ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవిఎంలను భద్రపరిచారు. ఈవిఎంల రవాణా సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా ముగిసిందని అధికారులు తెలిపారు.



## ఉగ్రవాదాన్ని కూకటివేళ్ళతో అంతమొందించాలి

ఢిల్లీ బాంబు పేలుడు ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి

ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దగ్ధం : ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడులో 13 మంది అమాయకులు మరణించడం బాధాకరమని, ఈ ఘటనకు పాల్పడిన ఉగ్రవాదులను అరెస్ట్ చేసి చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని, ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. ఉగ్రవాద చర్యలను నిరసిస్తూ ఎఐవైఎఫ్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని వై జంక్షన్ కూడలి వద్ద ప్లకార్డులు చేతబూని, ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రీ, కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిజ్జ శ్రీనివాసులు, ఎం.శ్రీమాన్, రాష్ట్ర సమితి సభ్యులు అనిల్ కుమార్, శ్రావణ్, రమేష్, నర్సింహా, కిరణ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు. వలి ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ ఢిల్లీలో శాంతిభద్రతలు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నియంత్రణలో ఉన్నాయని ప్రగల్భాలు పలికిన అమిత్ షా, ఇంతటి ఘోరం జరుగుతున్నా ఇంటెలిజెన్స్, ఆర్ఎడబ్ల్యు, నేషనల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ నిఘా విభాగాలు నిద్రావస్థలో ఉండటం ప్రధాని మోదీ నిర్లక్ష్యానికి పరిపాలనకు నిదర్శనమన్నారు.

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా దేశంలో భద్రత కల్పించడంలో తన పాత్రను మరచిపోయి ఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాత కూడా బీహార్‌లో ఉండటం ద్వారా రాజకీయ కోణంలో బిజెపి నీచ శవ రాజకీయాలకు తెర లేపిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఉగ్రదాడిలో మరణించిన వారి కుటుంబాలకు కోటి రూపాయలు, గాయపడిన వారికి రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పరాకష్ట

బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతం రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల పోలింగ్ సందర్భంగా బిజెపి నాయకులపై పోలీసులు అన్యాయంగా వ్యవహరించారని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్. గౌతమ్ రావు ఆరోపించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ప్రకటన విడుదల చేశారు. పంజాగుట్ట పోలీసులు బిజెపి సీనియర్ నాయకులు పాపారావు, అనంత కృష్ణలను అన్యాయంగా అరెస్ట్ చేసి, వారి మొబైల్ ఫోన్లు గుంజుకోవడంతో పాటు మానసికంగా వేధించారని తెలిపారు. ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్యానికి, న్యాయవ్యవస్థకు విరుద్ధమని ఆయన ఖండించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నప్పటికీ, అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, నాయకులు ఓటర్లను ప్రభావితం చేసే విధంగా డబ్బులు పంచడం, ప్రలోభాలకు గురిచేయడం వంటి తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనలు జరిగినప్పటికీ పోలీసులు కనీసం స్పందించకపోవడం దురదృష్టకరమని ఆయన విమర్శించారు. అదే సమయంలో బిజెపి నాయకులను మాత్రమే టార్గెట్ చేసి అరెస్ట్ చేయడం అధికార దుర్వినియోగమని డాక్టర్ గౌతమ్ రావు మండిపడ్డారు. ఈ అక్రమంగా అరెస్టు చేసిన పాపారావు, అనంత కృష్ణలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



## అందెశ్రీకి అరసం అశ్రు నివాళి

జన చైతన్యాన్ని రగిలించిన ప్రజా వాగ్గేయకారుడు, ఉద్యమ సూర్యుడు అందెశ్రీ అస్తమించిన వార్త దిగ్భ్రాంతి కలిగించిందని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎస్.సూర్య ప్రకాష్, గడ్డమీది చంద్రమోహన్ గౌడ్ అన్నారు. అందెశ్రీ మృతికి వారు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## అందెశ్రీకి హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఘన నివాళి

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ప్రముఖ కవి అందెశ్రీకి హైదరాబాద్ బుక్ ఫెయిర్ మంగళవారం నివాళి అర్పించింది. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్ సెక్రెటరీ వాసు, వైస్ ప్రెసిడెంట్ శోభన్ , ట్రెజరర్ నారాయణరెడ్డి అలాగే కమిటీ సభ్యులు కృష్ణారెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రముఖ కవి, గేయ రచయిత, తెలంగాణ ఉద్యమ గాయకుడు అందెశ్రీ (64) కన్నుమూయడం బాధాకరమన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన రాసిన పాటల్లో తెలంగాణ గ్రామీణ జీవితం, యాస, సంస్కృతి, ఉద్యమ స్ఫూర్తి ప్రస్ఫుటంగా కనిపిస్తాయన్నారు. అందెశ్రీ కేవలం కవిగానే కాక, తెలంగాణ సాంస్కృతిక, రాజకీయ చరిత్రలో చెరగని ముద్ర వేశారని కీర్తించారు. ఆయన తన పాటలతో, కవిత్వంతో తెలంగాణ ఉద్యమానికి నూతనోత్తేజాన్ని ఇచ్చారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ గొంతుక, తెలంగాణ రాష్ట్ర గీత రచయిత ఎవరంటే అందెశ్రీ అని ప్రతి ఒక్కరికి తెలిసేలా కీర్తిచాటుకున్నావారి మృతి భవిష్యత్తు తరానికి కూడా తీరని లోటు అని వారు పేర్కొన్నారు.



## బిఆర్‌ఎపి-2024లో టాప్ అచీవర్‌గా నిలిచిన తెలంగాణ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ రీఫారమ్స్ (బిఆర్‌ఎపి 2024)లో టాప్ అచీవర్‌గా తెలంగాణ రాష్ట్రం నిలిచింది. ఈ మేరకు ఢిల్లీలో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ అవార్డును స్వీకరించారు. పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డిపిఐఐటి), రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బలోపేతం చేయడానికి బిఆర్‌ఎపి2024 7వ ఎడిషన్‌ను ప్రారంభించింది. వ్యాపార సౌలభ్యాన్ని పెంపొందించడానికి విస్తృతమైన సంప్రదింపులు, వాటాదారుల అభిప్రాయాల ఆధారంగా రూపొందించిన బిఆర్‌ఎపి 2024లో 434 రీఫార్మ్ పాయింట్లు ఉన్నాయి. ఇవి కార్మిక చట్టాలు, భూసంవహన పరిపాలన, ఆస్తి రిజిస్ట్రేషన్, పెట్టుబడి సౌకర్యాలు, పర్యావరణ అనుమతుల వంటి కీలక అంశాలను కవర్ చేస్తాయి. బిఆర్‌ఎపి 2024 మార్గదర్శకాల ప్రకారం తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాన సంస్కరణలను విజయవంతంగా అమలు చేయడమే కాకుండా, 13 శాఖల్లో 1,467 కాంప్లయెన్స్‌లను తగ్గించింది. దీని ద్వారా సమర్థవంతమైన పరిపాలన, పారదర్శకత మరియు వ్యాపారానుకూల వాతావరణం పట్ల రాష్ట్రం యొక్క కట్టుబాటు మరోసారి వెల్లడైంది. ఈ విశిష్ట ప్రదర్శనకు గుర్తింపుగా, తెలంగాణ రాష్ట్రం బిఆర్‌ఎపి 2024లో బిజినెస్ ఎంట్రీ,కన్‌స్ట్రక్షన్ పర్మిట్ ఎనేబ్లర్స్, సర్వీస్ సెక్టార్, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ నాలుగు ప్రధాన విభాగాల్లో టాప్ అచీవర్‌గా తెలంగాణ నిలిచింది.


**దక్షిణ మధ్య రైల్వే**

Follow us on X @SCRailwayindia

దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

PUB/1419

**నమూనా 10–1**
**బహిరంగ ప్రకటన**

ఈ క్రింద పేర్కొన్న సెక్షన్‌లో రైల్వే లైను పనులు పూర్తయినవి. ఈ రైల్వే లైన్లను, రైల్వే ప్రాంగణాలను ఉపయోగించే వినియోగదారులకు తెలియజేసే ప్రకటన ఈ క్రింది విధంగా ఉంది.

సెక్షన్: సికింద్రాబాద్: కాజీపేట–విజయవాడ సెక్షన్ మధ్య ఎలక్ట్రిఫికేషన్ చేయబడిన కొత్త బ్రాడ్ గేజ్ మూడోలైను నిర్మాణం. డోర్నకల్ జంక్షన్ (బైపాస్) (డికెజె) మరియు ఖమ్మం (కెఎంటి) మధ్య ఎలక్ట్రిఫికేషన్‌తో కూడి మూడవ బ్రాడ్ గేజ్ కొత్త లైను ప్రారంభం. పైన పేర్కొన్న స్టేషన్ల మధ్య 463.257 కి.మీ నుండి 482.850 కి.మీ వరకూ ప్రభుత్వ రవాణా ద్వారా ప్రయాణికులను రవాణా చేయడానికి-రిజిస్టర్డ్.

****

**డోర్నకల్ జంక్షన్ (బైపాస్) (డికెజె) మరియు ఖమ్మం (కెఎంటి) స్టేషన్స్ మధ్య ఎలక్ట్రిఫికేషన్‌తో కూడిన మూడవ బ్రాడ్‌గేజ్ రైల్వే లైను నిర్మించడమైనది. 463/C3 (కెఎం./సిహెచ్.:463/108.90) నుండి 483/C5 (కెఎం./సిహెచ్:483/209.50** దక్షిణ మధ్య రైల్వే డోర్నకల్ జంక్షన్ (బైపాస్) (డికెజె) మరియు ఖమ్మం (కెఎంటి) స్టేషన్స్ మధ్య 25000 వోల్టులు, 50 ఫ్రీక్వెన్సీ యూనిట్లు., ఎసి ఓవర్‌హెడ్ ట్రాక్షన్ వైర్లను **16/11/2025 తేదీ నాటికి లేదా ఆ తర్వాత** సంపూర్ణమైన విద్యుత్ శక్తి సామర్థ్యంతో నింపబడి ఉండును. ఇక అప్పటినుండీ ఈ విద్యుత్ వైర్లు ఎల్లవేళలా సంపూర్ణమైన విద్యుత్ శక్తి సామర్థ్యంతో నిరంతరం రైళ్ళ రాకపోకల అవసరాలనిమిత్తం పనిచేస్తూ ఉండును. అనధికార వ్యక్తులు వీటిని సమీపంలోకి రాకూడదు. లేదా ఈ ఓవర్‌హెడ్‌లైన్స్ సమీపంలో ఎలాంటి పనులు చేయకూడదు.

**నమూనా 10-2**
**(ఎసిటిఎం పేరా 21020, సంపుటి II, ఒకటవ భాగం: దిద్దుబాటు చీటీ నెం.32, తేదీ: 09.1.2020)**
**ఎసి 25 కెవి ట్రాక్షన్ ప్రవేశిక**
**"రహదారి వినియోగదారులకు హెచ్చరిక"**

ఈ క్రింద పేర్కొన్న సెక్షన్‌లో 25 కెవి ఎసి ఎలక్ట్రిక్ ట్రాక్షన్ పనిచేయడం ప్రారంభం కానున్నది. దీనికి సంబంధించి ప్రజలకు సమాచారం తెలియజేయడానికి ఈ ప్రకటన జారీ చేయడమైనది.:

సెక్షన్: సికింద్రాబాద్: కాజీపేట-విజయవాడ సెక్షన్ మధ్య ఎలక్ట్రిఫికేషన్ చేయబడిన కొత్త బ్రాడ్ గేజ్ మూడోలైను నిర్మాణం. డోర్నకల్ జంక్షన్ (బైపాస్) (డికెజె) మరియు ఖమ్మం (కెఎంటి) మధ్య ఎలక్ట్రిఫికేషన్‌తో కూడి మూడవ బ్రాడ్ గేజ్ కొత్త లైను ప్రారంభం. పైన పేర్కొన్న స్టేషన్ల మధ్య 463.257 కి.మీ నుండి 482.850 కి.మీ వరకూ ప్రభుత్వ రవాణా ద్వారా ప్రయాణికులను రవాణా చేయడానికి-రిజిస్టర్డ్

****

**డోర్నకల్ జంక్షన్ (బైపాస్) (డికెజె) మరియు ఖమ్మం (కెఎంటి) స్టేషన్స్ మధ్య ఎలక్ట్రిఫికేషన్‌తో కూడిన మూడవ బ్రాడ్‌గేజ్ రైల్వే లైను నిర్మించడమైనది. ఓహెచ్‌ఇ లోకేషన్ 463/C3 (కెఎం./సిహెచ్.: 463/108.90) నుండి 483/C5 (కెఎం./సిహెచ్: 483/209.50 దక్షిణ మధ్య రైల్వే డోర్నకల్ జంక్షన్ (బైపాస్) (డికెజె) మరియు ఖమ్మం (కెఎంటి) స్టేషన్స్ మధ్య, అన్ని లెవెల్ క్రాసింగ్‌ల వద్దా ఎత్తైన స్తంభాలను నిర్మించడమైనది. ఈ ఎత్తైన స్తంభాలను రోడ్డు మట్టానికి చాలా 4.78 మీటర్ల ఖచ్చితమైన గరిష్ట ఎత్తులో నిర్మించడమైనది.** ఎందుకంటే చాలా ప్రమాదకరమైన, విద్యుత్ ప్రవహించే తీగలు సమీపంలో ఉన్నందువల్ల ఆ గరిష్ట ఎత్తుకంటే ఎక్కువ ఎత్తులో సరుకులను మోసుకొచ్చే వాహనాలను అడ్డుకోవడంకోసం, వాటికి తగలకుండా నివారించడానికి హెచ్చరికగా ఈ ఎత్తైన స్తంభాలు నిర్మించడమైనది.

అందువల్ల పైన పేర్కొన్న ఎత్తును పరిశీలించి గుర్తించవలసిందిగా ప్రజలు ఇందుమూలముగా తెలియజేయడమైనది. ఆ రోడ్డులో ప్రయాణించే వాహనాలు నిర్దేశించిన ఎత్తుకు మించినస్థాయిలో సరుకు లోడును తీసుకువెళ్ళకూడదు. పైన పేర్కొన్న నిర్దేశిత ఎత్తును ఎట్టి పరిస్థితులలోనూ ఉల్లంఘించరాదు.

దానివల్ల కలిగే ప్రమాదాలు ఈ క్రింది విధంగా ఉండును.

i) ఎత్తైన స్తంభాలకు ప్రమాదం వాటిల్లును మరియు తత్ఫలితంగా రహదారికి దాంతోపాటు రైల్వే లైనుకు కూడా ఆటంకం కలుగును.

ii) వస్తు సామాగ్రికి లేదా ఉపకరణాలకు లేదా సరుకులకు లేదా వాటిని మోసుకువెళ్ళే వాహనానికి ప్రమాదం వాటిల్లును.

iii) ఆ విద్యుత్ వాహకాలకు సమీపంగా రావడంవల్ల లేదా వాటిని తగులుకోవడంవల్ల మంటలు చెలరేగడం మరియు ప్రాణాలకు అపాయం కలగే ప్రమాదం సంభవించును.

A1807 డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీరు, కన్‌స్ట్రక్షన్/విజయవాడ


## నీటి సంరక్షణలో తెలంగాణ నెంబర్ వన్

జల్ సంచయ్ జన్ భాగీదారి (జెస్‌జెబి) చొరవ కింద ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రం

జల్ శక్తి మంత్రిత్వ శాఖ ప్రకటన



**న్యూఢిల్లీ :** నీటి సంరక్షణలో తెలంగాణ నంబర్‌వన్ రాష్ట్రంగా అవతరించింది. 5.2 లక్షల నీటి సంరక్షణకు సంబంధించిన నిర్మాణాలలో జల్ సంచయ్ జన్ భాగీదారి (జెస్‌జెబి) 1.0 చొరవ కింద తెలంగాణ ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రంగా అవతరించిందని జల్ శక్తి మంత్రిత్వ శాఖ మంగళవారం తెలిపింది. 4.05 లక్షల నీటి సంరక్షణ నిర్మాణాలు పూర్తయిన ప్రాజెక్టులతో ఛత్తీస్‌గఢ్ రెండవ స్థానంలో నిలవగా, 3.64 లక్షల నిర్మాణాలతో రాజస్థాన్ రెండవ స్థానంలో నిలిచిందని జల్ శక్తి మంత్రి సిఆర్ పాటిల్ తెలిపారు. 'జల్ శక్తి అభియాన్: క్యాచ్ ది రెయిన్' ప్రచారం కింద ఈ సంవత్సరం అవార్డులను ఇస్తున్నట్లు పాటిల్ ప్రకటించారు. ఈ అవార్డులను ఈనెల 18న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 6వ జాతీయ జల అవార్డులలో జలవనరులు, నదుల అభివృద్ధి, గంగా పునరుజ్జీవన శాఖ కార్యదర్శి వి ఎల్ కాంతారావుతో కలిసి ప్రదానం చేస్తారు. సెప్టెంబర్ 2024లో సూరత్‌లో ప్రారంభించబడిన జెఎస్‌జెబి, పూర్తిగా ప్రభుత్వం, మొత్తం సమాజ నమూనా ద్వారా కమ్యూనిటీ నేతృత్వంలోని నీటి నిర్వహణను ప్రోత్సహిస్తుంది. రాష్ట్రాలకు కనీసం 10,000 కృత్రిమ రీఛార్జ్, నిల్వ నిర్మాణాలను సృష్టించే బాధ్యత అప్పగించబడింది. మున్సిపల్ కార్పొరేషన్లు కనీసం 10,000, పట్టణ స్థానిక సంస్థలు (యుఎల్‌బిలు) ఒక్కొక్కటి 2,000 పూర్తి చేయాల్సి ఉంది. ఉత్తరాదిన ఉత్తరప్రదేశ్ ముందంజలో ఉంది. మీర్జాపూర్ 35,509 పూర్తయిన పనులతో అగ్రస్థానంలో నిలిచింది. తరువాత వారణాసి (24,409), జలౌన్ (16,279) ఉన్నాయి. మూడు జిల్లాలకు రూ. 2 కోట్ల చొప్పున అందనున్నాయి. 92,742 నిర్మాణాలతో బలోడ్ మొదటి స్థానంలో నిలిచింది. తరువాత రాజ్‌నంద్‌గావ్ (58,967), రాయ్‌పూర్ (36,282) ఉన్నాయి. దక్షిణ జోన్‌లో తెలంగాణ జిల్లాలు మరోసారి పనితీరు కొలమానాల్లో ముందంజలో ఉన్నాయి. ఆదిలాబాద్ 98,693 పనులతో అగ్రస్థానంలో ఉండగా, తరువాత నల్లగొండ (84,827), మంచిర్యాల (84,549) ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లోని తూర్పు నిమార్ పశ్చిమ జోన్‌లో 1.29 లక్షల పూర్తయిన నిర్మాణాలతో మొదటి స్థానంలో ఉండగా, త్రిపురలోని ఉత్తర త్రిపుర ఈశాన్య, కొండ రాష్ట్రాల విభాగంలో ముందుంది. బిహార్, ఒడిశా, కర్ణాటక, తమిళనాడు, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, జమ్ముకశ్మీర్ జిల్లాలతో సహా మొత్తం 67 జిల్లాలను విభాగాల వారీగా అవార్డులకు ఎంపిక చేశారు. అత్యుత్తమ ప్రదర్శనకారులకు రూ. 1 కోటి నుండి రూ. 2 కోట్ల వరకు నగదు బహుమతులు, కేటగిరీ 3 కింద ఉన్న జిల్లాలకు రూ. 25 లక్షలు అందించనున్నారు. రాయ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్ జాతీయ మున్సిపల్ కార్పొరేషన్ల జాబితాలో 33,082 పూర్తయిన పనులతో అగ్రస్థానంలో ఉంది. తరువాత హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (14,363), గోరఖ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్ (14,331) ఉన్నాయి. ఒక్కొక్క నగరానికి రూ. 2 కోట్లు అందుతాయి. టాప్ 50 నాన్‌మునిసిపల్ యుఎల్‌బిలలో మధ్యప్రదేశ్‌లోని గుణ మునిసిపాలిటీ 2,227 పనులతో మొదటి స్థానంలో ఉంది. ఇది రూ. 40 లక్షలు అందుకుంటుంది. కార్పొరేట్, పౌర పర్యావరణ వ్యవస్థ నుండి సహకారాలను కూడా మంత్రిత్వ శాఖ గుర్తించింది. ఉత్తమ పరిశ్రమ సంఘాలుగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) వాటర్ మిషన్, అసోసియేటెడ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (అసోచమ్) ఎంపికయ్యాయి. జలతారా సేవ్ గ్రౌండ్ వాటర్ 8,256 పూర్తయిన పనులతో ఎన్‌జిఒ విభాగంలో అగ్రస్థానంలో నిలిచింది. తరువాత గిర్గంగా పరివార్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఉన్నాయి అని ఆయన అన్నారు. స్థానిక నీటి సంరక్షణ ప్రయత్నాలకు మద్దతు ఇచ్చినందుకు గుజరాత్‌కు చెందిన దాతలు కర్మభూమి సే మాతృభూమి, హస్ముఖ్ భాయ్‌లను సత్కరించారు. ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బిహార్, తెలంగాణ, కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, త్రిపుర, జమ్ముకశ్మీర్, ఉత్తరాఖండ్‌లలో జిల్లా స్థాయి సమన్వయానికి కేంద్ర జల కమిషన్, కేంద్ర భూగర్భ జల బోర్డు నుండి పద్నాలుగు మంది అధికారులు గుర్తింపు పొందారు. ఈ సంవత్సరం రాష్ట్రాలు, జిల్లాలు, యుఎల్‌బిలు, భాగస్వామ్య మంత్రిత్వ శాఖలు, ఎన్‌జిఒలు, పరిశ్రమలు, దాతలు, నోడల్ అధికారులతో కలిపి మొత్తం 100 అవార్డులు ప్రకటించబడ్డాయి.

## 21,22 తేదీల్లో ఐమాక్స్‌లో పలు భాషల సినిమాల ప్రదర్శన

సమాచార పౌర సంబంధాల శాఖ ఎస్‌సి సిహెచ్.ప్రియాంక



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నార్త్ ఈస్ట్ కనెక్ట్ ప్రోగ్రాంలో భాగంగా ఈ నెల 21,22 తేదీల్లో ఐమాక్స్ థియేటర్ లోని స్క్రీన్ 4, స్క్రీన్ 5లలో పలు భాషల సినిమాలను ప్రదర్శించనున్నట్లు సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక తెలిపారు. ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 8 సినిమాలతో పాటు 4 తెలుగు సినిమాలు ఐమాక్స్‌లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఆయా సినిమాల దర్శకులు, ఇతర ప్రముఖులు ఈ ఉత్సవాల్లో పాల్గొననున్నారు. ఐమాక్స్ థియేటర్‌ను మంగళవారం స్పెషల్ కమిషనర్ సందర్శించారు. సినిమాల ప్రదర్శనకు, ఆహ్వానితులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా తగు ఏర్పాట్లు చేయాలని అధికారులకి, థియేటర్ నిర్వాహకులకు సూచించారు. నార్త్ ఈస్ట్ కనెక్ట్ ఎ టెక్నో కల్చరల్ ఫెస్టివల్2025 లో భాగంగా వివిధ వేదికలపై ఐటి, కల్చరల్ ప్రోగ్రామ్స్‌తో పాటు సినిమాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ ఎల్‌ఎల్‌ఆర్ కిషోర్ బాబు, సిఐఇ రాధా కిషన్, ఉప సంచాలకులు వెంకటేశ్వర్లు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


**GYANA JYOTHI COLLEGE OF PHARMACY**
(Approved by AICTE, PCI & Affiliated to JNTU, Hyderabad)
Uppal Bus Depot, Hyderabad 500098. Ph.: 9393144415/12/18
Email: gyanajyothicollege@gmail.com Web: www.gjcp.ac.in

**B.CATEGORY NOTIFICATION: TGEAPCET - 2025**


| S.No. | Course | Intake | B.Categoryseats |
|---|---|---|---|
| 1 | B-Pharmacy | 100 | 30 |

Applications are invited under **B category** for the above mentioned courses for the academic year **2025-2026.** Interested and eligible candidates may submit applications along with the copies of certificates in the college. Admissions criteria will be as per the guidelines of TGCHE.

Sd/- Principal

# జాతీయం

NATIONAL & GENERAL NEWS



## ముస్లిం పర్సనల్ లా బోర్డు విచారం

**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు పట్ల ప్రముఖ ముస్లిం సంస్థలు ఆందోళన వ్యక్తం చేశాయి. భద్రతా లోపాలను పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ, ఈ ఘటనపై సమగ్ర, నిష్పాక్షిక, బహుళకోణాలలో దర్యాప్తు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరాయి.పేలుడుపై అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు తీవ్ర విచారాన్ని వ్యక్తం చేసింది. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు హృదయపూర్వక సంతాపాన్ని తెలియజేస్తూ, గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు బోర్డు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది.దేశ రాజధానిలోని చారిత్రాత్మక ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడుపై బోర్డు అధ్యక్షుడు మౌలానా ఖలీద్ సైఫుల్లా రెహ్మానీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై సమగ్ర, నిష్పాక్షిక, బహుళ కోణాలలో దర్యాప్తు నిర్వహించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి

- కర్నాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే డిమాండ్
- అమిత్ షా అత్యంత అసమర్థ హోం మంత్రి
- ఆయనపై చర్యకు మోదీ ఎందుకు భయపడుతున్నారు



**బెంగళూరు :** కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్వతంత్ర భారతదేశంలో అత్యం త అసమర్థ హోం మంత్రి అని కర్నాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే విమర్శించారు. ఢిల్లీ పేలుడులో పలువురు మరణించిన నేపథ్యంలో నిఘా వైఫల్యానికి బాధ్యత వహిస్తూ ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బెంగళూరులో మం గళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ఘటనలో కేంద్రం జవాబుదారీతనాన్ని ఆయన ప్రశ్నించారు. 'ఇంకా ఎంతమంది చనిపోవాలి' అని అన్నారు. దేశంలో వివిధ ఉగ్రవాద ఘటనలను ఉటంకిస్తూ అమిత్ షాపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చర్య తీసుకోలేదన్నారు. 'స్వతంత్ర భారతదేశంలో అమిత్ షా అత్యంత అసమర్థ హోం మంత్రి. ఇంకా ఎంతమంది ప్రాణాలు కోల్పోవాలి? ఢిల్లీ, మణిపూర్, పుల్వామా, పెహల్గామ్ ఘటనలపై మన వద్ద సమాధానాలు ఉన్నాయా? హోం మంత్రిగా ఆయన ఎన్నికల వేదికపైకి వెళ్లి బంగ్లాదేశీయులు భారతదేశంలోకి చొరబడుతున్నారని అంటున్నారు. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? దీనికి ప్రతిపక్షం బాధ్యత వహిస్తుందా?' అని ప్రియాంక్ ఖర్గే నిలదీశారు. 'జవాబుదారీతనం లేదు. అమిత్‌షాను తరచుగా ఆధునిక సర్దార్ పటేల్ అని పిలుస్తారు. 56 అంగుళాల ఛాతీ గురించి పదేపదే వాదనలు వినిపిస్తున్నాయి. ఆయన రాజీనామా చేసేందుకు ఇంకా ఎంత మంది ప్రాణాలు కోల్పోవాలి?' అని అన్నారు.

**మోదీకి భయమెందుకు?:** అమిత్ షాకు వ్యతిరేకంగా చర్య తీసుకునేందుకు మోదీ ఎందుకు భయపడుతున్నారు? తన గుజరాత్ రహస్యాలు బయటపడతాయని ఆయన ఆందోళన చెందుతున్నారా? అని ప్రియాంక్ ఖర్గే అన్నారు. ఇతర దేశాలలో ఈ పాటికే హోంమంత్రి రాజీనామా చేసి ఉండేవారని, ఇంకా ఎంత మంది చనిపోవాలి? నిఘా వైఫల్యం ఉందని,ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## నిందితులను చట్టం ఎదుట నిలబెట్టాలి

సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో డిమాండ్


**న్యూఢిల్లీ :** ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడుతో ముడిపడి ఉన్న ఢిల్లీ పొరుగు ప్రాంతం నుండి భారీ మొత్తంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకోవడం వ్యవస్థీకృత సంబంధాల ప్రమేయాన్ని సూచిస్తుందని పేర్కొంది. దేశ రాజధాని నడిబొడ్డున జరిగిన పేలుడును ఖండిస్తూ, నిందితులను చట్టం ఎదుట నిలబెట్టడం ప్రభుత్వ బాధ్యత అని సిపిఐ(ఎం) నొక్కి చెప్పింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రెచ్చగొట్టే ఎలాంటి చర్యలకు లొంగకుండా శాంతి, సామరస్యతను పరిరక్షించుకోవాలని విజ్ఞప్తి చేసింది. 'ఢిల్లీ చుట్టుపక్కల ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పేలుడు పదార్థాలు, తుపాకులు కనుగొన్నారని, తాజా దాడితో ముడిపడి ఉన్నాయని వస్తున్న వార్తలు కలవరపరుస్తున్నాయని పేర్కొంది.

## ఫరీదాబాద్ నుంచి ఎర్రకోట వరకు... పేలుడుకు ముందు

# 11 గంటలు ఐ –20 కారు ప్రయాణం

సిసి టివి ఫుటేజ్‌లలో కారు మార్గాన్ని గుర్తించిన ఢిల్లీ పోలీసులు





**న్యూఢిల్లీ :** ఎర్రకోట వద్ద పేలుడుకు కారణమైన హ్యుందాయ్ ఐ –20 కారు పేలుడుకు ముందు ప్రయానించిన మార్గాన్ని ఢిల్లీ పోలీసులు గుర్తించారు. కారు హర్యానాలోని ఫరీదాబాద్ నుండి దేశ రాజధానికి వరకు కారు సుమారు 11 గం టల పాటు ప్రయాణించిందని పోలీసు వర్గాలు మంగళవారం నాడు తెలిపాయి. కారు సోమవారం తెల్లవారుజామున ఫరీదాబాద్ నుండి బయలుదేరి, ఢిల్లీలోని అనేక ప్రాంతాల గుండా చుట్టూ తిరిగి, సోమవారం సాయంత్రం 6:52 గం టలకు ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో పేలిపోయిందని ఆ వర్గాలు వెల్లడించాయి. 'కారు మొదట ఫరీదాబాద్‌లోని ఆసియన్ హాస్పిటల్ బైట ఉదయం 7:30 గంటలకు కనిపించింది. ఉదయం 8:13 గంటలకు బదర్‌పూర్ టోల్ ప్లాజాను దాటింది. ఇది ఢిల్లీలోకి ప్రవేశించడాన్ని సూచిస్తుంది' అని ఒక వర్గాలు తెలిపాయి. ఉదయం 8:20 గంటలకు, ఓఖ్లా ఇండస్ట్రియల్ ఏరియా సమీపంలోని పెట్రోల్ పంప్ గుండా వాహనం వెళుతున్న చిత్రాన్ని సిసిటివి ఫుటేజ్‌లో నిక్షిప్తమయ్యాయి. దర్యాప్తు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, మధ్యాహ్నం 3:19 గంటలకు కారు ఎర్రకోట కాంప్లెక్స్ పక్కన ఉన్న పార్కింగ్ ప్రాంతంలోకి ప్రవేశించింది. అక్కడ దాదాపు మూడు గంటల పాటు అది అలాగే ఉండిపోయింది. 'సాయంత్రం 6:22 గంటలకు, కారు పార్కింగ్ ప్రాంతం నుండి బయలుదేరి ఎర్రకోట వైపు వెళుతున్నట్లు కనిపించింది. పేలుడుకు ముందు 30 నిమిషాల సమయం మా దర్యాప్తులో కీలకమైన అంశం. వాహనం లోపల ఎవరు ఉన్నారో తెలుసుకోవడానికి మేము ప్రయత్నిస్తున్నాము' అని ఢిల్లీ పోలీసు వర్గాలు తెలిపాయి. వాహనం పార్కింగ్ ప్రాంతం నుండి బయలుదేరిన 24 నిమిషాల తర్వాత, సాయంత్రం 6:52 గంటల ప్రాంతంలో ఒక శక్తివంతమైన పేలుడు కదులుతున్న కారును ఛేధించింది. ఈ పేలుడులో వాహనం ముక్కలైంది. శరీర భాగాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. సమీపంలోని భవనాల అద్దాలు, మెట్రో స్టేషన్ పగిలిపోయాయి.



## క్షతగాత్రులకు సిపిఐ ఎంపి సందోష్ కుమార్ పరామర్శ

**న్యూఢిల్లీ :** ఎర్రకోట వద్ద పేలుడులో బాధితులను సిపిఐ జాతీయ కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు పి. సందోష్ కుమార్ మంగళవారం పరామర్శించారు. సిపిఐ ఢిల్లీ కార్యదర్శి ప్రొఫెసర్ దినేష్ వర్ష్ణేతో కలిసి ఆయన క్షతగాత్రులు చికిత్స పొందుతున్న ఎల్ఎన్‌జెపి ఆసుపత్రిని సందర్శించారు. గాయపడిన వారికి చికిత్స చేస్తున్న వైద్య బృందంతో ఆయన మాట్లాడారు. వారి పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. తీవ్రంగా గాయపడిన బాధితులను తాను కలిసానని, వారికి సరైన వైద్యం అందుతుందని సందోష్ కుమార్ ఆసుపత్రి బైట మీడియాతో తెలిపారు. మరణించిన, గాయపడిన వారి పట్ల, వారి కు టుంబసభ్యుల పట్ల పూర్తి సానుభూతి, సంఘీభావంతో ఉన్నామని తెలిపారు. దేశమంతటా ఒక్కటిగా నిలిచిందని, అసలు ఏమి జరిగిందో ఎవరికీ తెలియదని, ప్రస్తుతానికి గాయపడిన వారికి వైద్యం అందించటం అత్యంత అవసరమని అన్నారు.

## మేము మరణాన్ని దగ్గరగా చూశాం



'రోడ్డుపై జనం పడి ఉన్నారు. కొంతమందికి రక్తం కారుతోంది. మరికొందరు అస్సలు కదలడం లేదు. ప్రతిచోటా రక్తమే. మేము మరణాన్ని దగ్గరగా చూశాం' అని కుడి చేతి గాయానికి కట్టుకట్టుకొని, ఆసుపత్రి మంచంపై పడుకొని ఉన్న రామ్ ప్రతాప్ ఢిల్లీ ఎర్రకోట పేలుడు ఘటనను వివరించారు. ఆ ఘటనలో బిహార్‌కు చెందిన రోడ్డు పక్కన తినుబండారాలు విక్రయించే ఈ వ్యాపారి కూడా ఉన్నారు. ఎర్రకోట సమీపంలో ఒక చిన్న రోడ్డు పక్కన తినుబండారాల షాపు నడుపుతున్న ప్రతాప్ పేలుడు జరిగే ముందే తన షాపును మూసేందుకు సన్నద్ధమవుతున్నాడు. పేలుడు తన పాలిట పీడకలగా ఎలా మారిందో ఆయన కూడా ఆసుపత్రి బెడ్ మీద పడుకొని వివరించాడు. 'అది ప్రతి సాయంత్రం లాంటిదే. కొంతమంది కస్టమర్లు వేచి ఉండగా అకస్మాత్తుగా పెద్ద పేలుడు సంభవించింది. శబ్దం చాలా బలంగా ఉంది, నాకు కొన్ని సెకన్ల పాటు ఏమీ వినబడలేదు. గాజు ముక్కలు మాపై పడ్డాయి, దట్టమైన పొగ మొత్తం అలుముకుంది' అని ప్రతాప్ చెప్పారు.'జనం నేలపై పడి ఉన్నారు, కొంతమంది రక్తమోడుతున్నారు. మరికొందరు అస్సలు కదలడం లేదు. రక్తం ప్రతిచోటా పడింది. నా చేతికి రక్తం బాగా కారుతోంది, కానీ నేను ఆ విషయాన్ని గ్రహించలేదు. మేము మరణాన్ని దగ్గరగా చూశాము,' అని ఆయన తన కన్నీళ్లను ఆపుకోవడానికి ప్రయత్నిస్తూ అన్నాడు. ఎమర్జెన్సీ వార్డు బైట ప్రతాప్ బంధువులలో ఒకరు పేలుడు జరిగినప్పుడు కొన్ని మీటర్ల దూరంలో నిలబడి ఉన్న విషయాన్ని గుర్తుచేసుకున్నాడు. 'ఒక మెరుపు, తరువాత మంటలు, తరువాత దట్టమైన నల్లటి పొగ. నేను దిగ్భ్రాంతికి గురయ్యాను. నా సోదరుడు కనపడలేదు' అని అయన చెప్పాడు.ఆ సాయంత్రం, ప్రతాప్ షాపుకు కొన్ని మీటర్ల దూరంలో విజేందర్ యాదవ్ తన నీటి ట్యాంకర్‌ను పార్క్ చేసినప్పుడు పేలుడు సంభవించింది. అంతా చీకటిగా మారింది.

## పెద్ద దిక్కును కోల్పోయాం



ఉత్తరప్రదేశ్‌లోని షామ్లి జిల్లాకు చెందిన 18 ఏళ్ల నౌమాన్ అన్సారీ తన షాపులో విక్రమించేందుకు అవసరమైన సౌందర్య సాధనా లు కొనడానికి ఢిల్లీలో ఉన్నప్పుడు ఎర్రకోట సమీపంలో జరిగిన శక్తివంతమైన పేలుడులో ప్రాణాలు కోల్పోయాడు. షామ్లిలోని జింఝాన పట్టణానికి చెందిన అన్సారీ ఆయన కుటుంబానికి ఏకైక జీవనాధారం. నౌమాన్ అక్కడికక్కడే మరణించగా, ఆయన బంధువు అమన్ గాయపడి ఢిల్లీలోని లోక్ నాయక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని నౌమాన్ మామ ఫుర్కాన్ పిటిఐకి తెలిపారు. నౌమాన్ భౌతికకాయాన్ని ఖననం చేయడానికి కుటుంబం ఏర్పాట్లు చేస్తోందని ఫుర్కాన్ చెప్పారు. చనిపోయిన వారిలో అమ్రోహా జిల్లాకు చెందిన 34 ఏళ్ల ఆర్‌టిసి కండక్టర్ అశోక్ కుమార్ కూడా ఉన్నారు. మరో మృతుడిని 22 ఏళ్ల పంకజ్ సాహినిగా గుర్తించారు. అతను టాక్సీ నడుపుతుంటాడు. సోమవారం సాయంత్రం జరిగిన పేలుడులో తన సోదరుని కుమారుడు మరణించాడని, ఆ పేలుడులో 12 మంది మరణించారని ఢిల్లీలోని కొత్వాలి పోలీస్ స్టేషన్ నుండి ఫోన్ కాల్ వచ్చిందని ఆయన బంధువు రాందేవ్ సాహ్ని తెలిపారు.'పంకజ్ మూడు సంవత్సరాలుగా టాక్సీ నడిపాడు. అయన తల వెనుక భాగం ఎగిరిపోయిందని మాకు చెప్పారు. వాగన్ ఆర్ కారు పూర్తిగా దెబ్బతిన్నది' అని సాహ్ని చెప్పారు.

### 13కు చేరిన మృతులు

ఢిల్లీ పోలీసుల ప్రకారం మృతుల సంఖ్య 13 కి పెరిగింది. మంగళవారం మరో నలుగురు వ్యక్తులు తీవ్ర గాయాలతో మరణించారు. ఈ సంఘటనలో మరో 20 మందికి పైగా గాయపడ్డారు.

## ఫరిదాబాద్‌లో ముమ్మరంగా గాలింపు చర్యలు

**ఫరిదాబాద్ :** జుమ్ముకశ్మీర్‌లో భారీ ఉగ్ర కుట్రను పోలీసులు ఛేదించిన విషయం తెలిసిందే. హర్యానాలోని ఫరీదాబాద్‌లో కశ్మీర్‌కు చెందిన ఓ డాక్టర్ నివాసముంటున్న అద్దె ఇంట్లో 2,900 కిలోల పేలుడు పదార్థాలు, మండే పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. అయితే మంగళవారం ఫరిదాబాద్‌లో విస్తృతమైన కూంబింగ్, సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన పేలుడులో 12 మంది మరణించిన ఘటనపై ప్రాథమిక దర్యాప్తులో ఫరీదాబాద్‌లో బయటపడిన ఉగ్రవాద మాడ్యూల్‌తో సంబంధాలు ఉన్నాయని తేలింది. కాశ్మీరీ వైద్యుడు గత మూడున్నర సంవత్సరాలుగా నివసించిన అల్ ఫలా విశ్వవిద్యాలయంలో అక్కడి సిబ్బంది, వైద్యులను ప్రశ్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఢిల్లీ నుండి 45 కి.మీ దూరంలో ఉన్న హర్యానా ఫరీదాబాద్ జిల్లాలోని ధౌజ్‌లోని అల్ ఫలా విశ్వవిద్యాలయం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) గుర్తింపు పొందిన ప్రైవేట్ సంస్థ. ధౌజ్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో అనేక మంది పోలీసు సిబ్బంది సోదాలు నిర్వహిస్తున్నారు.రాష్ట్రంలో పరిస్థితి ప్రశాంతంగా ఉందని, పోలీసులు, ఇతర ఏజెన్సీలు ఉప్రమత్తంగా ఉన్నారని, పుకార్లు వ్యాప్తి చేయవద్దు, వాటిని నమ్మవద్దు అని హర్యానా పోలీసు చీఫ్ ఒపి సింగ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. అయితే ఫరీదాబాద్‌లో కొత్తగా పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు వచ్చిన వార్తలను ఆయన తోసిపుచ్చారు. ఫరీదాబాద్‌లో దీపావళి క్రాకర్లు స్వాధీనం చేసుకున్నారని, అవి లుడు పదార్థాలు కావన్నారు. ఏదైనా అనుమానాస్పద వ్యక్తి లేదా వస్తువును గుర్తిస్తే అత్యవసర హెల్ప్‌లైన్ 112కు డయల్ చేయడం చేయాలని ప్రజలను కోరారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న ఒక మతాధికారి తన గదిని ఒక ఆటోరిక్షా డ్రైవర్‌కు అద్దెకు ఇచ్చాడని, ఆ తర్వాత గదిలో లగేజీ ఉంచినందుకు డాక్టర్ ముజమ్మిల్ గనైకి ఇచ్చాడని ఇప్పటివరకు జరిగిన దర్యాప్తులో వెల్లడైంది. ముగ్గురు వైద్యులు సహా ఎనిమిది మందిని సోమవారం అరెస్టు చేసిన విషయం విదితమే. జైషే మహమ్మద్, అన్సార్ ఘజ్వత్–ఉల్–హింద్‌తో సంబంధం ఉన్న 'వైట్ కాలర్' టెర్రర్ మాడ్యూల్‌ను వెలికితీయడంతో 2,900 కిలోల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. హర్యానాలో హెచ్చరికలను పెంచడంలో భాగంగా సోమవారం సాయంత్రం నుండి పోలీసులు రాష్ట్ర సరిహద్దులలో, అలాగే అన్ని ప్రజా రవాణా, పార్కింగ్ ప్రాంతాలు, హోటళ్ళు, ధర్మశాలలలో వాహనాలను తనిఖీ చేస్తున్నారు, అదే సమయంలో రద్దీగా ఉండే ప్రదేశాలు, ముఖ్యమైన సంస్థాపనల వద్ద నిఘా పెంచబడింది. రైల్వే స్టేషన్లలో కూడా భద్రతను పెంచారు. తనిఖీలు ముమ్మరం చేశారు.



## అమెరికా, చైనా సహా పేలుడును ఖండించిన ప్రపంచ దేశాలు



**బీజింగ్ / వాషింగ్టన్ :** ఢిల్లీ పేలుడులో ప్రాణనష్టంతో పాటు పలువురు గాయపడిన ఘటన పట్ల అమెరికా, చైనా, జపాన్, ఇజ్రాయెల్ సహా ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాధినేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'న్యూఢిల్లీలో జరిగిన భయంకరమైన పేలుడు బాధితులతో మా మనస్సులు ఉన్నాయి. పరిస్థితిని మేము నిశితంగా పరిశీలిస్తూనే ఉన్నాము. తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాలకు మా హృదయపూర్వక సంతాపం. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాము' అని విదేశాంగ శాఖ దక్షిణ, మధ్య ఆసియా వ్యవహారాల బ్యూరో సోమవారం 'ఎక్స్'లో ఒక పోస్ట్‌లో తెలిపింది. ఢిల్లీలో జరిగిన బాంబు పేలుడుపై చైనా దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. 'ఈ సంఘటనతో మేము దిగ్భ్రాంతి చెందాము' అని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ బీజింగ్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. బాధితులకు ఆయన సంతాపం తెలిపారు, మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి హృదయపూర్వక సానుభూతి తెలిపారు. జపాన్ ప్రధాన మంత్రి సనే తకైచి తన సోషల్ మీడియా ఖాతాలో 'పేలుడులో అనేక విలువైన ప్రాణాలు కోల్పోయారని తెలిసి తాను తీవ్ర విచారంలో ఉన్నాన'ని పోస్ట్ చేశారు. బాధితులకు,వారి కుటుంబ సభ్యులకు ఆమె తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఢిల్లీలో జరిగిన పేలుడు వార్తతో తాను బాధపడ్డానని, భారత ప్రజలకు శ్రీలంక సంఘీభావంగా నిలుస్తుందనిఅని శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సానాయకే సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపారు.

భూటాన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన రెండు రోజుల అధికారిక పర్యటనను కొనసాగిస్తున్న తరుణంలో థింపులో బాధితుల కోసం రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యేల్ వాంగ్‌చుక్ నేతృత్వంలో మృతులకు సంతాప సూచకంగా వేలాది మందితో ప్రార్థన సమావేశం నిర్వహించారు. ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడులో 'విషాదకరమైన ప్రాణనష్టం తనను తీవ్రంగా బాధపెట్టిందని' మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజు అన్నారు.ఈ క్లిష్ట సమయంలో మాల్దీవులు భారత ప్రజలకు, ప్రభుత్వానికి సంఘీభావంగా నిలుస్తున్నాయి అని ఆయన తన'ఎక్స్' ఖాతాలో అన్నారు.

ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియాన్ సార్ భారత ప్రజలకు, ము ఖ్యంగా పేలుడులో మరణించిన అమాయక బాధితుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఉగ్రవాదంపై పోరాటంలో ఇజ్రాయెల్ భారతదేశంతో నిలుస్తుంది అని ఆయన 'ఎక్స్' లో పేర్కొన్నారు.

బంగ్లాదేశ్ మాజీ ప్రధాన మంత్రి షేక్ హసీనా తన పార్టీ అవామీ లీగ్ సోషల్ మీడియాలో ఈ పేలుడును ఖండిస్తూ పోస్ట్ చేసిన ఒక ప్రకటనలో, న్యూఢిల్లీలో జరిగిన భయంకరమైన ఉగ్రవాద దాడి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదయోగ్యం కాదు అని అన్నారు. పాకిస్తాన్‌లో పాతుకుపోయిన ఉగ్రవాద గ్రూపులు, బంగ్లాదేశ్ సహా దేశాలలోని నెట్‌వర్క్‌లోకి చొరబడి, ప్రాంతీయ శాంతి మరియు స్థిరత్వాన్ని దెబ్బతీసేందుకు భారతదేశంలో దాడులు చేస్తున్నాయని ఆమె అన్నారు.

నేపాల్ తాత్కాలిక ప్రధాన మంత్రి సుశీలా కార్కి మృతులకు, వారిని కోల్పోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపుతూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ దుఃఖ సమయంలో నేపాల్ భారతదేశానికి సంఘీభావంగా నిలుస్తోంది అని ఆమె అన్నారు.

ఢిల్లీలో జరిగిన ఈ దారుణ పేలుడు తనను తీవ్రంగా బాధపెట్టిందని ఐర్లాండ్ ఉప ప్రధాన మంత్రి సైమన్ హారిస్ అన్నారు. ప్రాణాలు కోల్పోయిన వారందరికీ, గాయపడిన వారికి మరియు వారి కుటుంబాలకు మా మనస్సులు ఉన్నాయి. ఈ క్లిష్ట సమయంలో భారత ప్రజలకు మరియు ప్రభుత్వానికి తాము మా పూర్తి మద్దతు సంఘీభావాన్ని అందిస్తున్నాము అని ఆయన అన్నారు.

## బిహార్‌కు 'ఫలితం' అవసరం

జుమ్లాలు కాదు : తేజస్వీ యాదవ్



**పాట్నా :** బీహార్ ఎన్నికల మొదటి దశలో జరిగిన రికార్డ్ ఓటింగ్ ద్వారా ప్రజలు తమకు 'ఫలితం' కావాలని, 'జుమ్లా' (బోలు వాక్చాతుర్యం) కాదని ప్రత్యక్ష సందేశం ఇచ్చారని ఆర్‌జెడి నాయకుడు, ఇండియా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్ అన్నారు. మంగళవారం తుది విడత పోలింగ్ నేపథ్యంలో తేజస్వీ స్పందిస్తూ అనేక చోట్ల అధికారులు ఎన్నికల వేగాన్ని చాలా నెమ్మదింపజేస్తున్నారని, అయినా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోకుండా ఓటింగ్ క్యూల నుండి వెనక్కి తగ్గవద్దని ఆయన కోరారు. ఎన్‌డిఎ ప్రభుత్వం నుండి ప్రజలు పొందినదంతా హామీలు, నినాదాలు, వాక్చాతుర్యం, ఖాళీ వాగ్దానాలు మాత్రమేనని, బిహార్ ప్రజలు ఇకపై ఒక్క క్షణం కూడా వీటిని భరించలేరన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా బిహార్ కోసం అభివృద్ధి విధానాన్ని రూపొందించడానికి ఇండియా కూటమి కృషి చేసిందని, ఇది స్వభావంతో కలుపుకొని, ప్రతి తరగతి, కులం, మతం, సమాజానికి అనుగుణంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పజలు తమను తప్పుదారి పట్టించడానికి ఉద్దేశించిన ఎన్‌డిఎ దుష్ట ఉపాయాలను తిప్పికొట్టరని భారత కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి యాదవ్ అన్నారు. 'నా కల మీ కల లాంటిదే. మీ బాధ నా బాధ లాంటిదే. మా లక్ష్యాలు ఒకటే, బిహార్ బయటి వ్యక్తులు నీటిని అర్థం చేసుకోలేరు' అని ఆయన అన్నారు. గత 20 ఏళ్లలో అధికారులు నిజమైన అభివృద్ధిని సాధించడంలో విఫలమయ్యారని, ఇప్పటికే చాలా ఆలస్యం అయిందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం యువతకు ఉద్యోగాలు కల్పించలేకపోయిందని, నేరాలను తగ్గించలేకపోయిందని, నాణ్యమైన విద్యను నిర్ధారించలేకపోయిందని, సమర్థవంతమైన ఆరోగ్య సంరక్షణ కోసం మంచి ఆసుపత్రులను నిర్మించలేకపోయిందన్నారు. రైతులు వరదలతో సతమతమవుతున్నారని, వ్యాపారులు నష్టాలను ఎదుర్కొంటున్నారని, ప్రజలు ఇప్పటికీ ద్రవ్యోల్బణం గుప్పిట్లో ఉన్నారని తేజస్వీ ఆవేదన వ్యక్తం చేశారు. నిజమైన స్వేచ్ఛ నిరుద్యోగం, లంచం, అవినీతి, ద్రవ్యోల్బణం, అణచివేత, అన్యాయం, దోపిడీ, అసమానత వంటి సమస్యల నుండి విముక్తి పొందడమేనని ఆర్‌జెడి నాయకుడు నొక్కిచెప్పారు.

## ఢిల్లీలో వాయు కాలుష్యం... అమల్లోకి డేంజర్‌బెల్స్ ఆంక్షలు

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీ లో వాయు కాలుష్యం డేంజర్‌బెల్స్ మోగిస్తోంది. గాలి నాణ్యత రోజురోజుకూ క్షీణిస్తోం ది. మంగళవారం ఉదయం గాలి నాణ్యత సూచిక ప్రమాదకరస్థాయిలో నమోదైంది. ఎక్యూఐ లెవెల్స్ 425కుపైనే నమోదయ్యాయి. వాయు కా లుష్యం క్షీణించ దంతో ప్రభు త్వం అప్రమత్తమైంది. ఈ మేరకు ఢిల్లీ–ఎన్‌సిఆర్ ప్రాం తంలో జిఆర్ఎపి స్టేజ్3 ఆంక్షలు విధించింది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ డేటా ప్రకా రం.. ఢిల్లీ–ఎన్‌సిఆర్ ప్రాంతంలో సోమవారం ఉదయం 362గా ఉన్న ఎక్యూఐ లెవెల్స్.. మంగళవారం ఉదయానికి 425గా నమోదయ్యాయి. దీం తో రాజధానిలో ప్రభుత్వం పలు ఆంక్షలు విధించింది. అనవసరమైన నిర్మాణాలు, కూల్చివేత ప నులపై నిషేధం విధించింది. వాహన కాలుష్యాన్ని అరికట్టడంలో సహాయపడటానికి గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ కింద మూడో దశ ఆంక్షలు అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఢిల్లీ–ఎన్‌సిఆర్ ప్రాంతంలో పెట్రోల్‌తో నడిచే బిఎస్3, బిఎస్4 డీజిల్ వాహనాలపై నిషేధం విధించింది. ఈ ఆంక్షలు తక్షణమే అమల్లోకి వస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. మరోవైపు విద్యాసంస్థలకు కూడా ప్రభుత్వం కీలక విజ్ఞప్తి చేసింది. హైబ్రిడ్ పద్ధతిని అవలంభించాలని సూచించింది. ఐదవత తరగతి వరకూ పిల్లలకు ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించాలని సూచించింది.



ప్రజాపక్షం
బుధవారం, 12 నవంబరు

# దొంగ దెబ్బ తీశారు!

గాయపడిన విషజంతువు ఊరకే ఉండదన్న చందంగా భారతసైన్యం ఆపరేషన్ సిందూర్‌లో దెబ్బతిన్న ఉగ్రవాదులు ఢిల్లీలో దొంగదెబ్బ తీశారు. సోమవారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో ఎర్రకోట ట్రాఫిక్ సిగ్నల్ వద్ద కారులో ప్రేలుడు సర్వసాధారణ ప్రమాదం కాదని, టెర్రరిస్టు చర్య అనే నిర్ధారణకు మన ప్రభుత్వం వస్తోంది. ఈ కేసు దర్యాప్తును హోంమంత్రిత్వ శాఖ టెర్రరిస్టు నేరాల దర్యాప్తుకు ప్రత్యేకించిన నేషనల్ ఇన్‌వెస్టిగేషన్ ఏజన్సీ(ఎన్‌ఐఎ)కి అప్పగించటం దీన్ని ధృవీకరిస్తుంది. హోంమంత్రి అమిత్‌షా మంగళవారం ఒకటికి రెండుసార్లు జాతీయ రాజధానిలో భద్రత పరిస్థితిని ఉన్నతాధికారులతో సమీక్షించిన అనంతరం రెడ్‌ఫోర్ట్ వద్ద కారు పేలుడు ఘటనపై దర్యాప్తును ఎన్ఐఎకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

సోమవారంనాటి ప్రేలుడు రాజధానినే కాదు – యావద్దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ సంవత్సరం ఏప్రిల్ 22న జమ్మూ–కశ్మీర్‌లోని పహెల్‌గాంలో టెర్రరిస్టులు టూరిస్టులపై దాడిచేసి 26మంది అమాయక ప్రాణాలు బలిగొన్న ఘటన భారతీయుల హృదయాలను రగిలించిన తదుపరి, భారత సైన్యం మే 7న 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్ భూభాగంలో, దాని ఆక్రమిత కశ్మీర్‌లో ఆకస్మిక వైమానిక దాడులు చేసి టెర్రరిస్టుల మౌలిక వసతులు కొన్నింటిని ధ్వంసం చేయటం తెలిసిందే. ఆనాటినుంచి భారత్–పాకిస్థాన్‌ల మధ్య ఆరోపణల పర్వం కొనసాగుతున్నా సీమాంతర ఉగ్రవాద చర్యలు – కశ్మీర్‌లో కొన్ని రొటీన్ ఘటనలు మినహా – దాదాపుగా లేవు. అయితే సీమాంతర ఉగ్రవాద సంస్థలు భారత్ నిఘాను ఆదమరిపించేందుకు స్థబ్దుగా ఉన్నట్లు కనిపించాయని, కాని లోలోపల ప్రతీకార దాడులకు వ్యూహాలు పన్నుతూనే ఉన్నాయని ఢిల్లీ ఘటన విదితం చేస్తున్నది. ట్రాఫిక్ గ్రీన్ సిగ్నల్ పడిన తదుపరి మోటారు వాహనాలు నెమ్మదిగా కదులుతుండగా భయంకరమైన ప్రేలుడు సంభవించింది. అనేక కార్లు, దుకాణాలు ధ్వంసమైనాయి. మరణించిన 12మంది మానవ దేహాలు ముక్కలై చెల్లాచెదురుగా పడ్డాయి. అనూహ్యమైన ఈ భయంకర విధ్వంసంతో బిత్తరపోయిన భద్రతా బలగాలు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకుని సహాయక చర్యలతోపాటు ప్రాథమిక దర్యాప్తు ప్రారంభించాయి. ప్రేలుడు జరిగిన కారులో డ్రైవర్ సీటులో ఒక మృతదేహం ఛిద్రమై ఉన్నందున ఇది ఆత్మహత్యాపూర్వక ప్రేలేడు అని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఎవరా వ్యక్తి?

హర్యానాలోని ఫరీదాబాద్‌లో ఒక కశ్మీరీ డాక్టర్ అద్దెకు తీసుకున్న గది నుంచి సోమవారం 2900 కిలోల ప్రేలుడు పదార్థాలు, ఇతర జ్వలిత పదార్థాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు మంగళవారం విస్తృతంగా నిర్వహించిన సోదాల్లో ఒక వైట్‌కాలర్ టెర్రరిస్టుల మాడ్యూల్ గుట్టును బయటకు లాగారు. ముగ్గురు డాక్టర్లు సహా 8 మందిని అరెస్టు చేశారు. ఈ మాడ్యూల్‌కు ఎర్రకోట ఘటనకు సంబంధం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఫరీదాబాద్‌లో రెండు గదులు అద్దెకు తీసుకున్న డాక్టర్ ముజామ్మిల్ గవాయి (కశ్మీర్), డాక్టర్ షహీన్ (లక్నో)లను పోలీసులు అరెస్టు చేశారు. వీరిరువురూ ఫరీదాబాద్‌లోని ప్రైవేటు యూనివర్శిటీ అల్ ఫాలహాలో పనిచేస్తున్నారు. శ్రీమతి షహీన్ జైష్–ఎ–అహ్మద్ మహిళా విభాగం జమాత్–ఉల్–మొమినత్‌కు నాయకత్వం వహిస్తూ మహిళలను రిక్రూట్ చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. ఆత్మాహుతితో కారు ప్రేలుడుకు కారణమైన వ్యక్తి డాక్టర్ ఉమర్ నబీ. ఇతనికి ఫరీదాబాద్ మాడ్యూల్ తో సంబంధం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇతనిది పుల్వామా(కశ్మీర్).

జైష్–ఎ–మొహమ్మద్, అన్సార్ ఘాజ్‌వత్ – ఉల్ – హింద్‌లతో సంబంధం కలిగిన ఈ టెర్రర్ మాడ్యూల్ కశ్మీర్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లకు విస్తరించి ఉంది. చట్టవిరుద్ధ కార్యకలాపాల (నిరోధక)చట్టం, ప్రేలుడు పదార్థాల చట్టం కింద పోలీసులు కేసు రిజిస్టర్ చేశారు. ఉమర్‌కు ఐ20 కారు ఇచ్చిన పుల్వామా జిల్లా వాసి తారిఖ్ అనే వ్యక్తిని కూడా పోలీసులు అరెస్టు చేశారు.

కారణం ఏదైనా, ప్రభుత్వం ఇప్పటికిప్పుడు దీన్ని టెర్రరిస్టు చర్య అనకపోయినా, ఎన్ఐఎ దర్యాప్తును ఆదేశించటం ఆ విషయాన్ని చెప్పకనే చెబుతున్నది. దేశ రాజధానిలో, భద్రత ఉన్నత స్థాయిలో ఉండే ఎర్రకోట ప్రాంతంలో ఈ విధ్వంసం సంభవించటం మోదీ ప్రభుత్వానికి, ముఖ్యంగా హోంమంత్రి అమిత్ షా కు అవమానకరం. దోషులను పట్టి చట్టప్రకారం శిక్షిస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. కాంగ్రెస్ పాలనలో టెర్రరిస్టు చర్యలకు అంతంలేదని, తమ కఠిన వైఖరి కారణంగా టెర్రరిస్టులు అందుకు సాహసించటం లేదని గంభీర ప్రకటనలు చేసే ప్రభుత్వ నాయక ద్వయం ఇప్పుడు సంజాయిషీ ఇచ్చుకోవాలి. సీమాంతర ఉగ్రవాదానికి మూలమైన సమస్యల పరిష్కారానికి కృషిచేసినప్పుడే భారత్–పాకిస్థాన్‌ల మధ్య ఎప్పటికైనా శాంతి నెలకొంటుంది. ఏ పక్షం నుండైనా ఆధిపత్య ప్రకటనలు, చర్యలు ఉద్రిక్తతలకు ఆజ్యం పోస్తూనే ఉంటాయని గమనించగలరు.

# ప్రైవేటు చేతుల్లోకి విద్యుత్

## విద్యుత్ (సవరణ) బిల్లు – 2025ను వ్యతిరేకిస్తున్న సకల వర్గాలు



జగ్‌మోహన్ థాకెన్

రైతు, వినియోగదారుల, ఉద్యోగ వ్యతిరేక బిల్లుగా పేర్కొంటున్న విద్యుత్ (సవరణ) బిల్లు–2025కు వ్యతిరేకంగా నిరసన గొంతులు పెద్ద ఎత్తున వెలువడటం ప్రారంభించాయి. విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్లు, రైతులు, వినియోగదారులు దీనిని వ్యతిరేకించడానికి ఒకే దగ్గరకు రావడం ప్రారంభించారు.

నవంబర్ 3న ముంబైలో జరిగిన విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్ల జాతీయ సమన్వయ కమిటీ (ఎన్‌సిసిఒఇఇఇ) సమావేశంలో భారత ప్రభుత్వం తమ గొంతు వినకపోతే, దేశవ్యాప్తంగా 27 లక్షల విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్లు విద్యుత్ రంగ ప్రైవేటీకరణకు ఉద్దేశించిన ఈ విద్యుత్ (సవరణ) బిల్లు 2025కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమాలకు దిగాల్సి వస్తుందని నిర్ణయించారు.

విద్యుత్ (సవరణ) బిల్లు– 2025 కు వ్యతిరేకం గా దేశవ్యాప్తంగా ఆందోళనకు సిద్ధం చేసిన వ్యూహం ప్రకారం, విద్యుత్ ఉద్యోగులు, సంయుక్త కిసాన్ మోర్చా, అఖిల భారత కార్మిక సంఘాలు, సాధారణ వినియోగదారుల నాయకులతో ఐక్య ఫ్రంట్ ఏర్పాటు అవుతుంది.

ప్రైవేటీకరణ, విద్యుత్ (సవరణ) బిల్లు –2025 కు వ్యతిరేకంగా ఉద్యోగులు, ఇంజనీర్లను సమీకరించడానికి ఎన్‌సిసిఒఇఇఇ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఉమ్మడి సమావేశాలు నవంబర్, డిసెంబర్ , జనవరి నెలల్లో అన్ని రాష్ట్రాలలో నిర్వహిస్తారు. 2026 జనవరి 30న 'చలో ఢిల్లీ'కి పిలుపు ఇస్తారు.

జాతీయ కమిటీ నిర్ణయాలకు కట్టుబడి ఆల్ హర్యానా పవర్ కార్పొరేషన్స్ వర్కర్స్ యూనియన్ నేతృత్వంలో నవంబర్ 5 న రోహ్‌తాక్‌లో విద్యుత్ (సవరణ) బిల్లుకు వ్యతిరేకంగా రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నిర్వహించింది. విద్యుత్ కార్పొరేషన్ యాజమాన్యం ఉద్యోగుల డిమాండ్లను విస్మరించి ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తోందని ఆరోపిస్తూ, నవంబర్ 26 న పంచ్‌కుల ప్రధాన కార్యాలయం ఎసిఎస్ పవర్ వద్ద నిరసన తెలియజేస్తామని ప్రకటించింది.

బిల్లును ఎన్‌సిసిఒఇఇఇ ఎందుకు వ్యతిరేకిస్తోంది? ఈ బిల్లు ప్రస్తుత పరిస్థితిని ఎలా ప్రభావితం చేస్తుంది? అనే ప్రశ్నలు ఇప్పుడు తలెత్తాయి.

కన్వీనర్ సుదీప్ దత్తా నవంబర్ 4న విడుదల చేసిన ఒక ప్రకటనలో విద్యుత్ (సవరణ) బిల్లు 2025 దుష్ప్రభావాలను వివరిస్తూ , దీని ద్వారా కేంద్ర ప్రభుత్వం దేశంలోని మొత్తం ఇంధన రంగాన్ని ప్రైవేటీకరించాలని కోరుకుంటుందని ఎన్‌సిసిఒఇఇఇ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారని ఉటంకించారు. ప్రైవేటీకరణ తర్వాత, విద్యుత్ ధరలు భారీగా పెరిగి రైతులకు, సాధారణ వినియోగదారులకు అందుబాటులో ఉండవు.

ఎన్‌సిసిఒఇఇఇ నాయకులు శైలేంద్ర దుబే, మోహన్ శర్మ, కన్వీనర్ సుదీప్ దత్తా, కృష్ణ భోయార్, రత్నాకర్ రావు, సంజయ్ ఠాకూర్, లక్ష్మణ్ రాథోడ్ హాజరైన విలేకరుల సమావేశంలో బిల్లు ఎలా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందో వివరించారు.

సవరణ బిల్లులోని సెక్షన్లు 14, 42 , 43 ద్వారా విద్యుత్ సరఫరా చేయడానికి ప్రైవేట్ కంపెనీలకు ప్రభుత్వ విద్యుత్ పంపిణీ సంస్థల నెట్‌వర్క్‌ను ఉపయోగించుకునే హక్కు ఇవ్వబడుతోంది. ప్రతిగా, వారు ప్రభుత్వ డిస్కామ్‌లకు నామమాత్రపు వీలింగ్ ఛార్జీలను మాత్రమే చెల్లిస్తారు. ఇది ప్రభుత్వ రంగంలో విద్యుత్ పంపిణీ ముగింపుకు నాంది పలుకుతుంది అని ఎన్‌సిసిఒఇఇఇ ఆందోళన చెందుతోంది.

ఈ నెట్‌వర్క్ నిర్వహణ, బలోపేతం పూర్తి బాధ్యత ప్రభుత్వ పంపిణీ సంస్థలదేనని కమిటీ వివరించింది. దీని ఆర్థిక భారం ప్రభుత్వ విద్యుత్ పంపిణీ సంస్థలపైనే పడుతుంది. అయితే ప్రైవేట్



కంపెనీలకు ఈ నెట్‌వర్క్ ద్వారా డబ్బు సంపాదించే స్వేచ్ఛ ఇవ్వబడుతుంది.

ఈ సవరణ బిల్లు ప్రకారం, ప్రైవేట్ కంపెనీలకు నిరంతర విద్యుత్ సరఫరా బాధ్యత ఉండదు. దీని ప్రతికూల పరిణామం ఏమిటంటే, ప్రైవేట్ కంపెనీలు లాభదాయకమైన పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేయడానికి ప్రభుత్వ కంపెనీ నెట్‌వర్క్‌ను ఉపయోగిస్తాయి. అయితే రైతులకు,పేద గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేసే బాధ్యత ప్రభుత్వ విద్యుత్ పంపిణీ సంస్థలదే. ఫలితంగా, ప్రభుత్వ విద్యుత్ పంపిణీ సంస్థలు దివాళా తీస్తాయి. వాటి వద్ద విద్యుత్ కొనుగోలు చేయడానికి లేదా వారి ఉద్యోగులకు జీతాలు చెల్లించడానికి కూడా డబ్బు ఉండదు.

రాబోయే ఐదు సంవత్సరాలలో క్రాస్ సబ్సిడీని తొలగించడానికి సవరణ బిల్లు సెక్షన్ 61(జి)ని సవరించాలని ప్రతిపాదిస్తున్నట్లు ఎన్‌సిసిఒఇఇఇ పేర్కొంది. దీనితో పాటు, విద్యుత్ ఛార్జీలు ఖర్చును ప్రతిబింబించేలా ఉండాలని బిల్లు ప్రతిపాదిస్తుంది. అంటే ఏ వినియోగదారునికి ఖర్చు కంటే తక్కువ ధరకు విద్యుత్ సరఫరా చేయకూడదు. అనగా, వ్యవసాయానికి 6.5 హార్స్‌పవర్ పంపు రోజుకు ఆరు గంటలు పనిచేస్తే రైతుకు నెలకు రూ.12,000 విద్యుత్ బిల్లు వస్తుంది. అలాగే, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వినియోగదారులకు విద్యుత్ ఛార్జి యూనిట్‌కు కనీసం రూ. 10–రూ.12గా పెరుగుతాయి. ఇంకా, వర్చువల్ పవర్ మార్కెట్లు , మార్కెట్ ఆధారిత వాణిజ్య వ్యవస్థలను ప్రోత్సహించాలని బిల్లు ప్రతిపాదిస్తుంది. ఇది దీర్ఘకాలిక ఒప్పందాలను అస్థిరపరుస్తుంది, విద్యుత్ ఖర్చును మరింత అస్థిరంగా మారుస్తుంది.

ఈ బిల్లు దేశ సమాఖ్య నిర్మాణానికి విరుద్ధమా? ప్రస్తుతం విద్యుత్తు రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్‌లో ఉమ్మడి జాబితాలో ఉందని, అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విద్యుత్ విషయాలలో సమాన హక్కులు ఉన్నాయని ఎన్‌సిసిఒఇఇఇ హెచ్చరిస్తోంది. కానీ ఈ సవరణ బిల్లు ద్వారా, కేంద్ర ప్రభుత్వం విద్యుత్ విషయాలలో రాష్ట్రాల హక్కులను లాక్కుంటోంది. విద్యుత్ పంపిణీ, టారిఫ్ నిర్ణయంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యక్ష జోక్యం చేసుకుంటుంది. ఇది సమాఖ్య నిర్మాణం, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం.

రైతు సంఘాలు కూడా రంగంలోకి దిగాయి. హర్యానాలోని రోహతాక్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు కామ్రేడ్ ఇందర్‌జీత్ సింగ్ మాట్లాడుతూ విద్యుత్‌ను ప్రైవేటీకరించేందుకు తీసుకువచ్చిన విద్యుత్ సవరణ బిల్లును, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తారని ప్రకటించారు.

భారతీయ కిసాన్ యూనియన్ ఏక్తా దకొండ, పంజాబ్ కూడా విద్యుత్ బిల్లుకు వ్యతిరేకంగా ఆందోళనకు మద్దతు ఇవ్వడానికి ముందుకు వచ్చింది. కిసాన్ యూనియన్ సమావేశంలో, కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీని ఉల్లంఘిస్తూ విద్యుత్ సవరణ బిల్లు–2025ను తీసుకువస్తోందని, ఇది విద్యుత్ పంపిణీ రంగంలో ప్రైవేటీకరణను అమలు చేయడానికి ఒక కుట్ర అని తీర్మానాన్ని ఆమోదించినట్లు రాష్ట్ర ప్రెస్ సెక్రటరీ అంగ్రేజ్ సింగ్ భదౌర్ మా ప్రతినిధికి తెలియజేశారు. కాబట్టి విద్యుత్ సవరణ బిల్లు 2025ను పూర్తి శక్తితో వ్యతిరేకిస్తామని తెలిపారు

సంయుక్త కిసాన్ మోర్చా నవంబర్ 26న చండీగఢ్ వైపు కవాతు చేయనుందని, ఈ ప్రదర్శన కోసం నిర్దిష్ట ప్రణాళికలను రూపొందించడానికి నవంబర్ 17న చండీగఢ్‌లోని కిసాన్ భవన్‌లో సమావేశం నిర్వహించబడుతుందని భదౌర్ పేర్కొన్నారు. ఆ మార్చ్ ప్రధాన డిమాండ్లలో విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలనే డిమాండ్ ఉంటుంది.

ఇటువంటి సున్నితమైన అంశాలపై నిర్ణయం తీసుకునే సమయంలో ప్రభుత్వం మొండిగా, కఠినంగా వ్యవహరించకూడదు. మూడు నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా 13 నెలల పాటు రైతులు చేసిన ఆందోళనలో 700 మందికి పైగా రైతులు ప్రాణాలు కోల్పోయారని,చివరికి కేంద్ర ప్రభుత్వం ఆ చట్టాలను రద్దు చేయాల్సి వచ్చిందని ఎల్లవేళలా గుర్తుంచుకోవాలి.

(ఐపిఎ సర్వీస్)

# 'జి శాట్–7ఆర్'తో నావికాదళానికి కొత్త శక్తి

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చరిత్రలో మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. 2025 నవంబర్ 2వ తేదీన, దేశీయంగా అభివృద్ధి చేసిన శక్తివంతమైన లాంచ్ వెహికల్ మార్క్3 రాకెట్ ద్వారా, భారత నావికాదళానికి చెందిన అత్యంత అధునాతన కమ్యూనికేషన్ ఉపగ్రహం జీశాట్7ఆర్ (సిఎంఎస్ 03) విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశపెట్టబడింది. ఈ విజయం ఇస్రోకు గొప్ప సాంకేతిక మైలురాయి మాత్రమే కాదు, దేశ రక్షణ సామర్థ్యాలను ఇది గణనీయంగా పెంపొందించింది. అంతరిక్ష రంగంలో స్వావలంబన సాధించాలనే భారతదేశ లక్ష్యానికి ఇది తిరుగులేని నిదర్శనం.

శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి సాయంత్రం 5:26 గంటలకు నింగిలోకి దూసుకెళ్లిన ఎల్.వి.ఎం.3 రాకెట్కు 'బాహుబలి' అనే పేరు ఉంది. సుమారు 4,400 కిలోల బరువున్న జీశాట్7ఆర్ ఉపగ్రహాన్ని ఈ రాకెట్ జియోసింక్రనస్ బదిలీ కక్ష్యలోకి (జిటిఒ) విజయవంతంగా చేర్చింది. భారత్ గడ్డపై నుంచి ప్రయోగించిన కమ్యూనికేషన్ ఉపగ్రహాల్లో ఇంత బరువైనది ఇదే మొదటిసారి. నిజానికి నాలుగు టన్నుల కంటే ఎక్కువ బరువున్న ఉపగ్రహాలను ప్రయోగించడానికి గతంలో విదేశీ సంస్థలపై ఆధారపడవలసి వచ్చేది. ఇప్పుడు ఎల్.వి.ఎం.3 విజయం ద్వారా ఆ సాంకేతిక అవరోధాన్ని ఇస్రో పూర్తిగా తొలగించింది.

ఈ మిషన్‌లో ఉపగ్రహ ప్రయోగం మాత్రమే కాక, అంతకు మించిన ఒక ముఖ్యమైన సాంకేతిక ప్రయోగం కూడా జరిగింది. జీశాట్7ఆర్ ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టిన తర్వాత, ఇస్రో శాస్త్రవేత్తలు రాకెట్లోని సి25 క్రయోజెనిక్ అప్పర్ స్టేజ్ ఇంజిన్ను అంతరిక్షంలో మళ్లీ మండించి చూపారు. ఈ సామర్థ్యం రాకెట్ యొక్క కార్యాచరణ సౌలభ్యాన్ని అసాధారణంగా పెంచుతుంది. భవిష్యత్తులో ఈ రాకెట్ ఒకేసారి అనేక ఉపగ్రహాలను వేర్వేరు కక్ష్యల్లోకి ఖచ్చితంగా చేర్చడానికి, అలాగే గగన్యాన్ వంటి మానవ అంతరిక్ష యాత్రలకు అవసరమైన సంక్లిష్టమైన విన్యాసాలను నిర్వహించడానికి ఈ సాంకేతికత పునాదిగా నిలుస్తుంది.

**నావికాదళానికి 'వ్యూహాత్మక వరం'**

జీశాట్7ఆర్ ఉపగ్రహం భారత నావికాదళానికి ఒక వ్యూహాత్మక వరం. ఇది 2013 నుంచి సేవలందిస్తున్న పాత జీశాట్7 (రుక్మిణి) ఉపగ్రహం స్థానాన్ని భర్తీ చేస్తుంది. పూర్తిగా దేశీయంగా రూపకల్పన చేసి, అభివృద్ధి చేసిన ఈ ఉపగ్రహం, నౌకలు, జలాంతర్గాములు, విమానాలు, తీర ప్రాంత కమాండ్ కేంద్రాల మధ్య నిరంతరాయంగా, సురక్షితమైన కమ్యూనికేషన్ అనుసంధానాన్ని అందిస్తుంది. ఇది వాయిస్, డేటా, మరియు రియల్‌టైమ్ వీడియోలను సైతం అత్యధిక వేగంతో పంపగల సామర్థ్యాన్ని కలిగి ఉంది.



శత్రు దేశాల నుండి వచ్చే ఎలక్ట్రానిక్ దాడులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి జీశాట్7ఆర్ అత్యాధునిక రక్షణ లక్షణాలను కలిగి ఉంది. ఇందులో ప్రధానంగా జామింగ్ను నిరోధించే సామర్థ్యాలు మరియు ఫ్రీక్వెన్సీ హాపింగ్ సాంకేతికత ఉన్నాయి. ఈ ప్రత్యేకతలు యుద్ధ వాతావరణంలో సైతం నావికాదళ కమ్యూనికేషన్ వ్యవస్థ పటిష్టంగా, భద్రంగా ఉండేలా చూస్తాయి. ఈ ఉపగ్రహం యూహెచ్‌ఎఫ్, ఎస్, సి, కేయూ, కేఏ వంటి బహుళబ్యాండ్లలో పనిచేస్తుంది.

**హిందూ మహాసముద్రంలో పటిష్ఠమైన పర్యవేక్షణ**

ఈ ఉపగ్రహం హిందూ మహాసముద్ర ప్రాంతం అంతటా పటిష్టమైన టెలికమ్యూనికేషన్ కవరేజీని అందిస్తుంది. ఈ కవరేజీ ఆగ్నేయాసియా వైపు మరియు తూర్పు ఆఫ్రికా తీరం వైపు కూడా విస్తరించి, తీరం నుండి 2,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న నావికాదళ ఆస్తులకు సైతం సేవలందిస్తుంది. జీశాట్7ఆర్ అందించే ఈ మెరుగైన కమ్యూనికేషన్ అనుసంధానం ద్వారా, నావికాదళం యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, గగనతల నిఘా పరికరాలన్నింటినీ ఒకే నెట్‌వర్క్‌లోకి తీసుకురాగలదు. ఫలితంగా, నిజ సమయ పరిస్థితులపై అవగాహన పెరిగి వ్యూహాత్మకంగా కీలకమైన ఇండోపసిఫిక్ జలాల్లో నావికాదళం సమన్వయంతో కూడిన కార్యకలాపాలను వేగంగా నిర్వహించడానికి వీలవుతుంది. అందుకే ఈ ఉపగ్రహాన్ని నావికాదళానికి శక్తి గుణకం అని వ్యవహరిస్తున్నారు. రక్షణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, సంక్లిష్టమైన భద్రతా సవాళ్ల మధ్య, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దేశ సముద్ర ప్రయోజనాలను కాపాడాలనే భారత నావికాదళ సంకల్పాన్ని జీశాట్7ఆర్ ప్రతిబింబిస్తోంది. ఈ ఉపగ్రహం పూర్తిగా దేశీయంగా తయారవ్వడం మరియు దేశీయ రాకెట్ ద్వారా ప్రయోగించడం వలన, అత్యవసర సమయాల్లో విదేశీ కమ్యూనికేషన్ వ్యవస్థలపై ఆధారపడాల్సిన అవసరం తప్పింది. ఇది భారత సార్వభౌమత్వానికి, భద్రతకు అత్యంత కీలకమైన అంశం.

డి.జె.మోహన రావు
8247045230

# డిజిటల్ మోసాలకు.. అప్రమత్తతే ఆయుధం




'సైబర్ నేరాలు రూపాంతరం చెంది 'డిజిటల్ అరెస్ట్' పేరుతో దోపిడీ పతాక స్థాయికి చేరింది. ఎంతగా అంటే? ఉన్నత విద్యావంతులు, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు, చివరికి బ్యాంకు అధికారులు సైతం వారి వలలో పడి డబ్బులు కోల్పోయి విలవిలాడుతున్నారు.

నేరగాళ్లు వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించి, మానసికంగా బెదిరిస్తూ బురిడీ కొడుతున్నారు. ఈ విధంగా డిజిటల్ అరెస్టుల ఘటనలు నానాటికి పెరుగుతున్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో సైబర్ నేరాలపై ప్రజాచైతన్యం, అవగాహన పెరగాలి. పోలీసులు ఎప్పుడూ వీడియో కాల్స్‌తో అరెస్టులు చేయరని, డబ్బులు బదిలీ చేయమని బెదిరించరని ప్రతి ఒక్కరూ గ్రహించాలి. ఎప్పటి కప్పుడు అప్రమత్తంగా ఉండటం అత్యవసరం. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సైబర్ నేరాలపై ఉక్కు పాదం మోపాలి.అప్రమత్తతే ప్రజా ఆయుధం. మన దేశంలో జరుగుతున్న సైబర్ నేరాలు డిజిటల్ అరెస్టుల మోసాల తీవ్రత పరిశీలిద్దాం..ఆధునిక టెక్నాలజీ మూలంగా డిజిటల్ యుగం మన జీవితంలో సౌలభ్యాన్ని తెచ్చింది. కానీ అదే సాంకేతికత ఇప్పుడు మోసాలకు, ఆర్థిక నష్టాలకు కారణమవుతోంది. వాస్తవంగా ఆధునిక టెక్నాలజీ సామాన్యుడి ప్రగతికి, జీవన విధానం మెరుగుదలకు తోడ్పడితేనే దానికి సార్థకత. ప్రస్తుతం దీనికి విరుద్ధంగా టెక్నాలజీని వాడుకొంటూ నేరాలకు పాల్పడుతున్నారు. అలా సైబర్ నేరాల కొత్త రూపమే డిజిటల్ అరెస్టులు.మనసులనూ, మనీని కూడా కబళిస్తోంది. ఇలాంటి మోసాలనుంచి మనం రక్షించుకునే ఆయుధం ఒక్కటే...అప్రమత్తత.

**మోసాల రూపం, విస్తృతి, ప్రభావం.**

ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు భయానక స్థాయికి చేరాయి. ముఖ్యంగా డిజిటల్ అరెస్ట్ పేరిట జరుగుతున్న మోసాలు వేగంగా విస్తరిస్తున్నాయి. ఖాకీ బట్టలు వేసుకొని వీడియో కాల్స్ చేస్తూ, మీరు ఉగ్రవాదులతో సంబంధం కలిగి ఉన్నారు, మాదకద్రవ్యాల కేసులో పేరు వచ్చింది, మనీలాండరింగ్లో పాలుపంచుకున్నారు అంటూ భయపెట్టే ముఠాలు పౌరుల బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నాయి. జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టులకు డిజిటల్ అరెస్టులపై 2022లో డిజిటల్ అరెస్ట్ మోసాలపై 39,925 ఫిర్యాదులు నమోదైతే, 2024లో అలాంటివి 1.23 లక్షలకు పెరిగాయి. బాధితులు కోల్పోయిన సొమ్ము విలువ రెండు సంవత్సరాల్లో 21 రెట్లు పెరిగింది. ఈ ఏడాది మొదటి రెండు నెలల్లోనే 17,718 కేసులు నమోదవడం చూస్తుంటే, నేరగాళ్ల ఎంతగా చెలరేగి పోతున్నారో అర్థం చేసుకోవచ్చు. ఉన్నత విద్యావంతులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, బ్యాంక్ అధికారులు కూడా ఈ వలలో చిక్కుతున్నారు. నకిలీ గుర్తింపులు, ఫోర్జరీ పత్రాలు, వాయిస్ క్లోనింగ్, సాంకేతిక నైపుణ్యంతో ఈ ముఠాలు నేరాలను కొత్త రూపంలో తీవ్ర స్థాయికి తీసుకెళ్తున్నాయి. బాధితులు ఆర్థిక నష్టంతో పాటు మానసికంగా కూడా కృంగిపోతున్నారు.

ప్రత్యేకించి పెన్షనర్లు పెద్దగా ప్రభావితమవుతున్నారు. లైఫ్ సర్టిఫికెట్, పింఛన్ వెరిఫికేషన్ పేరిట వివరాలు సేకరించి మోసాలు చేస్తున్నారు. టెక్నాలజీ అవగాహన తక్కువగా ఉండటంతో వారు సులభంగా వలలో పడుతున్నారు.

**అవగాహనే ఆయుధం, కట్టడే కర్తవ్యం**

ఈ డిజిటల్ మోసాలపై ప్రధాన ఆయుధం అప్రమత్తత. ప్రభుత్వం, పోలీసులు, ప్రజలు ముగ్గురి సమన్వయం ద్వారానే మూలాలు గుర్తించి దీన్ని సమూలంగా అరికట్టవచ్చు.

టివి, రేడియో, సోషల్ మీడియా ద్వారా డిజిటల్ అరెస్టులు చట్టంలో లేవు అనే సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలి. అపరిచిత నంబర్ల నుంచి వచ్చే కాల్స్, వీడియో కాల్స్, OTPలు, ఆధార్ వివరాలు పంచకూడదు. బ్యాంకులు మరియు ప్రభుత్వాల సమన్వయంతో బ్యాంకులు తమ వినియోగదారులకు కాలానుగుణంగా సైబర్ సేఫ్టీ అలర్ట్స్ పంపాలి. ప్రభుత్వ సంస్థలు ప్రజా స్థాయిలో సైబర్ అవగాహన శిబిరాలు నిర్వహించాలి.

**చట్టపరమైన చర్యలు..**

సైబర్ మోసగాళ్లపై కఠినమైన శిక్షలు విధిస్తూ, వారి ఆర్థిక లావాదేవీలను తక్షణం ఫ్రీజ్ చేసే చట్టపరమైన విధానాలు రూపొందించాలి. సిబిఐ, సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీలు కలిసి విభిన్న రాష్ట్రాల్లో జరిగిన కేసులను సమగ్రంగా దర్యాప్తు చేయాలి. పౌరులు మోసానికి గురైన వెంటనే డయల్ 1930 లేదా 100 కు సమాచారం ఇవ్వాలి. గుర్తు తెలియని లింకులు క్లిక్ చేయకూడదు. వాట్సాప్ లేదా మెయిల్ ద్వారా వచ్చిన APK ఫైళ్లను తెరవకూడదు. సాంకేతిక సదుపాయా లు ఎంత పెరిగినా, మన జాగ్రత్తే చివరి రక్షాకవచం. డిజిటల్ అప్రమత్తత అనే ఈ సంస్కృతి ప్రతి ఇంటి నుంచి మొదలవ్వాలి.

సైబర్ నేరాలు యుద్ధం మాదిరిగా మారుతున్నాయి. కానీ ఆయుధం అవసరం లేదు. అవగాహన, అప్రమత్తత, ధైర్యం చాలు.

ప్రజలు తమ వ్యక్తిగత సమాచారం కాపాడుకుంటే, ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరిస్తే, ఈ మోసాలు ముగుస్తాయి.

డిజిటల్ మోసాలపై అప్రమత్తతే అసలైన రక్షణ.

మేకిరి దామోదర్
9573666650

# మానవ ఆరోగ్య రక్షణ — టీకాల పాత్ర

ఇమ్యూనైజేషన్ అనేది శరీరంలోని రోగనిరోధక శక్తిని పెంపొందించే శాస్త్రీయ విధానం. టీకాలు మానవ ఆరోగ్యానికి రక్షణ కల్పించే అత్యంత కీలకమైన వైద్య ఆవిష్కరణలు. ఇవి కోట్లాది ప్రాణాలను రక్షించడమే కాకుండా, ప్రపంచ వ్యాధి భారాన్ని గణనీయంగా తగ్గించాయి.

1796లో ఎడ్వర్డ్ జెన్నర్ స్మాల్ పాక్స్ టీకా ఆవిష్కరణతో వైద్య చరిత్ర కొత్త దశను ప్రారంభించింది. ఆ తర్వాత లూయీ పాశ్చర్ రేబీస్ టీకా, జోనస్ సాల్క్ పోలియో టీకా రూపొందించడం ద్వారా టీకా శాస్త్రం వేగంగా అభివృద్ధి చెందింది.

1974లో ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) ప్రారంభించిన ప్రోగ్రాం ఆన్ ఇమ్యూనైజేషన్ (EPI) ప్రపంచంలోని ప్రతి శిశువుకూ ఉచిత టీకా అందేలా మార్గం సుగమం చేసింది. ఈ శాస్త్రీయ విప్లవంవల్ల స్మాల్ పాక్స్ (మశూచి) ప్రపంచం నుండి పూర్తిగా నిర్మూలించబడింది, పోలియో దాదాపు అంతరించిపోయింది. ఇవి మానవజాతి సాధించిన అద్భుత విజయాలు.

2020లో ప్రపంచాన్ని కుదిపేసిన కోవిడ్19 మహమ్మారి టీకాల పరిశోధనలో అత్యంత వేగవంతమైన మార్పును తెచ్చింది. కేవలం ఒక సంవత్సరంలోనే ఫైజర్, మోడరన్, ఆస్ట్రేజన్కా, భారత్ బయోటెక్ వంటి సంస్థలు సురక్షితమైన టీకాలను అభివృద్ధి చేశాయి. టీకాలు ప్రధానంగా టాక్సాయిడ్, వైరల్ వెక్టార్, కాంజు గేటెడ్, ప్రోటీన్ ఆధారితమైనవి. ముఖ్యంగా ఎమ్మార్ఎన్ ఏ (MRNA) టెక్నాలజీ ఆధారంగా తయారైన టీకాలు వైద్య శాస్త్రంలో కొత్త యుగానికి నాంది పలికాయి.

WHO, GAVI, COVAX వంటి అంతర్జాతీయ సంస్థలు పేద దేశాలకు టీకాలు అందించడంలో కీలక పాత్ర పోషించాయి. కోట్లాదిమంది ప్రాణాలు రక్షించబడ్డాయి. అయితే టీకా పంపిణీలో ధనిక దేశాలు ముందంజలో ఉండగా పేద దేశాలు వెనుకబడ్డాయి. ఈ అసమానత ప్రపంచ ఆరోగ్య సమానత్వం అవసరాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది.

టీకా తయారీ ఒక క్రమబద్ధమైన శాస్త్రీయ ప్రక్రియ. మొదట వైరస్ లేదా బ్యాక్టీరియా భాగాన్ని (యాంటిజెన్) గుర్తించి, ప్రయోగశాలలో నమూనాలు తయారు చేస్తారు. ప్రీ క్లినికల్ దశలో జంతువులపై పరీక్షలు నిర్వహించి, ఆ తర్వాత మానవులపై మూడు క్లినికల్ దశలు (ఫేజ్ I, II, III) నిర్వహిస్తారు. ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నప్పుడు ప్రభుత్వ అనుమతి తో టీకా విడుదల అవుతుంది.

టీకా శరీరంలోకి చేరినప్పుడు అది వ్యాధికారకాన్ని అనుకరించేలా పనిచేస్తుంది. ఇమ్యూన్ సిస్టమ్ దానిని విదేశీ పదార్థంగా గుర్తించి ప్రతిరక్ష కణాలు (ఏంటిబాడీస్) తయారు చేస్తుంది.

బి కణాలు, టి కణాలు, మెమరీ సెల్స్ కలిసి భవిష్యత్తులో అదే వైరస్ దాడి చేసినప్పుడు శరీరాన్ని వేగంగా రక్షిస్తాయి.

ఫలితంగా వ్యాధి రాకముందే నిరోధక శక్తి ఏర్పడుతుంది. కొన్ని టీకాలు దీర్ఘకాల రక్షణ ఇస్తే, కొన్ని నిర్దిష్ట కాలానికి బూస్టర్ మోతాదులు అవసరం అవుతాయి

**సవాళ్లు**

ప్రస్తుతం డెంగ్యూ, నిపా, జికా, మంకీపాక్స్ వంటి వైరల్ వ్యాధులు మళ్లీ ముప్పుగా మారుతున్నాయి. వాతావరణ మార్పులు, కాలుష్యం, మరియు గ్లోబల్ మైగ్రేషన్ కారణంగా కొత్త వైరస్లు సులభంగా వ్యాపిస్తున్నాయి. ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా సుమారు 7 మిలియన్‌ల మంది గాలి కాలుష్యం వల్ల మరణిస్తున్నారు, ఇది రోగనిరోధక శక్తిని బలహీనపరుస్తోంది.

ఈ నేపథ్యంలో టీకాలు, పర్యావరణ సంరక్షణ రెండూ మానవ ఆరోగ్యానికి అత్యంత కీలకం. ప్రభుత్వాలు ఆరోగ్య రంగానికి తగిన నిధులు కేటాయించి, పేద ప్రజలకు ఉచిత టీకాలు అందించాలి.

శాస్త్రవేత్తలు AI ఆధారిత వైరస్ గుర్తింపు, నూతన టీకా సాంకేతికతలు అభివృద్ధి చేయాలి.

ప్రతి పౌరుడు సమయానికి టీకాలు తీసుకోవడం, ఆరోగ్య నియమాలు పాటించడం, ప్రజా అవగాహన కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా సమాజ ఆరోగ్య రక్షణలో భాగస్వామి కావాలి.

విజ్ఞాన శాస్త్రం మనకు ఆయుధం వంటిది. టీకాలు కేవలం వైద్య ఆవిష్కరణలు కావు; అవి మానవజాతి రక్షణకు శాస్త్రం అందించిన శాశ్వత కవచం.

శాస్త్రవేత్తల కృషి, ప్రభుత్వ విధానాలు, మరియు ప్రజల అవగాహన, సహకారం కలిసినప్పుడే ప్రపంచం ఆరోగ్యకరమైన భవిష్యత్తు వైపు అడుగులు వేయగలదు.

గిలకత్తుల వెంకటరమణ
9866878769

## వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/ఆత్మకూరు:** ఆత్మకూరు మండల పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం రేచింతల వారి ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలు కత్తిపల్లి తూంపల్లి వీరరాఘవపురం రేచింతల గ్రామాలలో ప్రారంభించినట్టు పిఏసిఎస్ అధ్యక్షులు లక్ష్మీ కాంత్ రెడ్డి మండల తాసిల్దార్ షేక్ చాంద్ పాషా తెలిపారు. రైతులు ఈ అవకాశాలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార సంఘాలు, పిఏసిఎస్ డైరెక్టర్లు , సిబ్బంది మరియు ప్రజా ప్రతినిధులు గ్రామ రైతులు పిఏసిఎస్ సీఈఓ కె.మాసన్న, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో కోటి దీపోత్సవం

**ప్రజాపక్షం/కొత్తకోట:** కొత్తకోట పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో కార్తీక సోమవారం పురస్కరించుకుని మూడవ సోమవారం రాత్రి పరమశివునికి రకరకాల పత్రితో మరియు పళ్ల రసాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహా మండపం నందు రంగురంగుల ముగ్గులతో శివలింగం ఆకారాన్ని ఏర్పాటు చేసి అట్టి శివయ్య చుట్టు దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ మహిళలకు ఆలయ కమిటీ తరపున దీపాలంకరణ పోటీలు నిర్వహించారు. దీపాలంకరణ పోటీలలో న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన డాక్టర్ పోగాకు స్వప్న గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కోటి దీపోత్సవం నిర్వహించారు. కొత్తకోట పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇట్టి కార్యక్రమాలను పట్టణ అధ్యక్షులు భీమ చంద్రకాంత్, గౌరవాధ్యక్షులు భీమ ప్రభాకర్, కమిటీ సభ్యులు శ్రీనివాసులు, శంకర్, విజయ్, భీమ కిషోర్, పట్టణ మహిళా సంఘం అధ్యక్షురాలు జయలక్ష్మి , స్థానిక మహిళలు రజిని, అనిత, స్వర్ణలత, భారతి, విజయలక్ష్మి , తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించి అనంతరం భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

## గంజాయితో పట్టుబడిన యువకుడు

**ప్రజాపక్షం/అచ్చంపేట :** నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని మన్ననూరు గ్రామానికి చెందిన రమావత్ కిషన్ అనే వ్యక్తివద్ద గంజాయి పట్టుబడినట్లు అచ్చంపేట ఎక్సైజ్ ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ జిల్లా డిసిఐ. గాయత్రీ ఆదేశాలసారం తాము దాడులు నిర్వహించగా కిషన్ అనే వ్యక్తి వద్ద వంద గ్రాముల గంజాయి లభించిందని దానివిలువ సుమారు రూ.5వేలు ఉంటుందని తెలిపారు. కేసు నమోదుచేసి నిందితుడిని జైలుకు పంపిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది నవీన్‌కుమార్, ఎండి ఆసిఫ్ పాల్గొన్నారు.


## టైర్ పేలి ఆటో బోల్తా



ఇద్దరు విద్యార్థుల పరిస్థితి విషమం.... మరో ఇద్దరికి గాయాలు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ఉపాధ్యాయులు చేయాల్సిన పనిని విద్యార్థులు చేశారు. అంతలోనే ప్రమాదం చోటు చేసుకుంది. ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలు కావడంతో వారి పరిస్థితి విషమంగా ఉంది. మరో ఇద్దరు విద్యార్థులు స్వల్ప గాయాలతో బాధపడుతున్నారు. ఈఘటన పెద్ద కొత్తపల్లి మండలపరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్ పాఠశాలలో చదువుతున్న శివ, సాను, నాని, అశోక్, కార్తీక్ ఐదుగురు విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఆదేశాలమేరకు ఆటోతీసుకొని పెద్దకొత్తపల్లివెళ్లి పాఠ్యపుస్తకాలు తీసుకొని తిరిగి సాతాపూర్ వెళుతుండగా మార్గమధ్యలో ఆటోటైర్ పేలి బోల్తాపడింది. ఐదుగురు విద్యార్థుల్లో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రగాయాలైన విద్యార్థుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. శివ అనే విద్యార్థి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌కు తరలించారు. స్థానికులు గమనించి 108కి సమాచారం ఇవ్వడంతో నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రి తరలించి చికిత్స అందిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పలు విద్యార్థిసంఘాల నాయకులు ఆస్పత్రికి చేరుకొని పిల్లలతో పాఠశాల పని చేయించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## అక్రమ ఇసుక రవాణా టిప్పర్ పట్టివేత



**ప్రజాపక్షం/దామరగిద్ద:** అక్రమ ఇసుక రవాణా కేసు నమోదు కోయిల్ కొండ మండలం ఆచార్య పూర్ గ్రామానికి చెందిన గోవిందు తండ్రి పేరు రాజన్న తన యొక్క టిప్పర్ నెంబర్ ఎపి26టిఎ 5277 మరియు అదే గ్రామానికి చెందిన శంకర్ తండ్రి పేరు భీమన్న తన యొక్క టిప్పర్ నెంబర్ ఎపి 26 టిఎల్ 1197 గల వాటిలో కోయిల్‌కొండ నుండి ఇసుకను నింపుకుని మధ్యరాత్రి సుమారు రెండు గంటలకు దామరగిద్ద కు వస్తుండగా దామరగిద్ద తండాలో అట్టి అక్రమ ఇసుక తరలిస్తున్న టిప్పర్లను పట్టుకుని పిఎస్‌కు తరలించి పోలీసులు కేసు నమోదు చేశారు.

## పట్టుబడిన ఏడుగురు పేకాటరాయుళ్లు


**ప్రజాపక్షం/మాగనూరు:** పేకాటాడుతున్న ఏడుగురిని పట్టుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. మండల పరిధిలోని నేరడగం గ్రామ శివారులో ఏడుగురు వ్యక్తులు పేకాట అడుతుండగా పోలీసు సిబ్బంది వారిని పట్టుకుని వారి దగ్గరి నుంచి రూ.నాలుగు వేల రెండు వందల అరవై రూపాయలు, ఆరు సెల్‌ఫోన్లు, స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ బాబు తెలిపారు.

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/నర్వ:** మరికల్ మండల పరిధిలోని కన్మనూర్‌లో కళ్యాణలక్ష్మి , షాదిముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. యువజన సర్వీసుల శాఖ మంత్రి డా.వాకిటి శ్రీహరి ఆదేశానుసారం మంగళవారం చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. కన్మనూరు రైతువేదిక నందు లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి మరియు షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మరికల్ మండల తహసీల్దార్ రామకోటి నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్ పంపిణీ చేయడం జరిగింది. మరికల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, సూర్య మోహన్ రెడ్డి, మరికల్ మండలంలోని నాలుగు గ్రామాలకు 37 చెక్కులు రూ.37,04,292 విలువ గల చెక్కులు పంపిణీ చేసినట్లు తహసీల్దారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నర్వ, మరికల్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మండలంలోని నాలుగు గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, చెక్కుల లబ్దిదారులు వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా ఆజాద్ జయంతి



**ప్రజాపక్షం/పెబ్బేరు:** పెబ్బేరు పట్టణ కేంద్రంలోని ఉర్దూ మీడియం స్కూల్ నందు స్వాతంత్ర సమరయోధులు భారత రత్న తొలి విద్యాశాఖ మంత్రి డా.మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ 137వ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పెబ్బేరు మండల యంఐయం పార్టీ అధ్యక్షుడు ఎం.డి ఆఫ్రోజ్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో యంఐయం జనరల్ సెక్రెటరీ అమెర్, జాయింట్ సెక్రెటరీ ముస్తాన్, హాజీ, ఉర్దూ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయులు, ఫిరోజ్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం

విద్యార్థులతో కలిసి భోజనం చేసిన పేట కలెక్టర్

**ప్రజాపక్షం/మక్తల్/మాగనూరు/కృష్ణ :** విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. మంగళవారం ఆమె మక్తల్ పట్టణంలోని మహాత్మా జ్యోతి బాపూలె పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదే సమయంలో పాఠశాలలో నిర్వహిస్తున్న మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ జయంతి జాతీయ విద్యా దినోత్సవం వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఆజాద్ జయంతి గురించి స్పీచ్‌లు ఇచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి సిలబస్ ఇప్పటివరకు ఎంత వరకు పూర్తి అయిందని విద్యార్థులను ద్వారా తెలుసుకున్నారు. విద్యార్థుల ఫ్యూచర్ ప్లానింగ్ గురించి ఒక్కొక్కరిని అడిగారు. ఏమేమి ఆటలు ఆడతారని ప్రశ్నించారు. స్లిప్ టెస్టులు పెడుతున్నారా? లేదా? నాన్‌వెజ్ తింటున్నారా లేదా అని, మెస్ కమిటీ ఉందా? ఆ కమిటీ సభ్యులు ముందుగా భోజనం రుచి చూస్తున్నారా అని విద్యార్థులతో ఆరా తీశారు. వసతి గృహంలో ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని విద్యార్థులకు సూచించారు. మధ్యాహ్న భోజన నాణ్యత, రుచిని తెలుసుకునేందుకు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మక్తల్ తాహసిల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీవో, రెవెన్యూ అధికారులు, వసతి గృహ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్**

మండలంలోని పలు వరి కోనుగోలు కేంద్రాలను మంగళవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. ముందుగా అడివి సత్యారం గ్రామ పంచాయితీ పరిధిలో వరి కొనుగోలు కేంద్రానికి ఇప్పటి వరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యం విక్రయానికి వచ్చిందని అడిగి తెలుసుకున్నారు. సెంటర్‌లో గన్ని బ్యాగ్లు ఎన్ని అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ ప్రశ్నించగా 15 వేల బ్యాగ్స్ అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం అమ్మపల్లి, వద్వాట్, పంచాయితీ పరిధిలోని పిఎసిఎస్, ఐకెపి, వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఈవారం రోజుల్లో హార్వెస్టింగ్ ఎంత ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు 1776 ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించడం జరిగిందని సిబ్బంది చెప్పారు.



సెంటర్లలో ప్యాడీ మాయిచ్చర్ క్లీనర్ లేకపోవడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. కాగా అడివి సత్యారం గ్రామానికి అదనంగా మరో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అక్కడి రైతులు కలెక్టర్‌ను కోరగా స్పందించిన కలెక్టర్ మరో కేంద్రాన్ని ఏర్పాటు చేయించాలని అదనపు కలెక్టర్ శ్రీనుకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాగనూరు ఎమ్మార్వో సురేష్ కుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు, సంబంధిత అధికారులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణ మండలం గూడెబల్లూరు గ్రామ పంచాయితీలో గల వరి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. కేంద్రానికి ఇప్పటి వరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యం విక్రయానికి వచ్చిందని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ వారం రోజుల్లో హార్వెస్టింగ్ ఎంత ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. ఎన్ని బస్తాలు ఉన్నాయని అడగగా వారానికి 5000 బ్యాగ్‌ల బ్యాగులు వస్తాయని, ఒక లారీలో 800ల బస్తాలు వస్తాయని అక్కడి సిబ్బంది తెలిపారు. రెండేసి కేంద్రాలు ఉన్న చోట కూలీలను పురమాయించాలని సూచించారు. గూడెబల్లూరు కేంద్రం నుంచి ఇప్పటి వరకు 1776 ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించడం జరిగిందని సిబ్బంది చెప్పారు. ముఖ్యంగా కేంద్రాలలో రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. అలాగే సంచులలో ధాన్యం నింపిన తర్వాత ఎర్రదారంతో సంచులను కుట్టించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీను, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కిషోర్ కుమార్, సంబంధిత ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్ ఎదుట బిఆర్ఎస్ నాయకుడి ఆత్మహత్యాయత్నం

ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయని పోలీసులు

ఎస్ఐ తీరును నిరసిస్తూ పోలీస్ స్టేషన్ ఎదుట కుటుంబ సభ్యుల ధర్నా, మనస్తాపంతో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం



**ప్రజాపక్షం/పానుగల్:** పానుగల్ మండల పరిధిలోని తెల్లరాళ్లపల్లి తండాకు చెందిన బిఆర్ఎస్ నాయకుడు బాబు నాయక్ కుటుంబసభ్యులపై అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలు నాయక్, రాజు నాయక్, భాస్కర్ నాయక్ కుటుంబ సభ్యులతో పాటు మరికొంత మంది కలిసి 5 రోజుల క్రితం ఇంట్లోకి చొరబడి దాడి చేశారని ఇట్టి సంఘటనపై పానుగల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ ఎస్సై పట్టించుకోలేదని బాధితులు రాజేష్ మున్నా, రామ కృష్ణ, చిరులు తెలిపారు. ఇట్టి విషయంలో మంగళవారం పానుగల్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పోలీసులను అడగగా ఎస్ఐ దురుసుగా మాట్లాడి ఫిర్యాదు దాడులను స్టేషన్‌లో సాయంత్రం వరకు కూర్చోబెట్టడంలో విషయం తెలుసుకున్న బాబు నాయక్ పోలీస్ స్టేషన్ కు చేరుకుని ఎస్ఐ తో మాట్లాడగా ఎస్ఐ దుర్భాషలాడి రౌడీ షీట్ ఓపెన్ చేస్తానని బెదిరించడంతో మనస్థాపం చెందిన స్టేషన్ ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా చేపట్టారు. ఎస్ఐ తీవ్రంగా దూషించడంతో పాటు కేసు రాజీ చేసుకోవాలని ఎస్ఐ ఒత్తిడి చేసి కేసు నమోదు కాకుండా జాప్యం చేశారని బాధితులు తెలిపారు. దీంతో బాబు నాయక్ తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు సేవించి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. వెంటనే బాధిత కుటుంబ సభ్యులు వనపర్తి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. చికిత్స పొందుతున్న బాబు నాయక్ ను జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయక్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెబ్బేటి వీర సాగర్‌లు పరామర్శించారు. ఎస్ఐ అధికార పార్టీ నాయకులకు తొత్తుగా మారి బిఆర్ఎస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను భయాందోళనకు గురి చేస్తున్నారని అన్నారు. ఎస్ఐని వెంటనే సస్పెండ్ చేయ్యకపోతే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఇట్టి సంఘటనపై మానవ హక్కుల కమిషన్‌కు ఎస్ఐ పై ఫిర్యాదు చేస్తామన్నారు.




## అక్షయ పాత్ర వద్దు.. వంటశాలలే ముద్దు

ఎఐటియుసి నారాయణపేట రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.వెంకటేశ్

**ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా:** ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న ప్రైవేటు సంస్థకు కట్టబెట్టొద్దని అక్షయపాత్రను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయుసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.వెంకటేశ్, జిల్లా సహయ కార్యదర్శి ఎస్.సంతోష్ అన్నారు. మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికుల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకాన్ని సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం పేరుతోనే ప్రైవేట్ సంస్థ అయిన అక్షయపాత్రకు అప్పగించే విధానాన్ని విరమించుకోవాలన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అదే విధంగా ఈనెల 24న రాష్ట్ర కమిషనర్ ఆఫీసర్ ముందు మధ్యాహ్న భోజన కార్మికులతో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం ఆయా మండల కేంద్రాల్లో ఉన్న విద్యాశాఖ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు జిల్లా అధ్యక్షురాలు, రేఖమ్మ, ఉపాధ్యక్షులు ఎర్రమ్మ, కార్యదర్శి లక్ష్మి, కోశాధికారి సువర్ణ, సాయమ్మ, దేవమ్మ, కురువ ఎర్రమ్మ, కురువ అంజమ్మ, లక్ష్మి , కే.లక్ష్మి , అనురాధ, లక్ష్మ మ్మ, అనురాధ, అనంతమ్మ, జి.లక్ష్మి తదితరులు ఉన్నారు.

## ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** భారత స్వాతంత్ర సమరయోధుడు బహు భాషా కోవిదుడు, దేశ విద్యారంగ అభివృద్ధికి పునాది వేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ సమాజ, దేశ అభివృద్ధికి అంకిత భావంతో సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పిలుపునిచ్చారు. భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రి, మైనార్టీల అభివృద్ధికి ఎంతో కృషి చేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశ విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని, ఆయన సమయంలోనే యు.జి.సి ఐఐటి వంటి అత్యున్నత విద్యా సంస్థలను స్థాపించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఇంచార్జి జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి ఇందిర, డిఆర్‌డిఓ నర్సింహులు, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె.జనార్ధన్, మైనార్టీ నాయకులు ఎం.ఏ.హాది యూసుఫ్ బిన్ నాసర్, అన్వర్ పాషా, మహమ్మద్, హషం, జాకీర్ సాబ్, సయ్యద్ సాదత్, ఉల్లా హుస్సేన్, తాఖి హుస్సేన్ , తాఖి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో డప్పు శిక్షణ



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** గోవర్ధనగిరి గ్రామంలో ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో డప్పు శిక్షణ శిబిరాన్ని జిల్లా సహయ కార్యదర్శి యం.డి.మహబూబ్ సాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజానాట్యమండలి ఎల్లప్పుడూ ప్రజల మధ్యే ఉంటూ, వారి కష్టసుఖాల్లో భాగస్వామ్యం అవుతూ, కళ ద్వారా ప్రజల చైతన్యానికి వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. కళ కళ కోసం కాదు, కళ ప్రజల కోసం అనే తత్వంతో ప్రజానాట్యమండలి పని చేస్తోందని మహబూబ్‌సాని తెలిపారు. సమసమాజంలో శ్రమైఖ్య జీవన సౌందర్యం వికసించాలని, అటువంటి మానవ సమాజ నిర్మాణానికి అవసరమైన సాంస్కృతిక కార్యకలాపాలను సంస్థ చేపడుతోందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో కళలపై ఆసక్తి ఉన్న యువతను గుర్తించి, వారికి డప్పు, పాటల శిక్షణ అందజేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులు కృష్ణయ్య, యం.డి.అయాన్, కార్తీక్, కిరణ్, సురేష్, ఈశ్వర్, యం.డి.ఖాసీం, యం.డి.షబ్బీర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత కంటి శిబిరం

**ప్రజాపక్షం/జడ్చర్ల:** జడ్చర్ల పట్టణంలోని హరిజన వాడ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హరిజన వాడ జడ్పీహెచ్ఎస్, ఎర్రసత్యం స్కూల్, హరిజనవాడ ప్రాథమిక పాఠశాల చెందిన 100కు పైగా విద్యార్థులకు ఉచిత కంటి శిబిరమును నిర్వహించారు. మంగళవారం నాడు మున్సిపాలిటీ చైర్మన్ కోనేటి పుష్పలత, ఉపచైర్మన్ సారిక, లయన్స్ క్లబ్ జడ్చర్ల అధ్యక్షులు ధ్రువ బాద్మి, స్థానిక కౌన్సిలర్ రమేష్, పాఠశాల హెచ్‌యం గోవింద్ నాయక్ లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంని ఉద్దేశించిముఖ్య అతిథులు మాట్లాడుతూ పిల్లల ఈ కాలంలో సెల్‌ఫోన్ మరియు టివిలు ఎక్కువగా చూడటం వలన కంటికి జరిగే నష్టాలు మరియు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు గొప్పవి అని మరియు వారికి కావలసిన పూర్తి సహకారం అందిస్తామని వ్యక్తపరిచారు. అలాగే



కంటి అద్దాలు కావలసిన వారికి ఉచితంగా ఇస్తామని రాబోవు కాలంలో మరిన్ని సేవ కార్యక్రమాలను చేపడుతామని లయన్స్ క్లబ్ అధ్యక్షులు ధ్రువ బాదిమి, సెక్రెటరీ కాల్వరామ్‌రెడ్డి, కోశాధికారి కొండూరు వెంకటేశ్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పెద్దలు, పాఠశాల సిబ్బంది , స్థానికులు పాల్గొన్నారు.

# ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోళ్లు



కలెక్టర్ బదావత్ సంతోష్

**ప్రజాపక్షం/కల్వకుర్తి/నాగర్‌కర్నూల్:** రైతులకు ఇబ్బంది లేకుండా పత్తి కొనుగోళ్లు జరపాలని, పత్తి కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులకు సూచించారు. మంగళవారం మండలపరిధిలోని తర్నికల్ గ్రామశివారులో ఉన్న బాలాజి జిన్నింగ్ మిల్లును సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. పత్తి కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జిన్నింగ్‌మిల్లుల యజమానులు కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సూచించారు. ఆయనవెంట తహసీల్దార్ ఇబ్రహీం, జిన్నింగ్‌మిల్లు అధికారులు ఉన్నారు.

**మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని తనిఖీచేసిన జిల్లా కలెక్టర్**

కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా ఆయన రైతులతో మాట్లాడి వారికి అందిస్తున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. మొక్కజొన్న సేకరణ కేంద్రంలో రైతుల నుండి సేకరించిన మొక్కజొన్న నిల్వల నాణ్యతను స్వయంగా పరిశీలించి, కొనుగోలు ప్రక్రియ సక్రమంగా జరుగుతున్నదా అనే అంశాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం ప్రమాణాలు సరిగ్గా పాటించబడుతున్నాయా లేదా అనే విషయాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట మార్క్‌ఫెడ్ అధికారులు, తహసీల్దార్ ఇబ్రహీం ఉన్నారు.

**క్రీడలద్వారా శారీరక మానసిక ఆరోగ్యం**

క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు స్నేహపూర్వకంగా క్రీడల్లో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, ఉమ్మడి నల్గొండ జిల్లాల తెలంగాణ గిరిజన ఆశ్రమ, గిరిజన సంక్షేమ వసతిగృహాలు, గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో 6వ గిరిజన జోనల్‌స్థాయి క్రీడలను గిరిజన సంక్షేమగురుకుల పాఠశాల కల్వకుర్తి వేదికగా మంగళవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి పోటిలను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి ఫిరంగి, తహసీల్దార్ ఇబ్రహీం, పాఠశాల ప్రిన్సిపాల్, వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, పిఇటిలు, క్రీడాకారులు, పేరేంట్ కమిటిసభ్యులు పాల్గొన్నారు.

**పిఎం ధన్ ధాన్య కృషియోజన అమలుకు వార్షిక ప్రణాళిక సిద్ధం**

నాగర్‌కర్నూల్ జిల్లాలో రానున్న ఆరు సంవత్సరాలపాటు పంట ఉత్పాదకత పెంచడం, పంటల మార్పిడి, సుస్థిర వ్యవసాయ విధానాలను ప్రోత్సహించే విధంగా ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషియోజన అమలుకు పక్కాగా సమగ్ర కార్యాచరణ వార్షిక ప్రణాళికను పకడ్బందీగా రూపొందించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ వ్యవసాయ అనుబంధశాఖల అధికారులను ఆదేశించారు. పిఎంధన్‌ధాన్య కృషి యోజన అమలుకు వార్షిక ప్రణాళికపై మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో అదనపు కలెక్టర్ దేవసహాయంతోకలిసి పిఎం ధన్ ధాన్య కృషియోజన కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.



## సామినేని హంతకులను అరెస్టు చేయాలి

డిజిపిని కలిసి డిమాండ్ చేసిన సిపిఐ(ఎం) నేతలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిపిఐ(ఎం) నేత సామినేని రామారావును హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఆ పార్టీ నేతలు డిజిపి బి.శివధర్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. డిజిపిని కలిసి వినతిపత్రం ఇచ్చిన వారిలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎంఎల్‌ఎ జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శనరావు, ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదినేని రమేష్, మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావులు ఉన్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. గత నెల 31న పాతర్లపాడు గ్రామానికి చెందిన సామినేని రామారావును ఉదయం 5.30 గంటలకు అదే గ్రామానికి చెందిన వ్యక్తులు బొర్రా ప్రసాద్, కంచుమర్తి, రామకృష్ణ, మద్దినేని నాగేశ్వరరావు, కంద్రా పిచ్చయ్య, కొత్తపల్లి వెంకటేశ్వర్లుతో పాటు, మరికొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి అతి దారుణంగా నరికి చంపారని తెలిపారు. రామారావు బ్రతికి ఉంటే సిపిఎం పార్టీని ఓడించడం సాధ్యం కాదని, రాజకీయ కక్షతో ఆ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కుట్రపన్ని అత్యంత కిరాతకంగా హత్య చేశారన్నారు. రామారావు హత్య జరిగి ఇప్పటికి 12 రోజులు పూర్తయింది. రామారావు భార్య స్వరాజ్యం హత్య చేసిన వారిని నేను స్వయంగా చూశాను, అని వారి పేర్లు చెప్పి పిటిషన్ ఇచ్చినా ఇంతవరకు వారిని అరెస్టు చేయలేదని అన్నారు. హంతకులను, కుట్రకు పాల్పడిన వారిని అరెస్టు చేసి, చట్టరీత్యా తగిన చర్యలు తీసుకోవల్సిందిగా వారు డిమాండ్ చేశారు.

## 13న బిసిల ధర్మపోరాట దీక్ష



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనే లక్ష్యంగా ఈనెల 13న జరిగే బీసీల ధర్మ పోరాట దీక్షను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పిలుపునిచ్చారు.మంగళవారం పట్టణం లోని అంబేద్కర్ భవన్లో జరిగిన బీసీ జేఏసీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తూ ఒకరి మీద ఒకరు నిందలు వేసుకుంటూ బీసీల రిజర్వేషన్లను అడ్డుకుంటున్నాయన్నారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీ బిల్లు పెట్టి బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. అనంతరం జిల్లా బీసీ జేఏసీ నూతన చైర్మన్ గా చక్రహరి రామరాజును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ కుల్కచర్ల శ్రీనివాస్,వరికుప్పల మధు,పాలకూరి కిరణ్,బండిగారి భరత్ పాల్గొన్నారు.

## సిఎం సహాయ నిధి పేదలకు వరం



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం మండలాలకు చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందిన పేదవారికి ముఖ్యమంత్రి సహాయనిది ద్వారా లబ్ధి చేకూరుతుందని, పేద ప్రజలు ఎవరైనా చికిత్స పొందిన ఆరు నెలల్లోపు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపదలో ఉన్న పేదవాళ్లకు అండగా నిలుస్తుందని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ శాఖ కార్యదర్శి మోహన్ రెడ్డి పాల్గొన్నారు.




## సిపిఐ రాష్ట్రవ్యాప్త బస్సు జాతను జయప్రదం చేయండి

జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పిలుపు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** సిపిఐ 100 సంవత్సరాల ఉత్సవాల ముగింపు సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే బస్సు జాతను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు. పోచంపల్లి పట్టణ కేంద్రంలో జరిగిన మండల కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వచ్చేనెల 26న ఖమ్మం నగరంలో పెద్ద ఎత్తున నిర్వహించే అఖిల భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల ముగింపు ఉత్సవాలు భారీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు అనేక అవస్థలు పడుతున్నారని ఒకవైపు తుఫానులతో అల్లాడిపోతున్నారని మరోవైపు కొనుగోలులో జాప్యం జరుగుతున్నందున అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. తేమశాతం 20 వచ్చినప్పటికీ ఏ గ్రేడ్ ధాన్యంగా ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండల వ్యాప్తంగా అనేక గ్రామాలలో రోడ్లు గుంతలుగా మారిపోయి ప్రమాదాలకు కేంద్రాలుగా మారుతున్నాయని వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. కప్రాయి పల్లి గ్రామంలో చిప్పల చెరువు కు తూము నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, మండల కార్యదర్శి గోడళ్ళ భూషణ్ గౌడ్, నరసింహ కృష్ణమూర్తి, శ్రీశైలం, శివ, బాల నరసింహ, సాయి రెడ్డి తదితర సిపిఐ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రైతులకు పరిహారం అందించండి

రైతుసంఘం ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులకు నేటి వరకు ప్రభుత్వం పరిహారం అందించలేదని వెంటనే నష్ట పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు , జిల్లా సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్యలు అన్నారు. మంగళవారం వారు సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్‌కు వినతిపత్రం అందచేసి మాట్లాడారు. తుఫాన్ వల్ల వందల ఎకరాలు నేలమట్టై రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఇప్పటివరకు వ్యవసాయాధికారులు ఏ గ్రామాలనికి వెళ్లి పరిశీలన చేయలేదన్నారు. ఒకవైపు కోత మిషన్లు దొరకక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా మిల్లర్లు కొర్రీలు పెట్టి రైతుల ధాన్యాన్ని తక్కువ రేటుకు కొనుగోలు చేస్తుండడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. ఇప్పటికైనా సబ్ కలెక్టర్ స్పందించి వ్యవసాయాదికారులను గ్రామాలకు పంపించి ఎక్కడ పంట నష్టం వాటిల్లిందో పరిశీలన చేయాలని ఆదేశించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లింగయ్య, ఎం.ఆశీర్వాదం, ఉపేందర్, బాలకృష్ణ, సతీష్, వెంకటయ్య, మట్టయ్య, నాగునాయ క్, రవీందర్, శివలింగం, రాములు, యాదగిరి, విశ్వనాద్, రైతులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై తప్పిన మరో పెను ప్రమాదం



**ప్రజాపక్షం/చిట్యాల:** జాతీయ రహదారి65పై చిట్యాల మండలం పిట్టంపల్లి వద్ద ప్రైవేట్ ట్రావెల్ బస్సులో ఒక్కసారిగా చెలరేగిన మంటలు..చూస్తుండగానే కాలిబూడిదైన బస్సు మంటపు రావడాన్ని గమనించి హుటాహుటిన కిందకు దూకిన ప్రయాణికులు..హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తుండగా ఘటన...బస్సు నాగాలాండ్ రిజిస్ట్రేషన్ కు చెందిన విహారి ట్రావెల్స్ బస్సుగా గుర్తింపు.నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని పిట్టంపల్లి స్టేజి వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో మరో ప్రైవేటు బస్సు పూర్తిగా దగ్ధమైంది. హైదరాబాదు నుండి విజయవాడ వైపు సుమారు 30 మంది ప్రయాణికులతో ప్రయాణిస్తున్న బస్సులోని ఇంజన్ లో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి బస్సులో మంటలు చెలరేగాయి. డ్రైవర్ వెంటనే అప్రమత్తమై ప్రయాణీకులను బస్సు నుండి దిగడానికి అప్రమత్తం చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది.లేకుంటే ఈ ప్రమాదంలో పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరిగేది.నిమిషాల్లోనే మంటలు వ్యాపించి బస్సుపూర్తిగా దగ్ధమైంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కొర్రీలు పెడితే చర్యలు తీసుకుంటాం

సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రైతులు తీసుకొచ్చిన అన్ని రకాల ధాన్యాన్ని మిల్లర్లు ఎలాంటి కొర్రీలు పెట్టకుండా తగిన మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్ తెలిపారు. మంగళవారం మిర్యాలగూడలోని సూర్య రైస్ మిల్లుతోపాటు పలు రైస్ మిల్లులను ఆయన అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టారు. రైతులను సమస్యలను అడిగి తెలుసుకునానరు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత రెండేళ్లుగతా రైతులు పడిన ఇబ్బందులను గమనించి అలాంటి ఇబ్బందులు తిరిగి పునరావృతం కాకుండా ఉండేందుకు తగు ప్రణాళికను రూపొందించుకోని రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ఏర్పాట్లను చేపడుతున్నట్లు తెలిపారు. మిర్యాలగూడలో గల మిల్లులను వాట్సాప్ ద్వారా అనుసంధానం చేసి ఏ మిల్లులో అయితే రద్దీ తక్కువగా ఉంటుందో ఆ మిల్లులకు ధాన్యం తరలించే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎలాంటి ధాన్యం కొనుగోలుకు ఇవ్వలేదని, ఇక్కడి నుంచి ధాన్యం తెలంగాణాలోకి రానివ్వకుండా తమ పరిధిలోని వాడపల్లి, నాగార్జునసాగర్ వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి పకడ్బందీగా తనిఖీలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మిర్యాలగూడ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, మిల్లర్స్ వెంకటరమణ చౌదరి, తహసీల్దార్ సురేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

# 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

విద్యార్థులకు పోషకాహారం నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు విధి నిర్వహణ

మధ్యాహ్న భోజన తనిఖీలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** విద్యార్థులకు పోషకాహారం నాణ్యమైన విద్య నందించి 100 శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో ఉపాధ్యాయులు విద్యాధికారులు విధి నిర్వహణలో నిమగ్నమై పని చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన భూదాన్ పోచంపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పదవ తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించి మెరుగైన ఫలితాలు రావడానికి పాటించవలసిన టెక్నిక్స్ బోధించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. అనంతరం మధ్యాహ్న భోజన నిర్వాహకులు విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని, వడ్డిస్తున్న తీరును, ఆహార పదార్థాలను, వంటకాలను పరిశీలించి స్వయంగా ఆయనే విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. ప్రతి విద్యార్థిని భోజనం రుచికరంగా ఉంటుందా నాణ్యమైన ఆహారం మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్‌గా తనిఖీ కోసం వచ్చినప్పటికీ సాధారణ విద్యార్థిగా విద్యార్థుల్లో ఒకరిగా వరుసలో నిలబడి ఆయన కూడా స్వయంగా ప్లేట్ పట్టుకొని భోజనం పెట్టించుకుని విద్యార్థులతో కలిసి ముచ్చటిస్తూ ఉపాధ్యాయులు బోధన సరిగ్గా బోధిస్తున్నారా లేదా అని తెలుసుకుంటూ భోజనం చేశారు. ఆయనతో పాటు అధికారులు కూడా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యాధికారులకు ఉపాధ్యాయులకు పాఠశాల మెరుగైన ఫలితాలు రావడం కోసం తీసుకోవలసిన జాగ్రత్తలు ప్రణాళిక ప్రకారం చేయవలసిన విధులు వంటివి దిశా నిర్దేశం చేశారు. ఇప్పటికే జిల్లాలో 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు చెప్పారు. రూ.30 కోట్లు రైతుల ఖాతాలో జమ అయినట్లు వెల్లడించారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులు అధైర్యపడి దళారులను నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. తహసిల్దారు శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఇంజన్ రెడ్డి, ఎండిఓ భాస్కర్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ గుత్తా వెంకటరెడ్డి, ఎంఈఓ ప్రభాకర్, ఏఈ వివిధ శాఖల అధికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆయన వెంట ఉన్నారు.

# జాప్యం చేయకుండా ధాన్యం కొనుగోలు



సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/తుంగతుర్తి (తిరుమలగిరి) :** సరైన తేమశాతంతో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని జాప్యం చేయకుండా వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం ఆయన తిరుమలగిరి మండలం తొండ, కోక్యానాయక్ తండ, ఫణిగిరి లలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టిన తరువాత ముందు పంపించాలని ఇది వరకే చెప్పడం జరిగిందని, ధాన్యం తడిచినప్పటికి ఇబ్బంది లేకుంటే మిల్లులకు పంపించాలన్నారు. పౌరసరఫరాల అధికారులు మిల్లర్లతో మాట్లాడి ధాన్యం తీసుకునే విధంగా చర్చించాలన్నారు. అనంతరం కొనుగోలు కేంద్రాలలో నిర్వహిస్తున్న వివిధ రకాల రిజిష్టర్లను పరిశీలించారు. ట్యాబ్ ఎంట్రీ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, తూకం సరైన విధంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. జిల్లా పౌర సరఫరాల అధికారి మోహన్‌బాబు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాము, తిరుమలగిరి తహశీల్దార్ హరిప్రసాద్ కలెక్టర్ వెంట ఉన్నారు.

**భవిష్యత్తుకు 10వ తరగతి మొదటి అడుగు : జిల్లా కలెక్టర్**

భవిష్యత్తుకు పదవ తరగతి మొదటి అడుగు అని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. పదవ తరగతిలో మంచి మార్కులు, విషయపరిజ్ఞానాన్ని సంపాదిస్తే ఇంటర్‌తోపాటు, అన్నింటిలో రాణించేందుకు అవకాశం ఉంటుందన్నారు. మంగళవారం ఆయన తిరుమలగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల స్పెషల్ క్లాస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందరికి పుస్తకాలు వచ్చాయా, సిలబస్ ఎంత వరకు అయిందని, హాస్టల్లో భోజనం బాగుందా, చదువులో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగారు. అనంతరం చదువు ప్రాధాన్యత, పదవ తరగతి ప్రాముఖ్యతను ఆయన తెలియజేస్తూ పదవ తరగతిలో మంచి మార్కులు వచ్చేందుకు బాగా కష్టపడి చదువాలని సూచించారు.

# గంజాయి ముఠా అరెస్ట్

1.4 కేజీల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం డిఎస్‌పి రాజశేఖర్‌రాజు వెల్లడి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలను నిర్మూలనే లక్ష్యంగా గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపి నిరంతర నిఘాలో భాగంగా మిర్యాలగూడ శివారులో గల అగ్రిగోల్డ్ వెంచర్‌లో గంజాయి తాగుటకు గంజాయి తెచ్చుకున్నారన్న సమాచారం మేరకు మిర్యాలగూడ వన్ టౌన్ ఎస్ఐ సైదిరెడ్డికి నమ్మదగిన సమాచారం రాగా మంగళవారం సిబ్బందితో వెంచర్‌ను చేరుకునే సమయానికి తొమ్మిది మంది యువకులు గంజాయిని కలిగి ఉన్న కవర్‌తో ఉండగా పోలీసులు చాకచక్యంగా వారిని పట్టుకోని వివరాలు తెలుసుకోని విచారించి, వారి వద్ద నుంచి ఒక నలుపు పాలిథిన్ కవర్‌లో ఉన్న 1.4కేజీ బరువు ఉన్న గంజాయి ప్యాకెట్లను, ఒక సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులు షేక్ అఫ్రోజ్, ననావత్ అశోక్, మహమ్మద్ నసీరొద్దిన్ బాబా, షేక్ హైమద్, వల్లవాయి నవీన్, మల్లెబోయిన రాకేష్, మారిలు స్నేహితులు. వీరు సాయిరాం ద్వారా గంజాయి తాగడం అలవాటు అయిందని, వీరంతా కలిసి గంజాయి తాగేవాళ్లు, ఎప్పటిలాగానే ఈ ఆరుగురు కలిసి ఒక్కొక్కరు రూ.1200 వేసుకోని రూ.7200తో సాయిరాం దగ్గర సుమారు రూ.1.4 కిలోల గంజాయి ప్యాకెట్లను అద్దంకి నార్కట్‌పల్లి హైవే వద్ద వై జంక్షన్ వద్ద కొనుగోలు చేసి యదావిధిగా అప్పుడు గంజాయి పంచుకోని తాగేవారు. మిర్యాలగూడ పట్టణ శివారులోని అగ్రిగోల్ వెంచర్ లోకి వెళ్లి అందులో పంచుకునే సమయంలో పోలీసులు వారిని పట్టుకున్నారని అన్నారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు, ఎస్ డీపీవో పర్యవేక్షణలో ఇట్టి కేసు ఛేదించడంలో ప్రత్యేక ప్రతిభ కనబరిచిన వన్ టౌన్ సీఐ నాగభూషణరావు, ఎస్ఐ సైదిరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రాజారాం, కానిస్టేబుల్ నల్లగంతుల శ్రీను, గద్దల హుస్సేన్, వీరబాబు, నర్సింహా, భీమనపల్లి ప్రసాద్, శివాజి, హోంగార్డు సాయి, గిరి, అనిల్‌లను జిల్లా ఎస్పీ అభినందించారని తెలిపారు.

## నక్కలగండి ప్రాజెక్టు భూ నిర్వాసితులకు అండగా ఉంటాం

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కవిత



**ప్రజాపక్షం/దేవరకొండ:** నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలోని చందంపేట మండలం నక్కలగండి ప్రాజెక్టు భూ నిర్వాసితులను కలిసి మాట్లాడేందుకు వారి సమస్యల పరిష్కారం కోసం అండగా ఉండేందుకు మంగళవారం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత నక్కలగండి ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో భూ నిర్వాసితులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నక్కలగండి ప్రాజెక్టు కోసం 2300 ఎకరాల భూమిని సేకరించారని మరో 700 ఎకరాలు అటవీ భూమి సేకరించాల్సి ఉందని ఇప్పటి వరకు అటవీ భూమిని ప్రభుత్వానికి ఇవ్వలేదని అన్నారు. మీ తరుపున నేను ప్రభుత్వాన్ని అడుగుతానని సిఎం, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి నిర్వాసితుల పక్షాణ మాట్లాడి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు ఆమె తెలిపారు. దేవరకొండ మండలం కొమ్మేపల్లి గురుకుల పాఠశాలను మంగళవారం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత సందర్శించారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా దేవరకొండలో పర్యటించి కొమ్మేపల్లి గురుకుల పాఠశాల విద్యార్థులు వర్షంలో అవస్థలు పడిన పరిస్థితిని వార్తల్లో చూసానని అందుకోసమే విద్యార్థుల వద్దకు వచ్చానని అన్నారు. జాగృతి రాష్ట్ర కార్యదర్శి మన అశోక్‌యాదవ్, బంజారా విభాగం రాష్ట్ర అధ్యక్షులు రవీందర్‌నాయక్, మల్లయ్య, అరుణ్, అనిల్ పాల్గొన్నారు.

# గురుకులంలో జిల్లా స్థాయి క్రీడలు ప్రారంభం

పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తాం

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నందికొండ:** విద్యార్థులు జిల్లా స్థాయితో పాటు రాష్ట్రస్థాయిలో కూడా విజయం సాధించి బహుమతులు సాధించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.నందికొండ మున్సిపాలిటీలోని స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో పాఠశాల ప్రిన్సిపాల్ రవికుమార్ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమైన అండర్ 14,19 జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ ఇలా త్రిపాఠి ముందుగా క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు వెంటనే జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందన సమర్పణ చేశారు. ఆ తరువా త విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించి శాంతికపోతాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనను ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా ఆహ్వానించినందుకు చాలా ఆనందంగా ఉందని విద్యార్థులు జిల్లా స్థాయితో పాటు రాష్ట్రస్థాయిలో కూడా బహుమతులు సాధించాలని అన్నారు. తన ఆతిథ్యానికి ముగ్దులైన కలెక్టర్ పాఠశాలలో మరిన్ని మౌలిక వసతులు కల్పిస్తానని తను ఇప్పటివరకు బాలికల పాఠశాలలను మాత్రమే సందర్శించానని ఇక్కడి వాతావరణం చూసిన తర్వాత ఇకనుంచి బాలుర పాఠశాలలను కూడా సందర్శిస్తానని అన్నారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో బహుమతులు సాధిస్తే తమ క్యాంప్ ఆఫీసులో విందును ఏర్పాటు చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమ ఏర్పాట్లు ఇంత అద్భుతంగా ఏర్పాటు చేయడంలో కృషి చేసిన పాఠశాల ప్రిన్సిపాల్ ను, ఉపాధ్యాయ, అధ్యాపక బృందాన్ని, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ రాజశేఖర్ ప్రాంతీయ సమన్వయ అధికారి స్వప్న, పెద్దవూర ఎంఈఓ తరి రాము, డిప్యూటీ తహసిల్దార్ శ్రీదేవి, నందికొండ మున్సిపల్ కమిషనర్ వేణు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖర్,తుమ్మడం బీసీ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్ పాల్గొన్నారు.



## సిఐఆర్ ద్వారా 2,340 మొబైల్ ఫోన్స్ రికవరీ : ఎస్‌పి

**ప్రజాపక్షం/సూర్యాపేట :** సిఇఐఆర్ ద్వారా ఇప్పటి వరకు 2340 మొబైల్ ఫోన్స్ రికవరీ చేసి బాధితులకు అందించినట్లు జిల్లా ఎస్పి కె నరసింహ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సెల్‌ఫోన్ రికవరీ మేళా ఏర్పాటు చేసి జిల్లాలో ప్రజలు వివిధ రూపాల్లో పోగొట్టుకున్న 102 ఫోన్లను రికవరీ చేసి జిల్లా ఎస్పి చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం 7వ దఫా మొబైల్ మేళా నిర్వహించి రికవరీ చేసిన మొబైల్స్‌ను బాధితులకు అందించామ న్నారు. దీని కోసం జిల్లా పోలీసు చాలా కృషి చేసిందని, పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న సైబర్ వారియర్స్ నిరంతర శ్రమ ఫలితంగానే వారి ఫోన్లను వారికి అప్పగించగల్గుతున్నామని తెలిపారు. విలువైన సమాచారం ఫోన్లలో భద్రపరిచి ఉంటున్నందున జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. పోయిన మొబైల్స్‌ను గుర్తించడానికి సిఇఐఆర్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, ఈ పోర్టల్ ద్వారా మంచి ఫలితాలు రాబట్టడం జరిగిందని వివరించారు. పంట కాలం చేతికొచ్చే సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని పంట డబ్బులు అకౌంట్‌లో వేస్తామంటూ అపరిచితులు ఎవరైనా ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ వివరాలు, ఓటిపి వివరాలు అడిగితే ఇవ్వవద్దని తెలిపారు. అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, డిసిఆర్‌బి డిఎస్‌పి రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఐటి కోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్ ఉన్నారు.

## యాదాద్రి జిల్లాను మత్తు పదార్థాలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలి

అదనపు కలెక్టర్ భాస్కర్ రావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లాలో డ్రగ్స్ మత్తు పదార్థాలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతయుతంగా కృషి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ మీటింగ్ హాల్లో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, అడిషనల్ డీసీపీ లక్ష్మీ నారాయణ, భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణమూర్తి , అన్ని విద్యాసంస్థల ప్రిన్సిపాల్, వైద్య ఆరోగ్య శాఖ, తదితర సంబంధిత విభాగాలతో కలిసి డ్రగ్స్ నిర్మూలన పై అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఉండేందుకు వారికి ముందస్తు అవగాహన సదస్సులు నిర్వహించి డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతయుతంగా తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనారిటీ, అంగన్వాడీ కేంద్రాలు, తదితర సంక్షేమ వసతి గృహాలలో ప్రార్థనా సమయాలలో డ్రగ్ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించాలన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి పద్మజ, జిల్లా విద్యా శాఖ అధికారి సత్యనారాయణ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారిని రమణి, ప్రిన్సిపల్స్ సంబంధిత అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఇసుక బుక్ చేసుకున్న కస్టమర్లను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఇసుకను బ్లాక్ చేసి అధిక ధరకు బ్రోకర్లకు అమ్మిన,బుక్ చేసుకున్న కస్టమర్ లకు ఇబ్బందులకు గురి చేసిన ట్రాక్టర్ డ్రైవర్ల పై కట్టిన చర్యలు తప్పవని ఎడి మైన్స్ అధికారి జాకబ్ హెచ్చరించారు.మంగళవారం పట్టణంలోని దేవరకొండ రోడ్డులోమైనింగ్ అధికారులు,వన్‌టౌన్,ట్రాఫిక్ పోలీస్ అధికారులు ఇసుక ట్రాక్టర్ల పై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వారందరితో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జాకబ్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించి వారికి అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఇసుక ట్రాక్టర్ డ్రైవర్లు బుక్ చేసుకున్న కస్టమర్లకు మాత్రమే పే చేసిన అమౌంట్ కు సరఫరా చేయాలని, కస్టమర్లకు ఇసుక బాలేదని, దూరం ఉందని మాయమాటలు చెప్పి అధిక డబ్బులు వసూలు చేస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపడం ఖాయమని హెచ్చరించారు.

# క్రీడ

## ఈడెన్ గార్డెన్స్‌లో క్రికెటర్ల సాధన..



సొంతగడ్డపై భారత జట్టుకు ఈసారి దక్షిణాఫ్రికా రూపంలో పరీక్ష ఎదురవుతోంది. ఇటీవలే వెస్టిండీస్‌ను వైట్‌వాష్ చేసిన టీమిండియా ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ విజేతలైన సఫారీలను నిలువరించేందుకు పక్కాగా సిద్ధమవుతోంది. ఆస్ట్రేలియా పర్యటన ముగియడంతో స్వదేశం చేరుకున్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సేన బ్యాటుతో చెలరేగాలనే పట్టుదలతో ఉన్నాడు. తొలి టెస్టుకు ఇంకా రెండు రోజులే ఉండడంతో.. మంగళవారం కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ పిచ్‌ను కోచ్ గంభీర్‌తో కలిసి గిల్ పరిశీలించాడు. స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో క్లీన్‌స్వీప్ తర్వాత మళ్లీ విజయాల బాట పట్టింది టీమిండియా. డబ్ల్యూటీసీ తొలి పోరులో ఇంగ్లండ్ గడ్డపై సిరీస్ సమం చేసిన శుభ్‌మన్ గిల్ బృందం.. వెస్టిండీస్‌ను చిత్తుగా ఓడించి పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో నిలిచింది. ఇప్పుడు టీమిండియాకు సవాల్ విసిరేందుకు దక్షిణాఫ్రికా కాచుకొని ఉంది. తెంబా బవుమా నేతృత్వంలోని పటిష్టమైన సఫారీల జట్టుకు చెక్ పెట్టాలంటే కాస్త కష్టపడాల్సిందే. అందుకే.. ఆస్ట్రేలియా పర్యటనలో పెద్దగా రాణించని గిల్ తనకు కలిసొచ్చిన సుదీర్ఘ ఫార్మాట్‌లో భారీ స్కోర్లు చేయాలనే పట్టుదలతో ఉన్నాడు. సహచరుల కంటే ముందే నెట్స్‌లో బ్యాటింగ్



ప్రాక్టీస్‌తో చెమటోడ్చాడు భారత సారథి. ఓపెనర్ యశస్వీ జైస్వాల్ కాసేపు బ్యాటింగ్ సాధన చేశాడు. బుమ్రా, సిరాజ్, కుల్దీప్, జడేజా, సుందర్ సైతం బౌలింగ్ ప్రాక్టీస్ చేశారు.

### కరోనా తర్వాత తొలి టెస్టు


భారత్, దక్షిణాఫ్రికాల మధ్య నవంబర్ 14న ఈడెన్ గార్డెన్స్‌లో ఉదయం 9:30 గంటలకు తొలి టెస్టు ప్రారంభం కానుంది. కరోనా తర్వాత ఈడెన్స్‌లో జరుగనున్న తొలి టెస్టు మ్యాచ్ ఇదే. దాంతో.. అభిమానులు భారీగా స్టేడియానికి తరలివచ్చే అవకాశముంది. రెండో దఫా బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సౌరవ్ గంగూలీ మ్యాచ్‌కు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నాడు.

### గువహటి టెస్టుపై సూర్యుడి ఎఫెక్ట్..
## లంచ్‌కు ముందే టీ బ్రేక్!

టెస్టు మ్యాచ్‌లో రోజుకు మూడు సెషన్లు ఉంటాయని తెలిసిందే. ఎక్కడైనా సరే లంచ్ తర్వాత టీ బ్రేక్ ఇవ్వడం చూశాం. కానీ, ఈ ఆనవాయితీని భారత బోర్డు పక్కన పెట్టనుంది. భారత్, దక్షిణాఫ్రికా మధ్య జరిగే రెండో టెస్టులో వెరైటీగా భోజన విరామానికి ముందే టీ బ్రేక్ ఉండనుంది. మామూలుగా అయితే డే నైట్ టెస్టులో ఇలా జరుగుంది. అయితే.. గువాహటి మ్యాచ్‌లోనే తేనీరు సెషన్ ముందే ఉంటుందని మంగళవారం భారత క్రికెట్ నియంత్రణ మండలి కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించాడు. ఈ నిర్ణయం తీసుకోవడానికి కారణం ఏంటో కూడా సైకియా చెప్పాడు. అదేంటంటే..? లంచ్‌కు ముందు టీ బ్రేక్ ఇవ్వడమేంటీ? అని ఆశ్చర్యపోతున్నారు. అందుకు ఓ కారణం ఉంది. గువాహటిలో వాతావరణం నేపథ్యంలో భారత బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. ఈశాన్యప్రాంతమైన ఇక్కడ తొందరగా చీకటి పడనుంది. అందుకే.. మ్యాచ్ వేళల్లో మార్పులు చేశామని దేవజిత్ సైకియా తెలిపాడు. ఉదయం 11కే లంచ్ అంటే ఆటగాళ్లు కొంత అసౌకర్యంగా ఫీలవుతారు. కాబట్టి.. టీ బ్రేక్‌ను ముందే ఇవ్వాలని నిర్ణయించామని సైకియా చెప్పాడు. 'చలికాలం మా ఈశాన్య ప్రాంతంలో సూర్యోదయం, సూర్యాస్తమయం త్వరగా జరుగుతాయి.

## అబుధాబీలోనే ఐపిఎల్ వేలం..

ఇండియన్ ప్రీమియర్ లీగ్ రిటెన్షన్ గడువు సమీపిస్తోంది. మరో నాలుగు రోజుల్లో ఫ్రాంచైజీలు తాము అట్టిపెట్టుకున్న ఆటగాళ్ల జాబితాను వెల్లడించాల్సి ఉంది. ఆ తర్వాత వేలంలో కొనాల్సిన క్రికెటర్ల గురించి కసరత్తు చేస్తారు పది జట్ల యాజమానులు. అయితే.. వేలం ఎక్కడ జరుగనుంది? ఏ తేదీన నిర్వహిస్తారు? అనే విషయాలపై మాత్రం ఉత్కంఠ వీడడం లేదు. గత రెండు సీజన్లకు విదేశాల్లోనే వేలం పాట నిర్వహించారు. ఈసారి కూడా అదే ఆనవాయితీ కొనసాగిస్తారనే వార్తలు వినిస్తున్నాయి. అలానే తేదీలపై కూడా సందిగ్ధం కొనసాగుతోంది. ఐపీఎల్ 19వ సీజన్ వేలంను డిసెంబర్ 15న లేదంటే డిసెంబర్ 19న నిర్వహిస్తామని ఇదివరకే నిర్వాహకులు చెప్పారు. ఇప్పుడు మాత్రం ఈ తేదీలు మారేలా ఉన్నాయి. డిసెంబర్ 1న లేదా డిసెంబర్ 16న ఆక్షన్ ఉంటుందని సమాచారం. ఊహించినట్టుగానే ఈసారి కూడా గల్ఫ్ దేశాల్లోనే వేలం ఉండనుంది. పదిహేడో సీజన్ వేలం దుబాయ్‌లో, 18వ సీజన్ మెగా వేలం సౌదీ అరేబియాలోని జెడ్డా నగరంలో జరిగాయి. 19వ సీజన్ మినీ వేలం అబుధాబీలో నిర్వహిస్తారని టాక్. ఈ వేదికను ఖరారు చేసినట్టు ఫ్రాంచైజీలకు నిర్వాహకులు చెప్పారని తెలుస్తోంది. అయితే.. ఐపిఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ లేదా బీసీసీఐ అధికారికంగా ప్రకటన చేయడమే తరువాయి అంటున్నాయి సన్నిహిత వర్గాలు. నవంబర్ 15 సాయంత్ర వరకూ రిటెన్షన్ జాబితాను ఫ్రాంచైజీలు ఇచ్చేస్తాయి. దాంతో.. ఏ ఫ్రాంచైజీ ఎవరిని రీటైన్ చేసుంది? వేలంలో నిలిచేది ఎవరు? అనేది ఆరోజే తెలియనుంది.





### రికార్డు ధర పలికేది ఎవరు?

ఐపీఎల్ వేలంలో వస్తుందంటే చాలు రికార్డు ధర పలికేది ఎవరు? అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. ఫ్రాంచైజీలు కూడా ప్రతిభావంతులపై కోట్లు కుమ్మరించేందుకు వెనుకాడవు. గత సీజన్‌లో రిషభ్ పంత్ రూ.27 కోట్లతో అత్యధిక ధర పలుకగా.. శ్రేయాస్ అయ్యర్ రూ.26.75 కోట్లతో రెండో స్థానంలో నిలిచాడు. పంత్‌ను లక్నో సూపర్ జెయింట్స్, అయ్యర్‌ను పంజాబ్ కింగ్స్ కొనగా.. వెంకటేశ్ అయ్యర్‌ను రూ.23.75 కోట్లకు కోల్‌కతా నైట్ రైడర్స్ అట్టిపెట్టుకుంది.

# మహిళ

## ఫోకస్

### డిమెన్షియాను తగ్గించే
## వ్యాయామం



పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా వ్యాయామం అందరికీ అవసరమే. అయితే, పలు అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉన్న మహిళలకు వ్యాయామం తప్పనిసరి. మధ్య వయస్సులో కార్డియోవాస్కులర్ వ్యాయామం చేసే మహిళల్లో డిమెన్షియా (మెదడు మరచిపోవడం, జ్ఞాపక విలయమవడం వంటి రోగం) వచ్చే అవకాశం 90 శాతం తగ్గిపోతుందని ప్రముఖ అధ్యయనం వెల్లడించింది. పరిశోధనా విశ్లేషణశాస్త్రవేత్తలు వందలాది మహిళలను అనేక దశాబ్దాల పాటు పరీక్షించి, ఫలితాలను విశ్లేషించిన సమర్పించిన నివేదికను అనుసరించి, మహిళల్లో వ్యాయామ అలవాట్లు, మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని గుర్తించారు. రన్నింగ్, సైక్లింగ్, స్విమ్మింగ్ వంటి శక్తివంతమైన కార్డియో వ్యాయామం చేయని లేదా తక్కువగా చేసే మహిళలతో పోలిస్తే, తరచు ఈ వ్యాయామం చేసే వారిలో డిమెన్షియా ప్రమాదం చాలా తక్కువగా కనిపించింది. కార్డియో వ్యాయామం మెదడులో రక్త ప్రసరణను పెంచుతుంది, మెదడు కణాలకు ఆక్సిజన్, పోషకాలు సమృద్ధిగా అందుతాయి. అలాగే, జ్ఞాపకశక్తికి, నేర్చుకోగలిగే ప్రాంతాలకు కొత్త న్యూరాన్స్ పెరుగుతాయి. బిపి తగ్గుతుంది. గుండె ఆరోగ్యం మెరుగవుతుంది. ఇవన్నీ డిమెన్షియా అవకాశాన్ని తగ్గించే ప్రధానాంశాలు. యువతులు టీనేజ్ నుంచే ఈ వ్యాయాన్నిమొదలు పెట్టవచ్చు. కనీసం మధ్య వయసులోనైనా తప్పక అనుసరించాలి. 40, 50 ఏళ్ల వయస్సులో కూడా వ్యాయామం మొదలు పెడితే, అతి తక్కువ సమయంలోనే మెదడు ఆరోగ్యం మెరుగుపడుతుదని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. వృద్ధాప్యంలో జ్ఞాపకశక్తి తగ్గిపోవడం ప్రమాదం పొంచి ఉంటుందనేది అందరికీ తెలిసిందే. ఆ సమస్య నుంచి బయట పడాలంటే, తప్పనిసరిగా వ్యాయామం మొదలు పెట్టాలి. ముఖ్యంగా కార్డియో ఎక్సర్‌సైజ్ అనివార్యంగా చేయాలి. డిమెన్షియా జన్యుపరిమాణాల వల్ల మాత్రమే రాదు. జీవన శైలి ప్రభావం బలంగా ఉంటోంది అని స్పష్టమైంది. క్రమం తప్పకుండా కార్డియో వ్యాయామం చేయడం మెదడు ఆరోగ్యానికి అత్యంత శక్తివంతమైన రక్షణ చర్యలలో ఒకటిగా నిరూపితమైంది. మహిళలు మధ్య వయస్సులో కార్డియో వ్యాయామానికి ప్రాధాన్యం ఇవ్వడం, జీవితాంతం మెదడు ఆరోగ్యానికి గొప్ప పెట్టుబడిగా చెప్పుకోవచ్చు.

## వాల్‌నట్స్‌లో ఔషధ విలువలు

డ్రై ఫ్రూట్స్‌లో వాల్‌నట్స్ (అక్రోట్స్)కు విశిష్ట స్థానం ఉంది. అయితే అందులో కొన్ని విశిష్ట ఔషధ విలువలు ఉన్నాయని పరిశోధకులు స్పష్టం చేస్తున్నారు. తాజా నివేదిక ప్రకారం వాల్‌నట్స్‌ను క్రమం తప్పకుండా తినడం వల్ల మహిళల్లో రొమ్ము కేన్సర్ కారక కణాలు మరణిస్తాయి. మార్షల్ యూనివర్సిటీలో నిర్వహించిన ప్రయోగంలో మహిళలు రోజుకు రెండు ఔన్సులు (సుమారు 56 గ్రాములు) చొప్పున రెండు వారాలు వాల్‌నట్స్ తినడంతో కేన్సర్ కణాలు తగ్గుముఖం పట్టినట్టు గుర్తించారు. అంతేగాక, కేన్సర్ కణాల వృద్ధి గణనీయంగా తగ్గిందని రుజువైంది. బ్రెస్ట్ కేన్సర్‌ను వాల్‌నట్స్ సంపూర్ణంగా తొలగిస్తాయని గానీ, ప్రస్తుత వైద్య విధానాలకు ప్రత్యామ్నాయంగా పనిచేస్తాయనిగానీ అనుకోవడానికి వీల్లేదు.



అయితే, వీటి వాడకం వల్ల సమస్య ఉధృతి తగ్గుతుంది. వాల్‌నట్స్‌ను బ్రెస్ట్ కేన్సర్ చికిత్సలో ఏ విధంగా విస్తృత పరిధిలో ఉపయోగించుకోవచ్చనే విషయంపై పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఫలితాలు ఎలా వున్నా, వాల్‌నట్స్ తీసుకోవడం వల్ల ప్రత్యేక లాభాలు లేకపోయినా నష్టం మాత్రం ఉండదు. కాబట్టి, ప్రయత్నం చేయడంలో తప్పులేదు.

## తల్లి నుంచే పిల్లలకు మేధస్సు!

మానవ మేధస్సు ఎంత వరకు జన్యుపరమైనది? అది తల్లిదండ్రులలో ఎవరి నుంచి ఎక్కువగా వారసత్వంగా వస్తుంది? అనే ప్రశ్నలకు చాలా కాలం నుంచి శాస్త్రవేత్తలు సమాధానం వెతికే ప్రయత్నం చేస్తున్నారు. అయితే తాజా పరిశోధనలను అనుసరించి, పిల్లల మేధస్సులో ఎక్కువ శాతం, కొన్ని సందర్భాల్లో దాదాపు మొత్తం కూడా తల్లిద్వారానే వారసత్వంగా వస్తుంది. ఇది జన్యు శాస్త్రంపై ఆధారపడి రూపొందించిన సిద్ధాంతం. అందుకేనేమో, ప్రతి బిడ్డకూ తల్లి మొదటి గురువు అవుతుంది. మేధో సామర్థ్యాలకు సంబంధించి ఉన్న జీన్స్ ప్రధానంగా 'ఎక్స్' క్రోమొసోమ్‌లో ఉన్నాయని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ప్రతి సంతానానికి తల్లి ఒక 'ఎక్స్' క్రోమొసోమ్‌ను ఇస్తుంది, కానీ తండ్రి మాత్రం లింగాన్ని నిర్ణయించే 'ఎక్స్' లేదా 'వై' క్రోమొసోమ్‌లలో ఏదో ఒకదాన్ని ఇస్తాడు. అందువల్ల, పిల్లల మేధస్సుపై తల్లి యొక్క జన్యు ప్రభావం తండ్రితో పోలిస్తే గణనీయంగా ఎక్కువగా ఉంటుంది. అంటే, జ్ఞాపకశక్తి, సమస్య పరిష్కార సామర్థ్యం, నేర్చుకోవడం, తార్కికత వంటి మేధో లక్షణాలను నిర్దేశించే జన్యకారకాలు ఎక్కువగా తల్లి నుంచి వస్తాయి. జనగణన ఆధారిత పరిశోధనలు, కవలలు మీద చేసిన అధ్యయనాలు కూడా ఈ సిద్ధాంతాన్ని బలపరిచాయి. ఈ పరిశోధనల్లో పిల్లల 'ఐక్యూ' స్కోర్లు తల్లుల జన్యువులతో ఎక్కువ సంబంధం చూపించగా, తండ్రి వైపు ప్రభావం తక్కువగా ఉందని తేలింది. తల్లి నుంచి వచ్చే జన్యు ఆధారం పిల్లల బుద్ధి సామర్థ్యానికి బయాలజికల్ ఫౌండేషన్‌ను అందిస్తుంది... కానీ ఆ సామర్థ్యం ఎలా వ్యక్తీకరించబడుతుందనేది పరిసరాలు, అక్కడి ప్రభావాలు నిర్ణయిస్తాయి. కాగా, తాజా పరిశోధన శాస్త్రీయంగానే కాక సామాజికంగానూ గణనీయమైన ప్రాధాన్యతను సంతరించుకుంది. గర్భధారణ సమయంలో తల్లి ఆరోగ్యం, పోషకాహారం, మానసిక స్థితి బిడ్డ మేధో అభివృద్ధిపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయని ఇది సూచిస్తుంది. పిల్లలు వారసత్వంగా పొందిన మేధస్సును పూర్తిగా వికసింపజేయడం కోసం బాల్యంలో మంచి సంరక్షణ, విద్యావాతావరణం, భావోద్వేగ సహకారం కీలక పాత్ర పోషిస్తాయి. అయితే, మేధస్సు పూర్తిగా జన్యుపరమైనదే అని చెప్పడం సరైంది కాదు. వ్యక్తి జీవిత అనుభవాలు, అభ్యాస అవకాశాలు, ఉపాధ్యాయుల ప్రేరణ, కుటుంబ మద్దతు వంటి అంశాలు కూడా మేధస్సు వికాసంలో కీలక పాత్ర పోషిస్తాయి. తల్లి పిల్లల మేధస్సుకు జన్యుపరమైన లక్షణాలను అందించినప్పటికీ, జీవన అనుభవాల ద్వారా అది మార్పు చెందే అవకాశాలు ఎక్కువ.




## 'ఢిల్లీ' దాడికి కేంద్ర హోంమంత్రి నైతిక బాధ్యత వహించాలి : సిపిఐ



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన దాడికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహంఎదుట తీవ్రవాద చర్యలకు వ్యతిరేకంగా తీవ్రవాదుల దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఆయన మాట్లాడుతూ దేశరాజధాని ఢిల్లీ నగరంలో సోమవారం జరిగిన తీవ్రవాద ముష్కరుల దాడి ఒక పిరికిపంద చర్య అన్నారు. పేలుడు పదార్థాలు అత్యంత రద్దీతో కూడిన ఎర్రకోట సమీపప్రాంతాల్లోకి ఎలా వచ్చాయి అనేది కేంద్రప్రభుత్వం హోంశాఖ సమాధానం చెప్పాలన్నారు. దేశంలో తీవ్రవాద చర్యలు ఆరికడుతున్నామని గొప్పలు చెప్పే అమిత్‌షా ఈ దాడికి నైతిక బాధ్యత వహించి తక్షణమే కేంద్రహోంమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు శివశంకర్, కృష్ణాజి, కిరణ్‌కుమార్, మధుగౌడ్, ఈర్లభూపేష్, కొత్తరామస్వామి, పట్టణ సహాయ కార్యదర్శి కృష్ణ, శేఖర్, శివకుమార్ పాల్గొన్నారు.

## కార్మిక చట్టాల రక్షణకు పోరాటాలు

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్




**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** కార్మిక హక్కులు, రక్షణ చట్టాల రక్షణకు పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ కార్మికలోకానికి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఎఐటియుసి ఆదిలాబాద్ పట్టణ నాల్గవ మహాసభలు ఎన్.రాధ అధ్యక్షతన ఘనంగా జరిగాయి. మహాసభలకు ముఖ్య అతిథిగా విలాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం సాధించిన 44 చట్టాలను తిరిగి సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం తీసుకువచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లను, రైతు వ్యతిరేక మూడు చట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని కోరారు. స్కీం వర్కర్స్, అంగన్‌వాడీ, ఆశ, కాంట్రాక్ట్ కార్మికులకు రూ.26,000వేతనం, పెన్షన్ ఇవ్వాలన్నారు. అనంతరం ఎఐటియుసి పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సిర్ర దేవేందర్, అధ్యక్షుడిగా ప్రవీన్‌రెడ్డి, కార్యదర్శిగా గాజంగుల రాజు, కోశాధికారిగా జి.భూషణం, ఉపాధ్యక్షులుగా ఎన్.రాధ, సంగీత, రామ్‌బాయి, బ్రదర్ అఫ్రోజ్, సహాయ కార్యదర్శులుగా మహేందర్, కాసి, కుంటాల రాములు, శ్రీలక్ష్మి ఎన్నికయ్యారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శత వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని సమావేశంలో తీర్మానించారు.

# గీత వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా

**ప్రజాపక్షం/నల్లగొండ :** కల్లు గీత వృత్తిదారుల సమస్యల పరిష్కరించాలని గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు పబ్బు వీరాస్వామి, జిల్లా కార్యదర్శి బొడిగె సైదులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట గీత పనివారల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కల్లుగీత వృత్తిలో చెట్లపై నుండి పడి మరణించిన కుటుంబాలతో పాటు శాశ్వతంగా గాయపడిన వారికి చెల్లించాల్సిన రూ.13 కోట్ల ఎక్స్‌గ్రేషియా బకాయిలను తక్షణమే విడుదల చేయాలని చేయాలని డిమాండ్ చేశారు. గీత వృత్తిలో చనిపోయిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాను 5 నుండి 10లక్షలకు తాత్కాలిక గాయాలతో భాదితులైన వారికి 2 లక్షలకు పెంచాలి. మెడికల్ బోర్డు విధానాన్ని రద్దుచేసి, ప్రభుత్వ సివిల్ అసిస్టెంట్ సర్జన్ పర్యవేక్షనలో తాత్కాలిక శాశ్వత వికలాంగుల నిర్ధాణ పాత పద్ధతిలోనే సర్టిఫికెట్ పద్ధతిని పునరుద్ధరించాన్నారు. షెడ్యూల్ ఏరియాలోని కల్లు గీత వృత్తిలో వున్న గీత వృత్తిదారులకు సహకార సంఘాలు, టిఎఫ్టాలు ఇవ్వాలని, గీత వృత్తిదారులందరికి రక్షణ వృత్తి పరికరాలు అందించాలని, నీర స్కీమ్‌ను కల్లు గీత సహకార సంఘాల ద్వారా అమలు చేయాలని, పెన్షన్ రూ.5వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కల్లుగీత వృత్తిదారులకు 560 జీవో ప్రకారం సొసైటీలకు భూమి, షాపులకు స్థలాలు, వృత్తి అభివృద్ధికి సంక్షేమ నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఏండ్లు తరబడి పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా బకాయిల విడుదల చేయాలన్నారు. పెండింగ్ వున్న గీత కార్మికుల పెన్షన్ దరఖాస్తులు, గుర్తింపు కార్డులు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి సురిగి చలపతి, సహాయ కార్యదర్శి పల్లె శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు చింతపల్లి పుల్లయ్య, కుంభం జయరాములు, జోగు సురేందర్, కర్నాటి వెంకటేష్, గంట నాగేష్, మారగొని మల్లయ్య, బొడిగె బక్కశెట్టి, వనం వెంకన్న,దోతి పండరి, మిద్దెల రామలింగయ్య, బొడిగె సత్తయ్య, ఉయ్యాల చంద్రయ్య, లెనిన్, కట్కూరి వెంకన్న, బోయపల్లి నరసింహా తదితరులు గీత కార్మికులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం గీత కార్మికుల సమస్యలపై జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎఒకు వినతిపత్రం అందజేశారు.




## అందెశ్రీ మరణం కళాకారులకు తీరని నష్టం

ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్దె శ్రీనివాస్

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** అందెశ్రీ మరణం కళాకారులకు తీరని నష్టం అని ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్దె శ్రీనివాస్, యాదాద్రి జిల్లా సిపిఐ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో అందెశ్రీకి చిత్రపట్నాకి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుషిపాక నరసింహ, చెక్క వెంకటేష్, ఏషాల అశోక్, ఇంజ హేమలత పిట్టల శంకర్, కట్ల యాదగిరి, జానుస్వామి కిరణ్ మనోహరమ్మ తదితరులు పాల్గొన్నారు.



## ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయరా?

మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ డిమాండ్

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా మహిళలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తి స్థాయిలో ఎప్పుడు అమలు చేస్తారని మహిళా సమాఖ్య యాదాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం మహిళా సమాఖ్య యాదగిరిగుట్ట మండల కౌన్సిల్ సమావేశం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఆరె పుష్ప అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై బండి జంగమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలలో మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా 2500 ఇస్తానన్న హామీని ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. అదేవిధంగా ఆడపిల్ల పెళ్లికి తులం బంగారం ఇస్తామని మాటలు చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్నా ఇచ్చిన హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. తక్షణమే మహిళలకు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా భారత కమ్యూనిస్టు పార్టీకి 100 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఖమ్మంలో నిర్వహించే సిపిఐ శత వార్షిక ఉత్సవాల బహిరంగ సభకు మహిళలు అధిక సంఖ్య లో పాల్గొనాలని ఆమె విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు మునుకుంట్ల నరసమ్మ, ప్రధాన కార్యదర్శి ఆరె పుష్ప, మద్దూరు భాగ్యమ్మ, నాతకాని కిష్టమ్మ, ఉపేంద్ర, గోద సువర్ణ లక్ష్మి , యాదమ్మ, పద్మ పాల్గొన్నారు.



## రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

కలెక్టరేట్ కార్యాలయంలో సిపిఐ వినతి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రైస్ మిల్లర్ల దోపిడిని అరికట్టాలని సిపిఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయంలో ఇంచార్జ్ ఎఒ శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. సిరిసిల్ల జిల్లాలో కొనుగోలు సెంటర్ నుండి రైస్ మిల్లర్లు కొనుగోలు చేస్తున్న ధాన్యం ఒక్క సంచి మీద అదనంగా ఐదు కిలోల నుండి 8 కిలోల వరకు తాలు, తరుగు, తేమ పేరున రైస్ మిల్లర్లు రైతులపై నిలువు దోపిడీ చేస్తున్నారని ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. వర్షాల మూలంగా తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి రోజుల తరబడి రైతాంగం శ్రమ చేస్తున్నప్పటికీ తేమ ఉందని కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులకు రూ.15600కే రైతులు అమ్ముకొని నష్టపోతున్నారని తెలిపారు. సెంటర్ నిర్వాహకులను ఇబ్బంది పెడుతున్న రైస్ మిల్లర కఠిన చర్యల్లో భాగంగా రైస్ మిల్లర్ రిజిస్ట్రేషన్ లను రద్దు చేయాలని కోరారు. సెంటర్‌కు సంబంధం లేకుండా నేరుగా తక్కువ ధరకు రైతు నుండి కొనుగోలు చేస్తున్న రైస్ మిల్లర్ పై జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి గన్ని సంచులు తిరిగి ఇవ్వకుండా కోట్లల్లో సొమ్ము చేసుకుంటున్న రైస్ మిల్లర్ పైన జిల్లా కలెక్టర్ తనిఖీ నిర్వహించి వాటిని రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఐకెపి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. గత సీజన్లో రాజన్న సిరిసిల్ల జిల్లాలో 44 వేల రైతుల నుండి కొనుగోలు చేసిన రైతులకు చెల్లించాల్సిన 500 రూపాయల బోనస్ తో కలుపుకుంటే నాలుగు కోట్ల 50 లక్షల రూపాయలు రైతాంగానికి బోనస్ డబ్బులు చెల్లించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సోమ నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మంత్రి చంద్రయ్య, రాజేందర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటి ప్రచారంలో పాల్గొనాలి

సిపిఐ ములుగు జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు

**ప్రజాపక్షం/ములుగు:** ఖమ్మంలో నిర్వహించే సిపిఐ శత వసంత ఉత్సవాల విజయవంతానికి ఇంటింటి ప్రచారం నిర్వహించాలని సిపిఐ ములుగు జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జున రావు పార్టీ శ్రేణులను కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిపిఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఇంటింటికి వెళ్ళి ప్రచారం చేయాలని కోరారు. జిల్లా సమగ్ర అభివృద్ధిలో భాగంగా కమ్యూనిస్టు పార్టీ అలుపెరగని పోరాటం చేస్తూ పేద కార్మికులు, కర్షకులు, బడుగు, బలహీన వర్గాలు శ్రామిక వర్గాల కోసం కృషి చేస్తుందన్నారు. సిపిఐ శత జయంతి ఉత్సవాల బహిరంగ సభకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, కార్యాకర్తలు, అభిమానులు తరలివెళ్లేలా కృషి చేయాలన్నారు. ప్రతి సిపిఐ కార్యకర్త గ్రామాలలో ఫండ్ వసూలు చేయాలని ఈ సందర్భంగా కార్యకర్తలను కోరారు. రేపు 20వ తేదీకు ఈ నెల ప్రచార జాత ములుగులో ఒంటిగంటకు ప్రవేశిస్తున్నందున గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సభకు హాజరు అవ్వబోయే పార్టీ కార్యకర్తలు ఎర్ర ప్యాంట్, ఎర్ర చొక్కాలు ధరించి రావాలని, మహిళా సంఘాలు, అంగన్‌వాడీలు, ఆశాలు, మిడ్‌డే మీల్స్ వర్కర్స్, సెకండ్ ఐఎన్ఎమ్స్, సివిల్ సప్లయి కార్మికులు, స్కావెంజర్స్ హాజరై విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో సిపిఐ పార్టీ ములుగు జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు బి కృష్ణకుమారి, టివి కే మీనా కుమారి, వెంకటాపురం మండల కార్యదర్శి కట్ల రాజు, వాజేడు మండల కార్యదర్శి నెల్లబోయిన రవీందర్, కొక్కుల రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## 50 మంది ఆటో డ్రైవర్లకు ఆటోలు పంపిణీ



ప్రజాపక్షం/కాప్రా : ప్రభుత్వ పథకం ద్వారా ఉప్పల్ నియోజకవర్గంలోని 50 మంది ఆటో డ్రైవర్లకు కొత్త ఆటోలను స్థానిక ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మంగళవారం రిబ్బన్ కట్‌చేసి అందచేశారు. బిఆర్‌టియు కాప్రా అధ్యక్షులు రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య, కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, హమాలి శీను, బిఆర్‌టియు రాష్ట్ర కార్యదర్శి మహేష్ దేశ్‌పాక్, వర్కింగ్ ప్రెసిడెంట్ పాండు నాయక్, సాయి కుమార్, శ్రీనివాస్, ఎర్రం శ్రీనివాస్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



## రంజిత్ కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం

ప్రజాపక్షం/కూకట్‌పల్లి : జెఎన్‌టియుహెచ్‌లో మంద రంజిత్ కుమార్‌కు డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేశారు. డాక్టరేట్ అందుకున్న మంద రంజిత్‌కు యాకన్న శుభాకాంక్షలు తెలిపారు. డిజైన్ అండ్ ఎనాలిసిస్ ఆఫ్ ఎస్పివి సిస్టంస్ ఫర్ హయ్యర్ ఎలక్ట్రికల్ ఔట్‌పుట్ విత్ డిఫరెంట్ ఎంపిపిటి టెక్నిక్యూస్ అనే అంశంపై ఆయన విలువైన పరిశోధన చేశారు. ఈ పరిశోధనను విశ్వ విద్యాలయ డైరెక్టర్ డా.కె.వియజ కుమార్ రెడ్డి మార్గదర్శకత్వంలో విజయవంతంగా పూర్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని అగ్ర సాంకేతిక విద్యా సంస్థ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ నుండి ఎనర్జీ సిస్టమ్స్ విభాగంలో డాక్టరేట్ డిగ్రీని మంద రంజిత్ కుమార్ పొందడం గర్వకారణమని యాకన్న తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వ విద్యాలయంలోని టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ జెఎన్‌టియుహెచ్ జెఎసి రాష్ట్ర అధ్యక్షుడిగా విలువైన సేవలు అందించారన్నారు. జెఎన్‌టియుహెచ్ జెఎసి చైర్మన్ పదవికి కూడా నియమితులయ్యారని అన్నారు. విద్యార్థి ఉద్యమాలతో పాటు తన పరిశోధనలుకూడా పట్టుదలతో కొనసాగించి, నేడు డాక్టరేట్ డిగ్రీ సాధించడం ఆయన కృషి, క్రమశిక్షణ, అంకితభావానికి ప్రతీక అని అన్నారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య, రాష్ట్ర అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు, ఎం.ఆర్.పి.ఎస్.రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య, కూకట్‌పల్లి ఉమ్మడి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎర్ర యాకన్న, పుట్టి నగేష్, జాయింట్ సెక్రటరీ నాగుల అంజిబాబునేత, సభ్యులు రామారావు, దేవేందర్‌రెడ్డి, పంతం వెంకటేష్ రాజు, హేమంత్‌కుమార్, తదితరులు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.



## గురుకుల పాఠశాలలో క్రీడోత్సవాలు ప్రారంభం

ప్రజాపక్షం/శామీర్‌పేటః శామీర్‌పేట మండలంలోని మహాత్మ జ్యోతి బాపులే గురుకుల పాఠశాలలో హైద్రాబాద్ జిల్లా క్రీడోత్సవాలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తుర్కపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. అనంతరం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ రవికుమార్ మాట్లాడుతూ హైద్రాబాద్ పరిధిలోని సుమారుగా 13 పాఠశాలలు, 6 జూనియర్ కళాశాలల నుంచి 450మంది క్రీడాకారులు ఈ క్రీడల్లో పాల్గొంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో లక్కోస్ రాష్ట్ర కార్యదర్శి భానుచందర్, ఎటిపి శేఖర్, హెప్సిబా, ఫిజికల్ డైరక్టర్ వెంకట్‌రెడ్డి, సాయి కుమార్, సాయిబాబా, స్పోర్ట్స్ కమిటి సభ్యులు నరేష్, టెండుల్కర్, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

ప్రజాపక్షం/శామీర్‌పేట : మూడుచింతలపల్లి మున్సిపల్‌లోని జగ్గంగూడలోని తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ పాఠశాలలో స్వతంత్ర భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలాన అబ్దుల్ కలాం అజాద్ జన్మదినంతో పాటు జాతీయ విద్యా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మేడ్చల్ జిల్లా పరిషత్ సిఇఒ కాంతమ్మ మాట్లాడుతూ మౌలాన అబ్దుల్ కలాం అజాద్ స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించారని చెప్పారు. విద్యాశాఖ మంత్రిగా అందించిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో జరుగబోయే అథ్లెటిక్స్ పోటీల్లో హర్యానాలో పాల్గొంటున్న ఎండి మస్తాన్‌ను ప్రముఖులు అభినందించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటి మెంబర్ మహ్మద్ ముజుబుద్దీన్, స్థానిక మైనార్టీ నాయకులు ఆలీ, జాఫర్, షరీఫ్, పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణ, అధ్యాపక బృందం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు, రేపు టి-సాట్ విద్యార్థుల 2025 వార్షిక పోటీలు

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకు 'విద్యార్థుల వార్షిక పోటీలు 2025' పేరుతో పోటీలను టిసాట్ కార్యాలయంలో ఈ నెల 12, 13 తేదీలలో నిర్వహించనున్నట్లు టిసాట్ సిఈఒ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఈ నెల 4వ తేదీ నుంచి రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో 6వతరగతి నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు మండల స్థాయి నుండి జోనల్ స్థాయి వరకు నిర్వహించారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

సుమారు 600 లకు పైగా మండలాలు, 33 జిల్లాల స్థాయిలో జరిగిన పోటీల్లో సుమారు 22వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని, ఇందులో 10వేల మంది విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్స్ అందచేశామని వివరించారు. టి–సాట్ వేదికగా నవంబర్ 12,13 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి ఫైనల్ పోటీల్లో క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ విభాగాలలో దాదాపు 100మంది విద్యార్థులు పాల్గొంటారని, వారికి మెరిట్ సర్టిఫికేట్లతో పాటు జ్ఞాపికను అందజేస్తామన్నారు. ముగింపు ఉత్సవానికి రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారని తెలిపారు.

# మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలకు స్థలం, నిధులు మంజూరు

### జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్



ప్రజాపక్షం/వికారాబాద్ : జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా వికారాబాద్ మైనార్టీ రెసిడెన్సియల్ జునియర్ కాళాశాల బాలికలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ మైనారిటీ రెసిడెన్షియల్ జునియర్ కళాశాలకు అయిదు ఎకరాల స్థలం కేటాయిస్తున్నామని, స్వంత భవనం నిర్మాణానికి అవసరమైన నిధులు కూడా మంజురు చేయిస్తాను అని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు స్వతంత్ర్య భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రి భారతరత్న, స్వర్గీయ మౌలానా అబుల్ కలాం అజాద్ పుట్టినరోజు సందర్భంగా జరుపుకుంటున్న 'నేషనల్ ఎద్యుకేషన్ డే' కార్యక్రమంలో పాల్గొంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లి దండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. మౌలానా అబుల్ కలాం అజాద్ భారతదేశానికి స్వాతంత్ర్య వచ్చిన తరువాత ఈదేశ విద్యా విధాన రూపకల్పనలో క్రియాశీలంగా పాల్గొన్నారు. వారి సేవలకు గుర్తుగా వారి జన్మదినాన్ని జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నామని అందరికి విద్యా అందాలి, అందరు చదువుకోవాలి అనేదే నేషనల్ ఎద్యుకేషన్ డేను జరుపుకునే ఉద్దేశం అని అన్నారు. విద్యతోనే దేశం, సమాజం కూడా అభివృద్ధి చెందుతాయనే లక్ష్యంతో అబ్దుల్ కలాం ఆజాద్ విద్యాభివృద్ధికి అనేక ఆధునిక సంస్కరణలు తీసుకువచ్చారు.

మౌలానా అబుల్ కాలం అడుగు జాడల్లో నడుస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నది. అందుకే తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్స్ దేశానికి ఆదర్శంగా ఉన్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ హాస్టళ్లు గురుకులాలలో ఎనిమిది లక్షలమంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. గురుకులలాలలో చదువుకునే పిల్లలు ప్రభుత్వ బడిపిల్లలు, అంటే మా పిల్లలు, మా బిడ్డ లు ఎంతో మీరు కూడా మాకు అంతే. పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్ కాస్టోక్ ఛార్జీలు పెంచమని విద్యార్థులు ఎంత మొత్తుకున్న ఆందోళన చేసినా గతప్రభుత్వం పట్టించుకోలేదని కానీ రాష్ట ముఖ్యమంత్రి డైట్ ఛార్జి రూ.40 నుండి 200లకు పెంచుతు విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వ వసతి గృహాలకు వంట సామాగ్రిని అందించారు. రాష్టంలో ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్, అన్ని వర్గాల పిల్లలకు కలిసి మెలిసి చదువుకోవడానికి అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

**29 కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ**



**మర్పల్లిః** వికారాబాద్ నియోజకవర్గంలోని మర్పల్లి మండల పరిధిలోని లబ్ధిదారులకు మంజురైన 29కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను వికారాబాద్ క్యాంపు కార్యాలయంలో స్పీకర్ ప్రసాద్‌కు మార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం రిలీఫ్ ఫండ్ పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. వృథాగా ఖర్చు చేయకుండా అప్పులు తీర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సురేష్‌యాదవ్ పార్టీ నాయకులు లబ్దిదారులు పాల్గొన్నారు.

## గంజాయి నిర్మూలనకు గొంతెత్తిన జగద్గిరిగుట్ట వాసులు

ప్రజాపక్షం /కుత్బుల్లాపూర్ : జగద్గిరిగుట్ట కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో జగద్గిరిగుట్ట అన్ని బస్తీల కమిటీ నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు హాజరై గంజాయికి వ్యతిరేకంగా కలిసి పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, బస్తీ కమిటీల నాయకులు ముక్తకంఠంతో జగద్గిరిగుట్టలో గంజాయి నిర్మూలన కోసం కలిసి పనిచేద్దామని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి అమ్మాలనుకునేవారికి, సేవించాలనుకునే వారికి జగద్గిరిగుట్టలో ఇల్లు కిరాయిలకు ఇవ్వొద్దని, ఒకసారి గంజాయి కేసులో పట్టుబడితే జగద్గిరిగుట్ట నుండి బహిష్కరించాలని నిర్ణయించుకున్నారు. అదేవిధంగా గంజాయికి వ్యతిరేక కమిటీలను ఏర్పాటు చేసి ప్రజలను చైతన్య వంతం చేయాలని ఏకగ్రీవంగా తీర్మాణించారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన బాలల దినోత్సవం సందర్భంగా జగద్గిరిగుట్టలో మానవహారాన్ని వేలాది మందితో ఏర్పాటు చేయాలని అన్నారు. ఇది ఆరంభం మాత్రమేనని రానున్న రోజుల్లో కూడా సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని వారు నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, యేసు, రత్నం, మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శిలు హరినాథ్, రాములు, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు గణేష్, యువజన నాయకులు సాయి పంతులు, పవన్‌రెడ్డి, జనసేన సతీష్, బిజెపి హనుమంతు చారి, రాజు యాదవ్, ప్రజానాట్య మండలి బాబు, ఏఐటీయుసీ శ్రీనివాస్, దుర్గయ్య, సదానంద, శ్రీనివాస్ నగర్ ఖయ్యూం, సీనియర్ జర్నలిస్ట్ వెంకట్, లెనిన్ నగర్ సదానందం, వనం రాజు, జీవి శ్రీనివాస్, రవీందర్ గౌడ్, మైసమ్మ నగర్ బసప్ప, రవి, రవీందర్‌రెడ్డి, బ్రహ్మానంద చారి, కృష్ణ, గుడ్ మార్నింగ్ మురళి, సూరారం కాలనీ అధ్యక్షుడు సందీప్, అసిస్టెంట్ ప్రొఫెసర్ త్రివేణి, విశ్వబ్రాహ్మణ సంఘం మనోహర్ చారి, దీనబంధు కాలనీ ప్రవీణ్, అంజయ్య నగర్ వెంకటేష్, విజయ్, రాజు, ఇమామ్, నరసింహ, సామిల్, నరసింహారెడ్డి, శ్రీనివాస్ సుంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'జోహార్ అందెశ్రీ' నినాదాలతో హోరెత్తిన ఒయు

### కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులు అర్పించిన విద్యార్థులు

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర గీతం సృష్టికర్త, ప్రముఖ కవి అందెశ్రీకి ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నేతలు, విద్యార్థులు ఘనంగా నివాళులు అర్పించారు. మంగళవారం సాయంత్రం ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి అనంతరం అందెశ్రీ చిత్రపటం వద్ద కొవ్వొత్తులు ఉంచి 'జోహార్ అందెశ్రీ' అంటూ నినాదాలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో అందెశ్రీ సాహిత్యం ముఖ్య భూమిక పోషించిందని విద్యార్థి సంఘాల నేతలు అన్నారు. ఆయనకు ఉస్మానియా యూనివర్సిటీతో ఉన్న సంబంధాన్ని గుర్తు చేసుకొని ఆవేదన వ్యక్తం చేశారు. అందెశ్రీ ఖ్యాతి ఎల్లకాలం గుర్తుండేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు.





## శామీర్‌పేట సొసైటీలో అమలు పరుస్తున్న పథకాలు అద్భుతం

### తెలంగాణ, కర్ణాటక పిఎసిఎస్ సంఘాల సిఇఒలు

ప్రజాపక్షం/శామీర్‌పేట : శామీర్‌పేట వ్యవసాయ సహకార సంఘంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు అద్భుతంగా ఉన్నాయని ఈ సొసైటీని ఆదర్శంగా తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక మహారాష్ట్రల పిఎసిఎస్ సహకార సంఘాల సిఇఒలు, సెక్రటరీలు అన్నారు. మంగళవారం నాబార్డు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు వారి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల సంఘాలకు చెందిన సిఇఒలు, సెక్రటరీ లు శామీర్‌పేట సొసైటీని సందర్శించారు. ఈ సందర్భంగా డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ శామీర్‌పేట సంఘంలో రైతులకు అందుతున్న రుణాలు, ఎరువులు, విత్తనాలు, ఫార్మ్‌రైస్ వన్, ప్రాజెక్ట్ ద్వార మార్కెట్ లింకేజి సౌకర్యం, డ్రోన్లు స్ప్రేయర్‌లు, టార్ఫాన్‌లు, సిఎస్‌సి సెంటర్ ద్వార రైతులకు అందుతున్న ఆన్‌లైన్ సేవలను వివరించారు. అనంతరం నాబార్డు ప్రతినిధులు మాట్లాడుతూ శామీర్‌పేట సంఘంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు హర్షణీయమని చెప్పారు. శామీర్‌పేట సొసైటీలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలను తమ సంఘాల్లో అమలుపరుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డు అధికారులు షీలా, సతీష్, యోగేష్, సంఘ డైరక్టర్లు ఐలయ్య, ప్రతాప్‌రెడ్డి, నర్సింలు, చంద్రకళ, సంఘ సిఇఒ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



## ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు

ప్రజాపక్షం/వికారాబాద్:జిల్లా వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణా జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగాఅనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని, వాహనాలను తప్పని సరిగా సీజ్ చేయాలనీ, సంబంధిత అధికారులతో ఇసుక రవాణాపై సంబంధిత శాఖ అధికారులతో సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్రమ ఇసుక రవాణా జరుగకుండ తనిఖీలు చేయాలని తెలిపారు. ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, రెవెన్యూశాఖల సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డిఆర్ఒ మంగీలాల్, డిఆర్‌డిఒ మంగీలాల్ ఎండి మైన్స్ సత్యనారాయణ, అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్, ఇరిగేషన్ అశోక్, గ్రౌండ్ వాటర్ రవి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## విద్యుత్ తీగ తగిలి వ్యక్తి మృతి

ప్రజాపక్షం/మోమిన్‌పేట్ : విద్యుత్ తీగ తగిలి వ్యక్తి మృతి చెందిన సంఘటన మోమిన్‌పేట్ మండల పరిధిలోని గోవిందాపూర్ గ్రామంలో చోటుచేకుందని మోమిన్‌పేట్ ఎస్ఐ అరవింద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముట్టిబోయ రామకృష్ణ 40సంవత్సరాల లేబర్ వృత్తి చేస్తున్నాడు. నివాసం గోవిందపూర్ గ్రామం మోమిన్‌పేట్ మండలం వికారాబాద్ నేలతలమారి గ్రామం, దేవనకొండ మండలం కర్నూల్ జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్టం అను వ్యక్తి కుటుంబంతో కలిసి కూలీ పనిచేస్తూ ఫామ్ హౌస్‌లో పనిచేస్తున్నారు. రాత్రి సమయం లో షఖరికి వెళ్లి గోవిందపూర్ గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 68 వ్యవసాయ భూమిలో మొక్కజొన్న పంట చుట్టూ రక్షణ నిమిత్తం కరెంట్ తీగలకి షాక్ పెట్టడం జరిగింది. ప్రమాద వశత్తు కరెంట్ తీగలు తగిలి షాక్ మునిరంగడు అక్కడికక్కడే మృతి చెందారు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అరవింద్ తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా కరెంట్ షీక్ పెట్టిన గోపాల్ పై కేసు నమోదు చేశామన్నారు. రైతులు అనధికారంగా విద్యుత్ తీగలను పొలాల్లో అమర్చవద్దని ఇది చట్ట విరుద్ధం అన్నారు. ఇందులో నాన్ బెయిలబుల్ క్రిమినల్ కేసులు నమోదు చేయబడుతాయిని అన్నారు.



# 'కుత్బుల్లాపూర్' కాంగ్రెస్‌లో అయోమయం

### ఎవరికి వారే ఎమునా తీరే తరహాలో అధికార పార్టీ నేతలు

ప్రజాపక్షం/నిజాంపేట్ః ఎవరికి వారే యమునా తీరే అన్న చందంలా అధికార పార్టీ నేతలు కొనసాగుతున్నారు. దీంతో కార్యకర్తలు, నాయకులు బేజారవుతున్నట్లు తెలుస్తోంది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అయోమయ పరిస్థితిలో ముందుకువెళ్తుం ది. కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలను ఇష్టానుసారంగా ప్రారంభిస్తుండడంతో కార్యకర్తలు అయోమయానికి గురి అవుతున్నారు.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి బాచుపల్లి చౌరస్తాలో నియోజకవర్గ స్థాయి పార్టీ కార్యాలయాన్ని ఎన్నికల ముందు నుండి కొనసాగిస్తూ నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి కార్యక్రమాలైనా ఇక్కడి నుండే కొనసాగిస్తున్నారు. అయితే ఇటీవల బాచుపల్లి గ్రామంలో ఓ మాజీ సర్పంచ్, మాజీ కార్పొరేటర్ నూతనంగా నిర్మించిన ఓ షెడ్డులో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడం చర్చనీయాంశమైంది. అయితే బాచుపల్లి గ్రామంలోనే రెండు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు ఉండడం విశేషం. నియోజకవర్గంలోని గాజులరామారంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ఓ పార్టీ కార్యాలయాన్ని బాచుపల్లిలో నియోజకవర్గం ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి ఓ పార్టీ కార్యాలయాన్ని, గండిమైసమ్మ చౌరస్తాలో దుండిగల్ మున్సిపల్‌కు చెందిన నేతలు పార్టీ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. బాచుపల్లిలో మాత్రం నియోజకవర్గం స్థాయి పార్టీ కార్యాలయానికే నాయకులు, కార్యకర్తలు వెళ్లడం సహజం. కాని బాచుపల్లిలోనే మరో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడం వెనుక అసలు కారణమేమిటని పలువురు నేతలు, కార్యకర్తలు గుసగుసలాడుతున్నారు. మాజీ సర్పంచ్ ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఏకంగా ఎమ్మెల్యే స్థాయి కార్యాలయంలా తీర్చిదిద్దడం విశేషం. అంతేకాకుండా తానే ఎమ్మెల్యే అభ్యర్థినంటూ కొన్ని సందర్భాల్లో ప్రచారం సైతం చేసుకుంటున్నట్లు అనుచరుల నుండి తెలుస్తోంది.

ఇప్పటికే నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో ఎవరికి వారే యమునా తీరే అన్న చందంలా ఎవరికి వారు పార్టీ కార్యక్రమాలను సాగిస్తున్నప్పటికీ బాచుపల్లిలో మాత్రం మరోరకంగా పార్టీని నడపడం గమనార్హం. నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలతో పాటు నాయకులు, కార్యకర్తలకు సంబంధించిన సమస్యలు, ఇతర సమావేశాలు సైతం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలోనే జరిగాయి. అయితే బాచుపల్లిలోనే మరో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభించడం వెనుక ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. బాచుపల్లి గ్రామంలోనే ఓ ఎమ్మెల్యే స్థాయిలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడం పై పార్టీ నాయకులు, కార్యకర్తలు గుసగుసలాడుతున్నారు. ఎమ్మెల్యే స్థాయిలో పార్టీ కార్యాలయం ప్రారంభించడం వెనుక ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. పార్టీ కార్యాలయాల ప్రారంభం పార్టీలో ఏ స్థాయికి చేరుకుంటుందో వేచిచూడాల్సిందే.

**బాచుపల్లిలో వర్గపోరు..**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు జోరుగా సాగుతుంది. ముఖ్యంగా నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హన్మంతరెడ్డి కొనసాగుతుండగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షునిగా కొలను రాజశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కొలను జీవన్ రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి కొలను బాల్‌రెడ్డిలు పార్టీలో ఉన్నారు. అయితే మాజీ సర్పంచ్ ఆగం పాండు ముదిరాజ్ కాంగ్రెస్ పార్టీలో ఉండగా రెడ్డీ వర్సెస్ ముదిరాజ్ అన్న తరహాలో పోరు సాగుతుంది. బోనాల ఉత్సవాలు, బతుకమ్మ పండుగ, గణపతి ఉత్సవాలు, దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు పోటాపోటీగా జరగడం గమనార్హం. పోచమ్మ ఆలయ ప్రాంగణంలో ఓ వైపు రెడ్డీస్ గణపతి మండపం ఉంటే మరోవైపు బిసిల గణపతి మండపాన్ని ఏర్పాటు చేసుకోవడం చర్చనీయాంశంగా మారిందని బాచుపల్లిలోనే పలువురు చెబుతున్నారు.

ఇదిలా ఉండగా గణపతి నిమజ్జనం సైతం పోటాపోటీగా ఊరేగింపులు నిర్వహించడం వెనుక జరిగిన పోరు తారాస్థాయికి చేరినట్లు సమాచారం. అంతేకాకుండా బతుకమ్మ పండుగ రోజు సైతం రెడ్డీస్ వర్సెస్ ముదిరాజ్ అన్న తరహాలో బతుకమ్మ వేడుకలను నిర్వహించడం విశేషం. కలిసికట్టుగా కులమతాలకు అతీతంగా నిర్వహించాల్సిన పండుగలను సైతం ఈ విధంగా జరుపుకోవడం నియోజకవర్గంలోనే చర్చనీయాంశమైంది. ఇలా బాచుపల్లి గ్రామంలో రోజురోజుకి కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు జరుగుతూ తారాస్థాయికి చేరుతుంది. ఒకే పార్టీలో ఉంటూ అదీ అధికార పార్టీలో ఉంటూ ఈ విధంగా విబేదాలతో నేతలు సాగడం పై సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ఈ పోరు ఇంతటితోనే సమసిపోతుందా ఎక్కడి వరకు దారితీస్తుందనేది చూడాల్సిందే.



# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## కాలనీల సమస్యలు పరిష్కరిస్తా : రాగుల



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : కాలనీ సమస్యలు పరిష్కారం చేస్తామని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని ఓంకార్ నగర్‌లో కాలనీ సంక్షేమ వాసులతో కలిసి పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ డ్రైనేజీ, వర్షపు నీరు నిల్వ కాకుండా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు హరేందర్‌రెడ్డి, సాయి కిరణ్ గౌడ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ క్యాంటీన్ ప్రారంభం



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని ఎన్జీవోస్ కాలనీ వివేకనంద పార్కు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఇందిరమ్మ క్యాంటీన్‌ను మంగళవారం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ చిరు వ్యాపారులకు, పేదలకు, అడ్డా కూలీలకు ఇందిరమ్మ పథకం ద్వారా రూ.5 రూపాయలకే భోజనం అందించడం పట్ల ఎంతో మందికి ఉపయోగపడుతుందన్నారు. నిరుద్యోగులకు, రోజువారి వ్యాపారం చేసే వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి శానిటేషన్ విభాగం డిఇ నీలిమా, ఎస్ఎస్ అజీమ్ ఉద్దీన్, నాయకులు విష్ణువర్ధన్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, పవన్‌రెడ్డి, సుధీర్ కుమార్, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పిఎం జీవనజ్యోతి చెక్కు అందజేత



ప్రజాపక్షం/యాచారం : యాచారం గ్రామానికి చేందిన కేశమోని యాదమ్మకు ప్రధాన మంత్రి జీవన జ్యోతి యోజన కింద రూ.2 లక్షల చెక్కును అంద జెసినట్లు యాచారం ఎస్‌బిఐ బ్యాంక్ మేనేజర్ మాన్యనాయక్ తెలిపారు. మంగళవారం అయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ యాచారం గ్రామ నివాసి కేశమోని దశరథగౌడ్ ఇటీవల మృతి చెందాడు. దశరథగౌడ్ ప్రధానమంత్రి జీవన జ్యోతి యోజన కింద 436 రూపాయల ఇన్సూరెన్సును కట్టాడు. అయన జనవరి 2025న చనిపోయాడన్నారు. అతని భార్యా నామిని ఉండడంతో ప్రిమియం డబ్బులు చెల్లించామన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఒ ఈశ్వర్‌రావు, క్యాష్ అధికారి బాలకృష్ణ పాల్గొన్నారు.

## క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్



ప్రజాపక్షం/షాద్‌నగర్: క్రీడలతోనే యువతకు ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని, యువతి, యువకులు చదువులతోపాటు ఆటల్లో రాణించాలని బీసీ సేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సదర్ శ్రీనివాస్ సూచించారు. సోమవారం షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లి గ్రామంలో ఉన్న మహాత్మా జ్యోతిరావుపూలే సోషల్ వెల్ఫేర్ బాలుర కళాశాలలో రంగారెడ్డి జిల్లా స్థాయి గేమ్స్, స్పోర్ట్స్ మీట్‌ను అట్టహాసంగా ప్రారంభించారు. ప్రిన్సిపల్ ప్రీతీ ఆధ్వర్యంలో షాద్‌నగర్ ఏసిపి లక్ష్మీ నారాయణ, సిఐ విజయ్‌కుమార్, మండల విద్యావనరుల అభివృద్ధి శాఖ అధికారి చంద్రశేఖర్, సదర్ శ్రీనివాస్‌లు హాజరయ్యారు. క్రీడల ప్రారంభోత్సవం సందర్భంగా వివిధ కళాశాలల విద్యార్థులు కవాతు నిర్వహించి స్థానిక ఎంఇఓ మనోహర్‌తో ప్రిన్సిపల్ ప్రీతీ కలిసి టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సదర్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సూచించారు. షాద్‌నగర్ ఏసిపి లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న విద్యార్థులకు ఒక్కతాటిపైకి తీసుకురావడం గొప్ప విషయమని, ప్రతి క్రీడాకారుడు భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని పోటీల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో పిఈటిలు, పిడిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణ ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు

బిసిసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ



ప్రజాపక్షం/షాద్‌నగర్: బిసిసేన సంఘంలో నేతలు క్రమశిక్షణతో ఉండాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ హెచ్చరించారు. మంగళవారం షాద్‌నగర్‌లో బీసీసేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సదర్ శ్రీనివాస్ అధ్యక్షతన ముఖ్యనాయకుల సమావేశాన్ని నిర్వహించారు. అంతకుముందు జిల్లా కోర్ కమిటిని నూతనంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బర్క కృష్ణ మాట్లాడుతూ బీసీసేన సంఘంలో సభ్యులు క్రమశిక్షణగా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సంఘం నిబంధనలకు లోబడి పని చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. నూతన కోర్ కమిటి సభ్యులుగా సదర్ శ్రీనివాస్, మచ్చపోతుల వరప్రసాద్, ప్యాట జయ, బూషం నరేష్, న్యాయవాది చీపిరి చంద్రశేఖర్, చెన్న బాల్‌రాజ్‌లను ఎంపిక చేపినట్లు వివరించారు. బీసీసేన సంఘంలో ఎవరైనా క్రమశిక్షణ ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తీసుకునే అధికారం ఈ కోర్ కమిటి సభ్యులకు ఉంటుందని సూచించారు. ఏ విమర్శలు చేసినా సంఘం నిబంధనలకు లోబడి చేయాలని, ఇష్టం వచ్చినట్లు చేస్తే చర్యలు తప్పవని సూచించారు.

## చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాపక్షం/కొందుర్గు: విద్యార్థులు చదువులతోపాటు చట్టాలపై అవగాహన పెంచుకునేందుకు కృషి చేయాలని కొందుర్గు ఎస్ఐ రవీందర్‌నాయక్ సూచించారు. మంగళవారం కొందుర్గు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాలలో చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవీందర్‌నాయక్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యంశాలను శ్రద్ధగా నేర్చుకొని ఉన్నత శిఖరాలను అదిరోహించాలని సూచించారు. చెడు మార్గంలో వెళ్లకుండా సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే పనులు చేయాలని పేర్కొన్నారు. విద్యతోపాటు క్రీడల్లో సైతం రాణించాలని, దాంతో ఆత్మస్థైర్యం కొల్పోకుండా మానసికంగా దృఢంగా ఉంటారని, మంచి క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా జూబ్లీహిల్స్ ఎన్నికలు

ఉల్లంఘనలపై మూడు కేసులు : కమిషనర్ సజ్జనార్




ప్రజాపక్షం/హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించామని హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి సజ్జనార్ పేర్కొన్నారు. పోలింగ్ జరుగుతున్న సందర్భంలో ఎన్నికల ప్రవర్తనా నియామవళిని ఉల్లంఘించిన పలువురిపై హైదరాబాద్ సిటీ పోలీసులు మూడు కేసులను నమోదు చేయడం జరిగిందన్నారు. ఎంఎల్‌ఎలు బీర్ల ఐలయ్య, రామచంద్రనాయక్, రాందాస్ పై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు, మాజీ ఎంఎల్‌ఎలు దాస్యం వినయ్ భాస్కర్, మెతుకు ఆనంద్‌పై బోరబండ పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసు నమోదయ్యాయని సజ్జనార్ తెలిపారు. ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠినంగా వ్యవహరిస్తున్నట్లు హైదరాబాద్ సిటీ పోలీసులు స్పష్టం చేస్తున్నారు. ప్రజాస్వామ్య విధానంలో ఎన్నికలు శాంతియుతంగా, పారదర్శకంగా జరగాలంటే ప్రతిఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియామవళిని గౌరవించాలని సజ్జనార్ సూచించారు. యూసఫ్‌గూడ ప్రధానరహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, కౌశిక్‌రెడ్డిలు తమ కార్యకర్తలతో ఆందోళనకు బైఠాయించారు. అనంతరం పోలీసులు సముదాయించి అక్కడి నుంచి పంపించి వేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు మధ్య తీవ్ర తోపులాట జరిగింది. షేక్ పేట్ డివిషన్‌లో దొంగ ఓట్లు వేస్తున్నారంటూ బిఆర్ఎస్ నాయకులు అడ్డుకోవడంతో కొంతఉద్రిక్తత నెలకొంది. పోలీసులు స్వల్ప లాఠీచార్జీ చేసి ఆందోళనకారులను అక్కడి నుంచి పంపించివేశారు.

## కేన్సర్‌తో చితికిన కుటుంబానికి ఎక్సైజ్ శాఖ చేయూత



ప్రజాపక్షం/హైదరాబాద్: కేన్సర్‌తో చితికిన కుటుంబానికి రూ.2.45 లక్షల అర్థిక సాయాన్ని మంగళవారం ఎక్సైజ్ శాఖ కమిషనర్ సి.హరికిరణ్ అందజేసి ఆదుకున్నారు. మహ్మమద్ అహమ్మద్ ఎక్సైజ్ శాఖ ధూళిపేట ఎక్సైజ్ స్టేషన్‌లో 12సంవత్సరాలుగా ప్రైవేట్ డ్రైవర్‌గా చేస్తున్నాడు. అహమ్మద్ భార్య హర్షియా దివ్యాంగురాలు, వీరిద్దరికి ఇద్దరు పిల్లలు. ఇద్దరిలో 11 సంవత్సరాల రేహన్ మానసిక దివ్యాంగుడిగా ఉన్నాడు. 9 సంవత్సరాల అమ్మాయి ఉంది. కాగా ఇంటి యజమానికి కేన్సర్ వ్యాధి సోకిందని తెలియడంతో కుటుంబం మొత్తం దు:ఖంలో మునిగిపోయారు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ రూ.2.45 లక్షల అర్థిక సాయాన్ని ఇఎస్ నవీన్ చేతుల మీదుగా కమిషనర్ చాంబర్‌లో అందించారు.

## నాగిళ్ల దేవయ్య మరణం పార్టీకి, ప్రజాసంఘాలకు తీరనిలోటు

సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి





ప్రజాపక్షం/రంగారెడ్డి: సిపిఐ సరూర్‌నగర్ మాజీ కార్యదర్శి నాగిళ్ల దేవయ్య గుండెపోటుతో అకాల మరణం పార్టీకి, ప్రజా సంఘాలకు తీరని లోటు అని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. సిపిఐ సరూర్‌నగర్ మాజీ మండల కార్యదర్శి నాగిళ్ల దేవయ్య గుండెపోటుతో మరణించారన్న విషయం తెలుసుకుని పల్లా వెంకట్‌రెడ్డి కర్మన్‌ఘాట్ లోని దేవయ్య నివాసానికి చేరుకొని ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్ బోస్, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్ర చారి, రాష్ట్ర సమితి సభ్యులు యాదిరెడ్డి, ఎల్.బి నగర్ నియోజకవర్గ కార్యదర్శి సామడి శేఖర్‌రెడ్డి, ఎఐటియుసి ఎల్‌బి.నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు బోయపల్లి రాములు గౌడ్, మెట్టు మండల కార్యదర్శి హరిసింగ్‌నాయక్, ఛాయాదేవి, కమలమ్మ, వెంకటేష్, నాగరాజు, భూషణ్, చంద్రమౌళి ఉన్నారు.

# అందెశ్రీ జ్ఞాపకాలు చెరిగిపోనివి..

రావుల గిరిధర్



ప్రజాపక్షం/హైదరాబాద్: "అది ఫిబ్రవరి, 2020 అనుకుంటా.. అప్పుడు నేను సమ్మక్క సారలమ్మ జాతర విధి నిర్వహణలో ఉన్నాను. ఓ పెద్దమనిషి అక్కడే తచ్చాడుతూ ఉన్నాడు. ఎందుకు ఇక్కడే తిరుగుతున్నాడనుకుని, ఓ పెద్దమనిషీ! ఎందుకు అటూ ఇటూ తిరుగుతున్నావు? ఇట్రా అంటూ, నా వాకీటాకీ, క్యాప్ పెట్టి ఉన్న కుర్చీ మీద నుండి వాటిని తీసేసి కూర్చోమని అన్నాను. చాలా సంతోషం సర్, అంటూ కూర్చున్నాడు ఆ పెద్దమనిషి. ఎందుకు తిరుగుతున్నావు? దర్శనం కోసమా అని అడిగితే, అవును సార్, మీవోళ్ళు పంపట్లేదు అన్నాడు. సరేగానీ, నేను పంపిస్తా..ఫస్ట్ మంచినీళ్లు తాగుమని చెప్పి నీళ్ల బాటిల్ ఇచ్చా. తర్వాత ఒక్కరే వచ్చారా అని అడిగా. లేదు డ్రైవర్ తో వచ్చాను అన్నాడు. చాలా సాధారణంగా మాట్లాడుతూ ఉన్నా కానీ, నాకు ఎక్కడో ఈయనను చూసా అనిపిస్తుంది. ఆయన మీ పేరేంటని అడిగారు..నా వివరాలు చెప్పి మీరెవరని ఆయనను అడిగాను. నేను అందెశ్రీని అన్నాడు. ఓహ్..మీరేనా అందెశ్రీ అన్నాను, అదే ఎక్కడో చూసినట్టు అనిపిస్తుందని అన్నాను. ఆయన తొందర చూసి మా కానిస్టేబుల్ ను తోడుగా ఇచ్చి పంపించాను. మా కానిస్టేబుల్ ఆయనను గుడి దగ్గరికి పోయే దారిలో దింపి వచ్చేశాడు. అయ్యో, మొత్తం దర్శనం అయ్యే దాకా ఉండక పోయావా అని మా కానిస్టేబుల్ తో అన్నాను. తనేమీ మాట్లాడలేదు. మళ్లీ ఓ గంట తర్వాత ఆయన దర్శనం చేసుకుని తన భుజాల మీద శాలువాలతో ఆనందంతో వచ్చాడు. నా మనసులో ఈయనకు శాలువా కప్పేంత సీన్ ఉంటే విఐపి పాస్ ఎందుకు తీసుకోలేదో అనుకున్నా. చాలా చాలా ధన్యవాదాలు అద్భుతమైన దర్శనం అయింది..ఎవరూ పట్టించుకోని నన్ను మీరు ఇలా పిలిచి కూర్చోబెట్టి దర్శనానికి పంపడం ఆ అమ్మ దీవెన మీ ద్వారా పంపడమే అంటూ తన భుజాల మీద వేసుకున్న శాలువా నాకు కప్పి కృతజ్ఞతలు తెలిపాడు. మీలాంటోళ్లు పోలీస్ డిపార్ట్మెంట్ లో ఉండాలి అంటూ ఆశీర్వదించారు.'' అని ఐపిఎస్ రావుల గిరిధర్, అందెశ్రీతో తన జ్ఞాపాలను గుర్తు చేసుకుని కన్నీటిపర్వతమయ్యారు.

## వసతి గృహాలపై మార్గదర్శకాలు

ప్రజాపక్షం/హైదరాబాద్: విద్యార్థులు, నివాసితుల సంక్షేమం, హాస్టల్ సౌకర్యాలు, ఆహార సరఫరా, వైద్య అత్యవసర పరిస్థితులను తనిఖీ చేసి, ఆ నివేదికలతో పాటు,ముఖ్యమైన విధులకు ప్రధాన్యత ఇచ్చేవిధంగా 'ఇంటిగ్రేటెడ్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్'ను రూపొందించాలని సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ అధ్యక్షతన జరిగిన సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయించింది. అన్ని సంక్షేమ హాస్టల్స్ నిర్వహణ నిమిత్తం 'ఇంటిగ్రేటెడ్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్'ను రూపొందించే అంశంపైన హైదరాబాద్‌లోని సచివాలయంలో సబ్యసాచిఘోష్ అధ్యక్షతన మంగళవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎస్‌సి,ఎస్‌టి, బిసి, మైనార్టీల, వికలాంగుల సంక్షేమ శాఖ కార్యదర్శి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వారు చర్చించారు. వివిధ విభాగాల హాస్టల్ నిర్వహణలో ఉమ్మడిగా ఉండే కీలక రంగాలను గుర్తించారు. సిస్టమ్ ద్వారా సంగ్రహించాల్సిన పరిమితులపైన సాఫ్ట్‌వేర్ డెవలపర్లకు స్పష్టమైన మార్గదర్శకాలను సూచించారు. హాస్టల్స్, రెసిడెన్షియల్ పాఠశాలల నిర్వహణ, పర్యవేక్షణ, వివరణాత్మక కార్యాచరణ నివేదికలను అందించే అప్లికేషన్స్‌ను రూపొందించాలని సిఎం ఆదేశాలపైను పాటించనున్నారు.



# ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి/షాద్‌నగర్ : ధాన్యం కేంద్రాలలో కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కె చంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం షాద్‌నగర్‌లో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరి ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా రైతుల నుండి సేకరించిన నిల్వల నాణ్యతను పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత పరిమాణంలో వరి, పత్తి కొనుగోలు చేశారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి కేంద్రంలో సరిపడా గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని, రవాణా పరమైన ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. రైస్ మిల్లులకు ఎన్ని లోడ్‌ల లారీలు వెళ్ళాయి, ట్రక్ షీట్లు వెంటవెంటనే తెప్పించుకుని ట్యాబ్ ఎంట్రీలు చేస్తున్నారా అని ఆరా తీశారు. ధాన్యం సేకరణ, మిల్లులకు తరలింపు వివరాలతో కూడిన రికార్డులను పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. పూర్తి స్థాయిలో ధాన్యం సేకరణ జరిగిన మీదట కొనుగోలు కేంద్రాలను మూసివేసే ముందు ట్రక్ షీట్‌లు తదితర అంశాలను పరిశీలించుకోవాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 17 శాతానికి లోబడి తేమ ఉన్న ధాన్యాన్ని రైతులు కేంద్రాలకు తెచ్చిన వెంటనే తూకం జరిపించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అనవసర కాలయాపన కాకుండా, రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. ఫార్మా సిటీ భూముల్లో పండించిన పంటలు ఈ సంవత్సరం మాత్రమే కొనుగోలు చేయడం జరుగుతుంది అని అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి అన్నారు. రాఘవేంద్ర కాటన్ మిల్లును తనిఖీ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి షాద్‌నగర్ తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అదనపు కలెక్టర్ వెంట సివిల్ సప్లయ్ అధికారి వనజాత, డిఎం హరీష్, మార్కెటింగ్ శాఖ అధికారి రియాజోద్దీన్, వ్యవసాయశాఖఅధికారి ఉష, మార్క్‌ఫెడ్‌డిఎం, కేంద్రాల నిర్వాహకులు ఉన్నారు.

## తాపిమేస్త్రీ దారుణ హత్య

ప్రజాపక్షం/కొత్తూరు: తాపిమేస్త్రీ దారుణ హత్యకు గురైన సంఘటన కొత్తూరు మండల పరిధిలోని పెద్దమ్మతండా రోడ్డులో చోటు చేసుకుంది. కొత్తూరు ఎస్ఐ గోపాలకృష్ణ, సత్యశీలారెడ్డిలు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఓ ప్రైవేట్ వెంచర్‌లో తాపిమేస్త్రీగా శంసుల్ (30) అనే యువకుడు పని చేస్తున్నట్లు తెలిపారు. రోజు మాదిరిగానే సోమవారం పని చేశారని, మంగళవారం ఉదయం అదే వెంచర్‌లోని గదిలో విగత జీవిగా పడి ఉన్నాడని తెలిపారు. మృతుడి బందువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తున్న చేస్తున్నట్లు సిఐ నర్సయ్య తెలిపారు. మృతుడు బిహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ వైద్యశాలకు మృతదేహన్ని తరలించారు.

## అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం..కేసు నమోదు

ప్రజాపక్షం/తుర్కయంజాల్ : అనుమతులు లేకుండా ఓలా ఎలక్ట్రికల్ బైక్ పై నాదర్గుల్‌కు చెందిన మారగోని అశోక్(61) మద్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఆదిభట్ల పోలీసులు, ఎస్ఒటి పోలీసులు సోదాలు జరిపి పట్టుకున్నారు. అతని వద్ద నుండి సుమారు 42.5 లీటర్ల వివిధ బ్రాండ్ లకు సంభందించిన మద్యం, బీర్లను, మద్యం తరలిస్తున్న ఓలా ఎలక్ట్రికల్ బైక్ ను ఆదిభట్ల ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకొని, నిందితుడి పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## ఇష్టానుసారం అక్రమ నిర్మాణాలు

అధికారుల తీరుపై సిపిఐ నాయకుల ఆగ్రహం



ప్రజాపక్షం/శంషాబాద్ : శంషాబాద్ మండల మున్సిపల్ పరిధిలో జిఒ 111 నిబంధనలను ఉల్లంఘిస్తూ ఎటువంటి అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నాయని సిపిఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సిపిఐ నాయకులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ విషయాన్ని గతంలోనే మున్సిపల్ కమిషనర్, మండల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో భూక్రమబద్ధీకరణ, పర్యావరణ నిబంధనలు పూర్తిగా ఉల్లంఘనకు గురవుతున్నాయన్నారు. మున్సిపల్ కమిషనర్, అధికారులు ప్రజా ఫిర్యాదులపై స్పందించకపోవడంతో పైఅధికారులకు, కలెక్టర్ కార్యాలయంలో, హైదరాబాద్‌లోని సంబంధిత శాఖలకు అధికారిక ఫిర్యాదు చేస్తామని సిపిఐ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.యాదగిరి, మండల కార్యదర్శి నర్రగిరి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అన్నెపు ప్రభు పాల్గొన్నారు.

# మౌలానా ఆజాద్ జీవితం ఆదర్శణీయం

జిల్లా రెవెన్యూ అధికారి సంగీత



ప్రజాపక్షం/రంగారెడ్డి: మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం ఆదర్శణీయమని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత అన్నారు. మంగళవారం అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత పాల్గొని అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖమంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అన్నారు. దేశంలో విద్యాభివృద్ధికి బాటలు వేసిన మొదటి దేశ విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని కొనియాడారు.అ ఆజాద్ జయంతి రోజును జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ అధికారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



### మౌలానా ఆజాద్ గొప్ప ఆదర్శవంతుడు : ఎసిపి కృష్ణయ్య

హయత్‌నగర్: మౌలానా అబుల్ కలాం ఆజాద్ గొప్ప ఆదర్శవంతుడని ఎల్ బి నగర్ ఎసిపి క్రిష్ణయ్య అన్నారు. మంగళవారం మన్సూరాబాద్ డివిజన్ సూర్యోదయ కాలనీలోని తక్షశిల పాఠశాలలో ఏర్పాటు చేసిన మౌలానా అబ్దుల్ ఆజాద్ జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎల్ బి నగర్ ఎసిపి క్రిష్ణయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆజాద్ దేశానికి విద్య శాఖ మంత్రిగా చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో కె.శేఖర్‌రెడ్డి, మహేష్‌గౌడ్, వైష్ణవి, పల్లవి, స్కూల్ ప్రిన్సిపల్ అర్చనతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# రీల్

## ఆ హీరోకు థ్యాంక్స్: నిర్మాతలు



కిరణ్ అబ్బవరం నటించిన 'కె ర్యాంప్'లో రాజశేఖర్ హీరోగా నటించిన ఆయుధం సినిమాలోని ఇదేమిట్ట మాయా మాయా మైకం కమ్మిందా పాటను ఉపయోగించారు. హీరో ఇంట్రడక్షన్ సమయంలో ఉపయోగించిన ఈ పాట సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఎంతోమంది ఈ పాటకు రీల్స్, షార్ట్స్ చేశారు. ఇలా 'కె ర్యాంప్' సక్సెస్‌లో ఈ పాట కూడా ఒక భాగమైంది. ఈ నేపథ్యంలో ఆయుధం సినిమా హీరో రాజశేఖర్, నిర్మాతలు వజ్జ శ్రీనివాసరావు, ఎన్.అంజన్ బాబు, దర్శకుడు ఎన్ శంకర్, సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్‌లకు 'కే ర్యాంప్' నిర్మాతలు రాజేశ్ దండ, శివ బొమ్మకు థ్యాంక్స్ చెప్పారు నిర్మాతలు రాజేశ్ దండ, శివ బొమ్మకు మాట్లాడుతూ మా సినిమాలో డాక్టర్ రాజశేఖర్ హీరోగా నటించిన ఆయుధం సినిమాలోని ఇదేమిట్ట మాయా మాయా పాటను పిక్ చేసుకున్నాం. ఇంతమంచి బ్లాక్ బస్టర్ సాంగ్ అందించారు వందేమాతరం శ్రీనివాస్ నిర్మాతలు వజ్జ శ్రీనివాసరావు, ఎన్.అంజన్ బాబుకి, ఇలాంటి బ్లాక్ బస్టర్ సాంగ్ అప్పట్లోనే సెలెక్ట్ చేసుకున్న మా డైరెక్టర్ ఎన్.శంకర్‌కి థ్యాంక్స్. ఆయుధం టీమ్ అందరికీ థ్యాంక్స్ అన్నారు.

## 21న 'పాంచ్ మినార్' రిలీజ్



రాజ్ తరుణ్ హీరోగా రామ్ కడుముల దర్శకత్వంలో రూపొందిన క్రైమ్ కామెడీ ఎంటర్ టైనర్ 'పాంచ్ మినార్'. గోవింద రాజు ప్రజెంట్ చేస్తున్న ఈ చిత్రాన్ని కనెక్ట్ మూవీస్ ఎల్.ఎల్.పి బ్యానర్‌పై మాధవి, ఎం.ఎస్.ఎం.రెడ్డి నిర్మిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన సాంగ్స్, టీజర్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్న ఈ సినిమా నవంబర్ 21న ఈ చిత్రం విడుదల కానుంది. రాజ్ తరుణ్, అజయ్ ఘోష్, రాశి సింగ్, శ్రీనివాస్ రెడ్డి ఇంటెన్స్ లుక్‌లో కనిపించిన రిలీజ్ డేట్ పోస్టర్ ఇంట్రస్టింగ్‌గా వుంది.

## శివలో నాగార్జునను తప్ప మరొకరిని ఊహించుకోలేను

దర్శకుడు రామ్ గోపాల్ వర్మ

* శివ నా కెరీర్‌లో బెస్ట్ ఫిలిం : నాగార్జున



రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో 1989లో విడుదలైన శివ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ లో నిర్మాతలు అక్కినేని వెంకట్, సురేంద్ర యార్లగడ్డ నిర్మించారు. అన్నపూర్ణ స్టూడియోస్ 50 ఇయర్స్ సందర్భంగా శివ చిత్రాన్ని 4కే డాల్బీ అట్మాస్‌లో నవంబర్ 14న థియేటర్లలో రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో నాగార్జున, దర్శకుడు రామ్ గోపాల్ వర్మ పాల్గొన్నారు. దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మాట్లాడుతూ.. ఒరిజినల్‌లో ఉండే షేపర్ పోకుండా ఏఐ టెక్నాలజీని వాడి ఆ ఎఫెక్ట్ ఇవ్వడం కోసం వర్క్ చేసాము. అది మీ అందరికీ నచ్చడం హ్యాపీగా ఉంది. శివ మేడ్ ఫర్ వన్ అండ్ ఓన్లీ నాగార్జున. శివ సినిమాలో నాగార్జునను తప్ప మరొకరిని ఊహించుకోలేను. నాగార్జున క్యారెక్టర్ ఒక స్టూడెంట్. తన రౌడీ కాదు. కానీ ఒక సిచువేషన్‌లో తన చేతిలో చెయిన్ ఉండాలనుకున్నప్పుడు, అది నేచురల్ గా ఉండాలి. అలాంటి సమయంలో తన దగ్గరలో ఉండే ఏదైనా ఒక వెపన్ వాడితే కావాలనుకున్నాం. అలా సైకిల్ చెయిన్ ఐడియా క్రియేట్ అయింది. సౌండ్ క్వాలిటీ ఇంత పెరిగాక సాంగ్స్ స్టోడెన్ చేస్తే యని మాకు అనిపించింది. నాగార్జున ఫ్యాన్స్ ఎంజాయ్ చేయిస్తారు. నేను బయట ఒక హిట్ కొట్టిన తర్వాత నాగార్జునని అప్రోచ్ అవుతాను అని రామ్ గోపాల్ వర్మ అన్నారు. హీరో నాగార్జున మాట్లాడుతూ..36ఏళ్ల తర్వాత రీరిలీజ్ లో ఇలా కలుస్తామని నేను కలలో కూడా అనుకోలేదు. శివకి ఇంత ఆదరణ కల్ట్ ఫాలోయింగ్ ఉంటుందని కలలో కూడా అనుకోలేదు. రాము అప్పుడు ఎంత ఇష్టపడి ప్రతిదీ కేర్ తీసుకుని చేశాడో రీ రిలీజ్ కోసం కూడా గత ఆరు నెలల నుంచి అంతే ఇష్టంతో వర్క్ చేశారు. సౌండ్ అద్భుతంగా వినిపిస్తుంది అని అంటున్నారు. ఇదంత రాము చేసిన ఎఫర్ట్. డాల్బీ అట్మాస్ కి తగ్గట్టుగా ఈ సౌండ్ ని రీ క్రియేట్ చేశారు. సినిమా రిలీజ్ అయినప్పుడు కూడా సౌండ్ బాగుందనే కాంప్లిమెంట్స్ వచ్చాయి. ఫస్ట్ టైం నేను సౌండ్ బాగుంది అనే టాకు శివ సినిమాలో విన్నాను. శివ మాకు చాలా పర్సనల్. రాము స్ట్రాంగ్ విజన్, కన్విక్షన్‌తో వచ్చారు. సినిమాని ఇలా కూడా తీయొచ్చని చూపించారు. నేను కూడా చాలాసార్లు ఎందుకు ఇది కల్ట్ సినిమా అయిందని భావిస్తుంటాను. సంథింగ్ మ్యాజిక్ జరిగింది. 'సినిమా చాలా పెద్ద హిట్. చాలా మంచి సినిమా చేశావ్. ఇది ఎక్కడికి వెళ్లి ఆగుతుందో తెలియదు' అని అప్పట్లో మా నాన్న చెప్పారని నాగార్జున అన్నారు.

## గత జన్మల సినిమాలంటే చాలా ఇష్టం : నాగార్జున

ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఎపిక్ ఫాంటసీ డ్రామా గత వైభవం. సింపుల్ సుని దర్శకత్వంలో సర్వెగర సిల్వర్ స్క్రీన్స్, సుని సినిమాస్ బ్యానర్స్‌పై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రం ఈ నెల 14న విడుదలకు సిద్ధమవుతోంది. ప్రైమ్‌షో ఎంటర్టైన్మెంట్ కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో, ఉత్తర అమెరికా, కెనడాలో విడుదల చేయనున్నారు. మంగళవారం మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. కింగ్ నాగార్జున ముఖ్య అతిధిగా హాజరైన ఈ వేడుక ఘనంగా జరిగింది. నాగార్జున మాట్లాడుతూ.. గత వైభవం సినిమా గురించి ఆషికా చెబుతూనే ఉంది. తను ఈవెంట్‌కి రావాలని అడగడం, నేను వచ్చేయడం వెంటనే జరిగిపోయాయి.



నాకు గత జన్మల సినిమాలంటే చాలా ఇష్టం. నాన్న సినిమా మూగమనసులతో నాకు బాగా పరిచయం. నేను అదే ఇష్టంతో జానకి రాముడు సినిమా చేశాను. రెండు సినిమాలు చాలా సూపర్ హిట్ అయ్యాయి. గత జన్మలు అనేది మన కల్చర్‌లో ఉండిపోయిన ఒక కథ. మనం చిన్నప్పుడు నుంచి వింటుంటాం. గత వైభవం నాలుగు జనరేషన్ల కథ, ట్రైలర్ చూస్తుంటే ఎంత కష్టపడ్డారో తెలుస్తుంది. దుష్యంత్ స్క్రీన్ మీద ఫెంటాస్టిక్‌గా కనిపిస్తున్నాడు. ఆషికా అద్భుతమైన నటి. ఈ సినిమా కోసం ఇద్దరు చాలా కష్టపడ్డారు. ఈ సినిమా బాగా ఆడాలి. హనుమాన్ లాంటి సినిమాను అందించిన చైతన్య ఈ సినిమాని రిలీజ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. విజువల్స్ చాలా అద్భుతంగా ఉన్నాయి. ఈ సినిమా పెద్ద బ్లాక్ బస్టర్ కావాలని కోరుకుంటున్నానన్నారు.

## 'సిగ్మా' ఫస్ట్ లుక్ రిలీజ్



సుబాస్కరన్ లైకా ప్రొడక్షన్స్ నిర్మాణంలో జాసన్ సంజయ్ దర్శకత్వంలో యాక్షన్‌అడ్వెంచర్ సిగ్మా చిత్రం 65 రోజుల షూటింగ్ విజయవంతంగా పూర్తి చేసుకుంది. నాలుగు నెలల పాటు జరిగిన షూటింగ్‌తో దాదాపు తొంబై శాతం పూర్తయింది.ఈ చిత్రానికి సిగ్మా అనే టైటిల్ ఫిక్స్ చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్లో హీరో సందీప్ కిషన్ యాక్షన్ అవతార్ కనిపించారు. బంగారం, నోట్ల కట్టల మధ్య కూర్చొని, తన చేతికి బ్యాండేజ్ కడుతున్నట్లుగా కనిపించిన సందీప్ లుక్ అదిరిపోయింది.సిగ్మా కథ ఒక ధైర్యశాలి, నియమాలకు అతీతమైన వ్యక్తి నేపథ్యంలో వుంటుంది. అతని ప్రయాణం థ్రిల్లింగ్ ట్రెజర్ హంట్, హైస్టేక్స్ క్రిమినల్ హీస్ట్ అంశాలతో కలిపి, యాక్షన్, అడ్వెంచర్ గా వుంటుంది. ఈ చిత్రంలో సందీప్ కిషన్ పూర్తి స్థాయి యాక్షన్ హీరోగా అలరించనున్నారు.

## ఈ సినిమా ఎంతో సంతృప్తి కలిగించింది

మీడియా చిట్ చాట్‌లో అను ఇమ్మాన్యుయేల్



నేషనల్ క్రష్ రశ్మిక మందన్న, టాలెంటెడ్ హీరో దీక్షిత్ శెట్టి జంటగా నటించిన ది గర్ల్ ఫ్రెండ్. ఈ సినిమాలో ఈ మూవీలో దుర్గ క్యారెక్టర్‌లో నటించిన మంచి గుర్తింపు తెచ్చుకున్న టాలెంటెడ్ హీరోయిన్ అను ఇమ్మాన్యుయేల్ మీడియాతో చిట్ చాట్ చేశారు. 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా కోసం ఫస్ట్ ప్రొడ్యూసర్ ధీరజ్ నుంచి కాల్ వచ్చింది. ఆ తర్వాత రాహుల్ కలిసి స్క్రిప్ట్ చెప్పారు. స్క్రిప్ట్, నా క్యారెక్టర్ గురించి విన్న తర్వాత తప్పకుండా ఈ మూవీలో నటించాలని అనిపించింది. అమ్మాయిల గురించి ఒక మంచి విషయం చెప్పే మూవీ ఇది. ఈ చిత్రంలో నటించడం ఎంతో సంతృప్తిని ఇచ్చింది. ఇది గీతా ఆర్ట్స్ సినిమా కాబట్టి బాగా చూసుకుంటారనే నమ్మకం ఉంది. 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమాకు వస్తున్న రెస్పాన్స్ హ్యాపీగా ఉంది. అయితే నేను ఏ సినిమా చేసినా ఆ మూవీకి ఎలాంటి ప్రశంసలు వస్తాయని ఆశించను. నేను తెలుగు తమిళంలో స్టార్ హీరోలతో నటించాను. అయితే నా కెరీర్‌లో కొన్ని సినిమాలు చేసి ఉండకూడదు అని ఇప్పుడు రిగ్రెట్ ఫీల్ అవుతున్నా. కొన్ని కమర్షియల్ మూవీస్‌లో నటించడం వల్ల నటిగా నాకు ఎలాంటి సంతృప్తి లభించదు. నాలుగు డ్యాన్స్ స్టెప్స్ వేసి, ఏవో డైలాగ్స్ చెప్పిస్తారు. ఈ రొటీన్ మూవీస్ చేసేప్పుడు నేను రియలైజ్ కాలేదు గానీ ఇకపై అలాంటి మూవీస్ చేయకూడదు అని నిర్ణయించుకున్నా. 'ది గర్ల్ ఫ్రెండ్' లాంటి మూవీస్‌ను మన సంతృప్తి కోసం, ఏదైనా కొత్తగా నేర్చుకునేందుకు చేశాను. ఈ చిత్రంలో దుర్గ క్యారెక్టర్‌లో నటించాను. ఫస్టాఫ్‌లో కొన్ని సీన్స్ చూస్తున్నప్పుడు నా క్యారెక్టర్‌ను ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారో అనే భయంవేసింది. కానీ ఆ తర్వాత డైరెక్టర్ రాహుల్ నా క్యారెక్టర్‌ను తీర్చిదిద్దిన విధానంతో హ్యాపీగా ఫీలయ్యా. రాహుల్ చాలా సెన్సిటివ్ డైరెక్టర్. నా క్యారెక్టర్ ఒక్కటే కాదు, అన్ని పాత్రలను చేయి పట్టి నడిపించారు. యూఎస్ నుంచి ఇండియాకు వచ్చినప్పుడు నా నేటివ్ ప్లేస్ కేరళకు వెళ్లలేదు. డైరెక్ట్‌గా హైదరాబాద్ వచ్చా. అప్పటి నుంచి హైదరాబాద్ వీడలేదు. మలయాళంలో పృథ్వీరాజ్ ఆడుజీవితం సినిమాకు ఆడిషన్ చేశా, కానీ ఆ మూవీ చేయలేకపోయా. మంచి అవకాశం వస్తే మలయాళంలో మూవీ చేస్తా అని చెప్పారు.



## ఉప ముఖ్యమంత్రి భట్టి చేతుల మీదుగా 'పిఠాపురంలో' టైటిల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రేయసి రావే' ఫేమ్ మహేష్చంద్ర దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పిఠాపురంలో'. దీనికి ఉపశీర్షిక 'అలా మొదలైంది'. డా.రాజేంద్రప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్,మణిచందన, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష తదితరులు ప్రధాన తారాగణం. మహేష్చంద్ర సినిమా టీమ్ పతాకంపై దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్ఎం మురళి (గోదారి కిట్టయ్య) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. 'ఈ సినిమా కాన్సెప్ట్ గురించి దర్శకులు చెప్పారు. మంచి సందేశాత్మక చిత్రంగా అనిపిస్తోంది. యువతరం కుటుంబ సమేతంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి, ఎలా ఎదగాలనే సందేశం ఈ సినిమాలో ఉంది. ఈ చిత్రాన్ని అందరూ ఆదరించాలి' అని చెప్పారు.

డా.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఇవాళ సమాజంలో ఏం జరుగుతుందనే పాయింట్ని దర్శకుడు మహేష్చంద్ర అద్భుతంగా డీల్ చేశాడు. స్టోరీ నచ్చి నేను కూడా ఇష్టంగా ఈ సినిమా చేశాను. 'ఆ నలుగురు', 'మీ శ్రేయోభిలాషి', 'ఓనమాలు' తరహాలోనే సందేశాన్ని అందిస్తూనే యువతరాన్ని ఆకట్టుకునే అంశాలున్న సినిమా ఇది అని తెలిపారు. నటుడు పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. ఇది మూడు కుటుంబాల కథ. ఈ ఇంటర్నెట్ యుగంలో తల్లిదండ్రులంటే గౌరవం కనబరచని యువతకు కనువిప్పు కలిగించే చిత్రం ఇది అని పేర్కొన్నారు.

దర్శకుడు మహేష్చంద్ర మాట్లాడుతూ.. 'నా తొలి సినిమా 'ప్రేయసి రావే' నాకెంతో గొప్ప పేరు తీసుకొచ్చింది. ఈరోజుకీ ప్రేక్షకుల గుండెల్లో నిలిచిపోయి ఉంది. 'పిఠాపురంలో' సినిమా కూడా అదే స్థాయిలో నిలిచిపోయే సినిమా. నా మనసుకి నచ్చిన కథ ఇది. ముగ్గురు తండ్రుల కథలా అనిపిస్తూనే మూడు జంటల మధ్య నడిచే కథ ఇది. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నియోజకవర్గమైన 'పిఠాపురం' పేరుతోనే ఈ సినిమా తీశాం. ఈ టైటిల్ని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆవిష్కరించడం చాలా చాలా సంతోషంగా ఉంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. వచ్చే నెలలోనే ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం అని తెలిపారు.

## భారీ ఎన్‌కౌంటర్ (మొదటి పేజీ తరువాయి)

గాయపడ్డ నలుగురు నక్సల్స్‌ను సంఘటనా స్థలంలోనే అరెస్టు చేసినట్లు బీజాపూర్ ఎస్పి జితేంద్ర యాదవ్ పేర్కొన్నారు. సంఘటనా స్థలంలోనే వారికి చికిత్స అందించి.. అంబులెన్స్ ద్వారా బీజాపూర్ జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

**వారు రాజకీయ ద్రోహులు : ప్రజా యుద్ధ పంథాలు కొనసాగిస్తాం**

సోను, సతీష్‌లు రాజకీయంగా దిగజారిన ద్రోహులని వారికి మావోయిస్టు పార్టీ పంథాను తప్పు పట్టే హక్కు లేదని పేర్కొంటూ మావోయిస్టులు ఒక లేఖ విడుదల చేశారు. కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో విడుదలైన ఈ లేఖలో సతీష్, సోను లు విచ్ఛిన్నకర వైఖరితో మరి కొందరి క్యాడర్లను మోసగించి ప్రభుత్వాలకు లొంగిపోయారని ఆ లేఖలో పేర్కొన్నారు. దశాబ్దాల తమ రాజకీయ జీవితాన్ని వీరిద్దరు రాజ్యంతో కుమ్మక్కై ముగించుకున్నారని వారు ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపిన కారణంగానే కొద్ది రోజుల పాటు కాల్పుల విరమణ పాటించి లొంగుబాటును సుగమం చేశారన్నారు. మావోయిస్టు పార్టీ దీర్ఘకాలిక ప్రజా యుద్ధ పంథాను కొనసాగిస్తుందని లేఖలో అభయ్ పేర్కొన్నారు. పరిస్థితులకు అనుగుణంగా ఎదగకపోవడం వల్లనే సోను, సతీష్‌లు తప్పుదారి పట్టారని లేఖలో ఆరోపించారు. పార్టీ రాజకీయ ఎత్తుగడలను అమలు చేయడంలోనూ వారు విఫలమయ్యారని లేఖలో అభయ్ పేర్కొన్నారు. దేశంలో హిందుత్వ ఫాసిస్టు రాజ్యం కారణంగా అంతులేని అన్యాయాలు, హత్యాచారాలు జరుగుతున్నాయని ఇందుకు సంబంధించి ప్రజల్లో తీవ్రమైన నిరసన, ప్రతిఘటన కొనసాగుతున్నాయన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ మావోయిస్టు దేశంలో వ్యవసాయ విప్లవం ద్వారా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి చేసి సమ సమాజ స్థాపన దిశగా ప్రయాణం చేస్తూ ఉంటుందని అభయ్ తెలిపారు.

## రూ.12.99 కోట్లు (మొదటి పేజీ తరువాయి)

రెవెన్యూ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ ఉత్తర్వులు (జిఓఆర్‌టి 66)విడుదల చేశారు. జిల్లా కలెక్టర్లు పంపించిన నివేదికల ప్రకారం 15 జిల్లాలలో 8662 ఇండ్లు దెబ్బతిన్నాయి. ఈ ఇండ్ల బాధిత కుటుంబాలకు తక్షణ సాయంగా రూ.12.99 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులను నేరుగా బాధిత కుటుంబాల బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారు. అక్టోబర్ 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు వరుసగా నాలుగు రోజులు రాష్ట్రంలోని 16 జిల్లాలలో భారీ వర్షాలు కురిశాయి. వరంగల్, హన్మకొండ, వికారాబాద్, వనపర్తి, రంగారెడ్డి, కరీంనగర్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, యాదాద్రి భువనగిరి, సిద్ధిపేట, రాజన్న సిరిసిల్ల, ములుగు, మహబూబాబాద్, సూర్యాపేట, భద్రాద్రి కోతగూడెం, నల్గొండ జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని జిల్లా కలెక్టర్లు తమ నివేదికలలో తెలియజేసినట్లు ప్రభుత్వం వివరించింది.

## చిక్కులు లేని ప్రయాణం


(మొదటి పేజీ తరువాయి)

2050 సిద్ధం చేసే ప్రక్రియ మొదలైంది. ఈ సిఎంపి ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్–2050లో కీలక భాగంగా ఉంటుంది. సుస్థిరమైన, దీర్ఘకాలిక రవాణా వ్యూహాన్ని రూపొందించడం, అలాగే జాతీయ పట్టణ రవాణా విధానం (ఎన్‌యుటిపి)– 2006/2014, హెచ్ఎండిఎ, జిహెచ్ఎంసి, హెచ్ఎంఆర్ఎల్ తదితర సంస్థల ప్రణాళికలకు అనుగుణంగా సమర్థవంతమైన పెట్టుబడి మార్గదర్శకాలను గుర్తించడం ఈ ప్రణాళిక ప్రధాన ఉద్దేశం. సిఎంపి తయారీ బాధ్యతను ఎం/ఎస్ లీ అసోసియేట్స్ సౌత్ ఏషియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు అప్పగించారు. ఈ నేపథ్యంలో సిఎంపి – 2050 ముసాయిదా నివేదికపై ముఖ్య భాగస్వామ్య విభాగాల సమావేశం మంగళవారం రసూల్‌పురాలోని హైదరాబాద్ మెట్రోరైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి హెచ్ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అధ్యక్షత వహించారు. లీ అసోసియేట్స్ అందించిన ముసాయిదా నివేదికపై అధికారులు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో హెచ్ఎంఆర్ఎల్, హెచ్ఎంయుటిఎ, జిహెచ్ఎంసి, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎంఆర్‌డిసిఎల్), హెచ్‌జిసిఎల్, హెచ్ఆర్‌డిసిఎల్, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్(డిటిసిపి), టిఎస్ఐఐసి, టిజిఎస్ ఆర్‌టిసి, ట్రాఫిక్ పోలీసు (హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ), హెచ్ఎండిఎ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ విభాగాల మధ్య సమన్వయం అత్యంత అవసరమని తెలిపారు. సిఎంపి ముసాయిదా నివేదికపై ప్రతి శాఖ సవివరంగా పరిశీలించి, తమ అభిప్రాయాలు, సూచనలు, సిఫారసులు త్వరితగతిన సమర్పించాలని సూచించారు. తద్వారా నివేదికను మెరుగుపరిచి, తుది రూపంలోకి తీసుకువెళ్లవచ్చు అని అన్నారు. సిఎంపి–2050 లక్ష్యం వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంత ప్రజల అవసరాలను తీర్చగల, సమర్థవంతమైన, సురక్షితమైన, సుస్థిర రవాణా వ్యవస్థను నెలకొల్పడం ముఖ్య ఉద్దేశమన్నారు. భవిష్యత్ పెట్టుబడులకు మార్గదర్శకత్వం ఇచ్చే సమతుల్య పట్టణాభివృద్ధి దిశగా ఈ ప్రణాళిక దోహదం చేయనుందని చెప్పారు. ఈ సమావేశంలో హెచ్ఎండిఎ డైరక్టర్ కె.విద్యాధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ సాగులో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉండాలి

నిర్లక్ష్యం వహించే కంపెనీలపై కఠిన చర్యలు తప్పవు

కంపెనీల ప్రతినిధులతో మంత్రి తుమ్మల సమీక్షా సమావేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఏడాదికి రెండు లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యంగా కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. ఆయిల్ పామ్ విస్తరణలో నిర్లక్ష్యం వహించే కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయిల్ పామ్ కంపెనీల ప్రతినిధులతో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సచివాలయంలో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తక్కువ పురోగతిలో ఉన్న వరంగల్, నారాయణపేట, వనపర్తి, రాజన్న సిరిసిల్ల, గద్వాల్, కరీంనగర్, నిజామాబాద్, జగిత్యాల, ఆదిలాబాద్ జిల్లాల్లో ఆయా కంపెనీలు లక్ష్యాలకు అనుగుణంగా వేగంగా పని చేయాలని మంత్రి ఆదేశించారు. ఆయిల్ పామ్ ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషిస్తోందన్నారు. రాష్ట్రంలో 2.74 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, ఇందులో 73,696 మంది రైతులు భాగస్వామ్యలయ్యారని వివరించారు. 202122 నుండి ఇప్పటి వరకు 2.28 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 1.25 లక్షల ఎకరాల లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటి వరకు 31,158 ఎకరాల్లో మాత్రమే సాగు జరిగిందని, మార్చి నాటికి మిగిలిన 93,842 ఎకరాలు సాగులోకి రావాల్సి ఉందన్నారు. గత ఐదు సంవత్సరాల్లో రాష్ట్రానికి 6.54 లక్షల ఎకరాల లక్ష్యం కేటాయించగా, కేవలం 2.28 లక్షల ఎకరాలు మాత్రమే సాగులోకి వచ్చిందని వివరించారు.

**కంపెనీలు బాధ్యతతో వ్యవహరించాలి**

ఆయిల్ పామ్ సాగు విస్తరణలో కంపెనీలు మరింత బాధ్యతతో వ్యవహరించాలని, ప్రతి కంపెనీ తమ పరిధిలోని జిల్లాల్లో సరిపడా సిబ్బందిని నియమించుకుని, రైతులతో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉండాలని మంత్రి తుమ్మల సూచించారు. తోటల యాజమాన్యంలో నీటి వినియోగం, ఎరువుల పంపిణీ, అంతర పంటలు, కలుపు నివారణ వంటి అంశాలపై పూర్తి దృష్టి సారించాలని చెప్పారు. కొత్త తోటలలో గెలల దిగుబడులు తగ్గకుండా పర్యవేక్షించడం,విజయవంతమైన రైతుల అనుభవాలను కొత్త రైతుల ప్రోత్సాహానికి వినియోగించడం అవసరమని సూచించారు. రాబోయే ఏడాదికి ఆయిల్ పామ్ మొక్కల డిమాండ్ పెరగనున్నందున ప్రతి కంపెనీ తన లక్ష్యానికి అను గుణంగా నర్సరీలను ఏర్పాటు చేసుకుని నాణ్యమైన మొక్కలు రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతుల సందేహాల నివృత్తి కోసం కంపెనీలు తమ పరిధిలో రైతు సలహా కేంద్రాలను ఏర్పాటు చేయాలని, రైతు వేదికల కార్యక్రమాల్లో కంపెనీ ప్రతినిధులు తప్పని సరిగా పాల్గొని రైతులతో చర్చించాలని ఆదేశించారు. వచ్చే సంవత్సరానికల్లా ప్రతి ఉమ్మడి జిల్లాలో ఒక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ స్థాపించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

**త్వరలోనే ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీల ప్రారంభం**

త్వరలోనే రాష్ట్రంలో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు ప్రారంభంకానున్నాయని తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. ఈనెలలో నర్మెట్ట (సిద్దిపేట)లో ఆయిల్ ఫెడ్ ఫ్యాక్టరీ (30120 టన్నుల సామర్థ్యం), 2026, జనవరిలో పెద్దపల్లిలోని తిరుమల ఆయిల్ ఫ్యాక్టరీ (15 టన్నుల సామర్థ్యం), ఖమ్మంలో గోద్రేజ్ అగ్రోవెట్ ఫ్యాక్టరీ (1560 టన్నుల సామర్థ్యం) వచ్చే ఏడాది ఫిబ్రవరిలో వనపర్తిలో ప్రీయూనిక్ ఫ్యాక్టరీ (1530 టన్నుల సామర్థ్యం), జూన్‌లో కల్లూరు గూడెం (ఖమ్మం)లో ఆయిల్ ఫెడ్ ఫ్యాక్టరీ (1560 టన్నుల సామర్థ్యం) బీచుపల్లి (గద్వాల్)లో ఆయిల్ ఫెడ్ ఫ్యాక్టరీ (15 టన్నుల సామర్థ్యం) ఆగస్టు నెలలో ములుగు జిల్లాలో కె.ఎన్ బయో సైన్సెస్ ఫ్యాక్టరీ (10 టన్నుల సామర్థ్యం) ప్రారంభం కానున్నట్లు తుమ్మల వివరించారు. ఈ సమావేశంలో ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, ఆయిల్ పామ్ కంపెనీల ప్రతినిధులు, ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.

## అంతిమ వీడ్కోలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతాల నుండి భారీ సంఖ్యలో వచ్చి పాల్గొన్నారు. అందెశ్రీ సతీమణి మల్లుబాయి, కుమార్తెలు వాక్కులమ్మ, వెన్నెల, వేకువ, కుమారుడు దత్తు సంప్రదాయ పద్ధతిలో కర్మకాండలను నిర్వహించగా, అధికారిక లాంఛనాలతో అందెశ్రీ అంత్యక్రియలు పూర్తయ్యాయి. అందెశ్రీ కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి ఓదార్చారు. అంతిమ సంస్కార కార్యక్రమాన్ని దగ్గరుండి పరిశీలించారు. సాహిత్య సమరయోధుడి అంతిమయాత్రలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, ధనసరి అనసూయ సీతక్క, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, డాక్టర్ కె.కేశవరావు, టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బి.మహేష్ కుమార్ గౌడ్, ప్రజాప్రతినిధులు, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, రాధికా గుప్తా తదితర జిల్లా అధికారులు సైతం అంతిమ సంస్కారాల్లో పాల్గొన్నారు.

**పద్మశ్రీ ఇవ్వాలని మరోమారు కేంద్రానికి లేఖ రాస్తాం : సిఎం**

అందెశ్రీ రాసిన ప్రతీ పాట తెలంగాణలో స్ఫూర్తిని నింపిందని, అందుకే ఆయన రాసిన 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని పాఠ్యాంశంగా చేర్చేందుకు, మంత్రివర్గంలో నిర్ణయం తీసుకుంటామని, అందెశ్రీ పేరుతో ఒక స్మృతి వనాన్ని ఏర్పాటు చేస్తామని, ఆయన కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. అందెశ్రీ అంత్యక్రియలలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశమిస్తూ అందెశ్రీ పాటల సంకలనం నిప్పుల వాగు ఒక భగవద్గీతగా, బైబిల్‌గా, ఖురాన్‌గా తెలంగాణ సమస్యలపై పోరాడే వారికి ఒక మార్గదర్శకంగా ఉపయోగపడుతుందన్నారు. అందుకే 20 వేల పుస్తకాలను ముద్రించి తెలంగాణలోని ప్రతీ లైబ్రరీలో నిప్పుల వాగును అందుబాటులో ఉంచుతామన్నారు.



అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలని గత ఏడాది కేంద్రానికి లేఖ రాశామని, ఈ ఏడాది కూడా కేంద్రానికి లేఖ రాస్తామని సిఎం వెల్లడించారు. అందెశ్రీకి పద్మశ్రీ గౌరవం దక్కేలా కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి సహకరించాలని, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఆయనను పద్మశ్రీతో గౌరవించుకునేందుకు కృషి చేద్దామన్నారు. పశువుల కాపరిగా, తాపీ మేస్త్రీగా, తెలంగాణ ఉద్యమకారుడిగా రాష్ట్ర సాధనలో గొప్ప పాత్ర పోషించిన వ్యక్తి అందెశ్రీని కోల్పోవడం తెలంగాణ సమాజంతో పాటు వ్యక్తిగతంగా తనకు తీరని లోటు అన్నారు. టిపిసిసి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆయనను కలిసి తెలంగాణ ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన పాత్ర ఉండాలని కోరానని, గద్దర్‌తో పాటు అందెశ్రీ కూడా ప్రజల్లో స్ఫూర్తి నింపాయన్నారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com